ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

బుధవారం, మార్చి 25, 2026 | సంపుటి - 22 | సంచిక 177 | వెల - 7 | పేజీలు - 12 - 8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam



## క్షయ పట్ల అప్రమత్తం అవసరం

- వ్యాధి లక్షణాలు గుర్తించి చికిత్స తీసుకోండి
- ప్రభుత్వం ఉచితంగా వైద్యం అందిస్తోంది
- నాపా ప్రతినిధుల అవేర్‌నెస్ కార్యక్రమం అభినందనీయం
- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

6

## విలువ లేని చోట ఉండలేను..!

- రాజీనామాకు కట్టుబడి ఉన్నా
- పిసిసితో మాజీ మంత్రి జీవన్ రెడ్డి
- జీవన్‌రెడ్డితో ఫలించని పీసీసీ చీఫ్ దౌత్యం
- పార్టీ వీడొద్దని కోరిన మహేశ్ గౌడ్
- నిర్ణయం ఎవరి చేతుల్లోనూ లేదన్న జీవన్ రెడ్డి

12





## కారుణ్యమరణంతో హరీష్ రాణా మృతి

న్యూఢిల్లీ, (నినాదం): సుప్రీం కోర్టు ద్వారా కారుణ్య మరణానికి అనుమతి పొందిన హరీశ్ రాణా మృతి చెందాడు. సుమారు 13 ఏళ్లపాటు కోమాలో ఉండి జీవచ్ఛవంలా మారిన 32 ఏళ్ల హరీశ్ రాణా కారుణ్య మరణానికి సర్వోన్నత న్యాయస్థానం ఇటీవల అనుమతిచ్చిన విషయం తెలిసిందే.

6

## ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌కు బెదిరింపు మెయిల్

మోడీ, అమిత్ షా, జైశంకర్‌లను కూడా లేపేస్తామని హెచ్చరిక

ఢిల్లీ మెట్రో, అసెంబ్లీ లకు బాంబు బెదిరింపులు



*దేశంలోని ప్రముఖులను హతమారుస్తామంటూ ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ విజేందర్ గుప్తాకు ఒక బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది. దీంతో ఈ అంశంపై భద్రతా సిబ్బంది, అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టారు.*

# ఇంధనంపై అపోహలు వద్దు

## రాష్ట్ర ప్రభుత్వం క్లారిటీ!

### పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ కొరత లేదని స్పష్టం

### ప్రజలు ఆందోళనకు గురి కావద్దు

### స్టేట్ సివిల్ సప్లై శాఖ విజ్ఞప్తి




**హైదరాబాద్, మార్చి 24 (నినాదం):**

తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ (ఎల్పీజీ) కొరత లేదని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ స్పష్టంచేసింది. రిఫైనరీల నుంచి స్థానిక డిపోల వరకు ఇంధన సరఫరా వ్యవస్థ పూర్తిస్థాయిలో సజావుగా కొనసాగుతోందని తెలిపింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రజల నిత్యావసరాలకు సరిపడా ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయని పేర్కొంది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర సివిల్ సప్లై మీడియాకు పంపిన లేకలో స్పష్టత నిచ్చింది.

ఇటీవల కొన్ని పెట్రోల్ బంకుల వద్ద కనిపిస్తున్న పొడవైన క్యూలు, తాత్కాలికంగా "నిల్వలు లేవు" బోర్డులు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నప్పటికీ, దీనికి అసలు కారణం కొరత కాదని అధికారులు స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వ్యాప్తి చెందుతున్న తప్పుడు వదంతుల వల్ల ప్రజలు భయంతో ఒక్కసారిగా ఇంధనం కొనుగోలు చేయడానికి పరుగులు తీస్తుండటమే ఈ పరిస్థితికి దారితీస్తోందని తెలిపారు. అవసరానికి మించి వాహనాల ట్యాంకులను పూర్తిగా నింపుకోవడం వల్ల కృత్రిమ కొరత ఏర్పడుతోందని పేర్కొన్నారు.

అదనంగా, ఆయిల్ మార్కెటింగ్ సంస్థలు అమలు చేస్తున్న ముందస్తు చెల్లింపు విధానంలో చేసిన మార్పుల కారణంగా కొంతమంది డీలర్లకు తాత్కాలిక ఇబ్బందులు ఎదురైనప్పటికీ, ఇది సరఫరాపై ప్రభావం చూపే అంశం కాదని స్పష్టం చేశారు. పరిస్థితిని సమీక్షిస్తూ, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు, పెట్రోలియం సంస్థలు, పోలీసు శాఖలతో కలిసి పెట్రోల్ బంకులను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఇంధనాన్ని అక్రమంగా నిల్వ చేయడం, బ్లాక్ మార్కెట్‌లో విక్రయించడం లేదా గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు మళ్లించడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు విజ్ఞప్తి ప్రజలు ప్రశాంతంగా ఉండాలని, భయాందోళనలకు లోనై అనవసరంగా ఇంధనం కొనుగోలు చేయవద్దని ప్రభుత్వం కోరింది. అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని, సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు సమాచారాన్ని నమ్మకుండా, ఇతరులకు పంపకుండా ఉండాలని సూచించింది. ఏవైనా సందేహాలు లేదా అక్రమాలపై ఫిర్యాదుల కోసం పౌర సరఫరాల శాఖ టోల్ ఫ్రీ సహాయ కేంద్రం 1967 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపింది.

## కమాండర్ పాపారావు సరెండర్..?

- ఆయనే ప్రస్తుత మోస్ట్ వాంటెడ్
- బలగాల ఆఖరి గాలింపు తన కోసమే
- ఆయుధాలు..అనుచరులతో బయటకు
- నేడో రేపో లొంగుబాటు
- ఫలిస్తున్న మధ్యవర్తుల ప్రయత్నాలు

**భద్రాద్రి ఏజెన్సీ ప్రతినిధి (నినాదం):**



లొంగిపోవడానికి వస్తున్న పాపారావు

ఆపరేషన్ 'కగార్' (2024-26) దెబ్బకి కకావికలమైన మావోయిస్టు పార్టీలో మిగిలి ఉన్న వారిలో ముఖ్యుడైన మావోయిస్టు కీలక నేత కమాండర్ పాపారావు లొంగుబాటు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పాపారావు టీమ్ కోసం భద్రతా బలగాలు ముమ్మరంగా గాలిస్తున్న నేపథ్యంలో ఆయన లొంగుబాటు వార్త తెరపైకి వచ్చింది. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటి (డికెఎస్‌జడ్‌సి) మెంబర్, పశ్చిమ బస్తర్ డివిజన్ కమిటి కమాండర్ పాపారావు అలియాస్ సున్నం చంద్రయ్య అలియాస్ మంగు లొంగుబాటుకు మధ్యవర్తులు చేసిన ప్రయత్నాలు ఫలించినట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఆయన 12 నుంచి 17 మంది తన అనుచరులతో ఏకె 47, ఎస్ఎల్ఆర్ వంటి ఆయుధాలతో లొంగిపోవడానికి సిద్ధమైనట్లు వార్తలు అందుతున్నాయి. ప్రస్తుతం భద్రతా బలగాలు మోస్ట్ వాంటెడ్‌గా భావిస్తున్న పాపారావుపై రూ 25 లక్షల రివార్డు ఉంది. రెండు దశాబ్దాల సాయుధ పోరాట చరిత్ర కలిగిన పాపారావు, హిడ్మా ఎన్‌కౌంటర్, దేవా లొంగుబాటు అనంతరం మిగిలిన దళాలకు దిక్సూచిగా మారారు. భద్రతా బలగాల కన్నుగప్పి నాలుగు దళాలతో ▸▸తరువాయి 2లో..

# మతం మారితే ఎస్సీ హక్కులు కోల్పోతారు

- క్రిష్టియానిటిలో కుల వ్యవస్థ లేదు
- క్రిష్టియన్ మతం స్వీకరిస్తే ఎస్సీ,ఎస్టీ హక్కులు ఉండవు
- హిందువుల,సిక్కు, బౌద్ధ మతస్థులకే కుల హక్కులు
- ఎపి హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ,మార్చి24(నినాదం):** మతమార్పిడికి సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మతం మారిన ఎస్సీలకు ఆ హోదా ఉండదని స్పష్టం చేసింది. క్రిష్టియన్‌లోకి మారిన వారికి ఎస్సీ కింద లభించే వెసలుబాటు ఉండదని తేల్చింది. మతం మారితన తరవాత అట్రాసిటీ చట్టం కింద కేసులపై సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. క్రైస్తవంలోకి మారిన వారు ఎస్సీ హక్కులు పొందలేరని స్పష్టం చేసింది. హిందువులు, బౌద్ధులు, సిక్కులు మాత్రమే ఆ హక్కులు పొందుతారని పేర్కొంది. ▸▸తరువాయి 2లో..

## పిజి వైద్యసీట్ల కౌన్సిలింగ్ పొడిగింపు అసాధ్యం



### తేల్చి చెప్పిన సుప్రీం ధర్మాసనం

**న్యూఢిల్లీ,మార్చి24(నినాదం):** తెలుగు రాష్ట్రాల్లోని పీజీ వైద్య విద్యార్థులకు, ముఖ్యంగా మేనేజ్‌మెంట్ కోటా సీట్ల కోసం ఎదురుచూస్తున్న వారికి సుప్రీంకోర్టు తీర్పు పెద్ద షాక్‌గా మారింది. పీజీ వైద్య సీట్ల భర్తీకి సంబంధించి కౌన్సెలింగ్ గడువును పొడిగించే ప్రసక్తే లేదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. మిగిలిపోయిన పీజీ వైద్య సీట్ల భర్తీ కోసం కౌన్సెలింగ్ గడువును ▸▸తరువాయి 2లో..

## ఈవీ వాహనాలపై 20శాతం డిస్కౌంట్



- పెద్ద ఎత్తున ఈవీ ఛార్జింగ్ సెంటర్లు ఏర్పాటు
- ముందుకు వచ్చిన మహీంద్రా తదితర కంపెనీలు
- రవాణామంత్రిపొన్నంప్రభాకర్

2

# పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు

## కోవిడ్ తరహా సంక్షోభం నేడు అఖిలపక్షంతో ప్రభుత్వం భేటీ ?

**న్యూఢిల్లీ,మార్చి24(నినాదం):**

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల అంశంపై సమీక్ష నిర్వహించే నేపథ్యంలో బుధవారం కేంద్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. పశ్చిమాసియా అంశంపై పార్లమెంట్‌లో ప్రధాని మోదీ ప్రసంగించిన విషయం తెలిసిందే. సోమవారం లోక్‌సభలో, ఇవాళ రాజ్యసభలో ఆయన ప్రసంగించారు. ఇరాన్ సంక్షోభం వల్ల ప్రపంచవ్యాప్తంగా దీర్ఘకాలిక ప్రభావం పడే అవకాశాలు ఉన్నట్లు లోక్‌సభలో మోదీ అన్నారు. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ధీటుగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. కోవిడ్‌ను ఎదుర్కొన్న రీతిలో రాబో యే రోజులకు సన్నద్ధంగా ఉండాలన్నారు. ఇవాళ రాజ్యసభలో కూడా మోదీ ఈ అంశాలనే ప్రస్తావించారు. అన్ని వనరుల నుంచి గ్యాస్‌ను, క్రూడ్ ఆయిల్‌ను సమీకరించే ప్రయత్నం చేస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. ▸▸తరువాయి 2లో..



# గ్యాస్ కొరతపై నిజాలు చెప్పండి

## అసెంబ్లీ గన్‌పార్క్ వద్ద బిఆర్ఎస్ ఆందోళన



**హైదరాబాద్, నినాదం:**

రాష్ట్రంలో నెలకొన్న గ్యాస్ కొరతపై బీఆరఎస్ సభ్యులు నిరసన తెలిపారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ముందుగా గన్‌పార్క్ వద్దకు చేరుకున్న బీఆరఎస్ సభ్యులు గ్యాస్ సిలిండర్ల ప్లకార్డులతో నిరసన తెలిపారు. పెరిగిన ధరలపై ఆందోళన వ్యక్తం చేశారు. అవే ప్లకార్డులతో అసెంబ్లీకి బయల్దేరి వెళ్లారు. గ్యాస్ కొరత లేదని చెబుతూనే హోటళ్లు, చిరు వ్యాపారులకు వాణిజ్య సిలిండర్ల సరఫరాను నిలిపివేయడంపై బీఆరఎస్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్యాస్ కొరత కారణంగా సాధారణ ప్రజానీకంతో పాటు చిరు వ్యాపారులు, ▸▸తరువాయి 2లో..

# సీఎం సాబ్.. ఇదీ తతంగం... ఏదీ మీ యంత్రాంగం.?

- ఎగ్గొట్టినవి చెల్లించాలని మీరు..
- మీవి మీకే ఇస్తామని డిఫాల్టర్లు
- వారికి కల్పతరువుగా దొంగ మిల్లర్లు
- అంతాతెలిసే జరుగుతోందంటున్న జనాలు
- ఇదీ మెట్ పల్లి రేషన్ మాఫియా కథాకమామిషు

**మెట్‌పల్లి, మార్చి 24 (నినాదం):**

*మెట్ పల్లి రోడ్లపై రేషన్ బియ్యం అక్రమ రవాణా వాహనాలు దర్జాగా తిరుగుతున్నవి.ఇది చూసిన స్థానికులు డియర్ సీయం సాబ్ ఇదీతతంగం మరి ఏదీ మీ యంత్రాంగం అని ప్రశ్నిస్తున్నారు. ప్రజలపై,రాష్ట్రంపై తమరికే కాదు తమరి యంత్రాంగానికీ ఉండాలని కితాబిస్తున్నారు.*

పట్టణంలో దర్జాగా ఓ వాహనం రేషన్ బియ్యం బస్తాలు వేసుకుని ఖమ్మరిపల్లి వెల్తూ అక్కడి అందరికళ్లకూ చిక్కింది. దీంతో ప్రస్తుతం దూకుడు సాగిస్తున్న సివిల్ సప్లై శాఖ సీఎంఆర్ ల రికవరీ ప్రోగ్రాం సైతం విశ్లేషకులకు గుర్తొచ్చింది. ప్రక్షాళన సరే అసలు మూలాలను గుర్తిస్తేనే అది సాధ్యపడుతుందని వారు గుర్తుచేస్తున్నారు. సింహాద్రిని మించిన బద్రీయే ఇక్కడ ఈ మాఫియాను నడిపిస్తోందని సామాన్యులు సహా అందరికీ తెలిసినా ఏమాత్రం చర్యలు కానరావటంలేదు. ఆ దిశగా అసలు ప్రయత్నమే జరగటంలేదు కనుక ఓసారి మెట్ పల్లి సింహాద్రివైపు చూడండని స్థానికులు చిన్న హింటిస్తున్నారు. కాగా మంగళవారం పట్టణంలో దర్జాగా వెళుతూ కంటపడ్డ సదరు పీడీఎస్ వాహనమే పై పూర్తి ఎపిసోడ్ కు సాక్ష్యంగా నిలిచింది.

**ఇక మిషన్లే లేని రైస్ మిల్లు, ప్రతీ సీజన్ కు సంబంధిత అధికారులు వాటికి కోట్ల రూపాయల ధాన్యం కేటాయించటం తద్వారా వ్యక్తిగత ఖాతాలను సర్కారు సొమ్ముతో నింపుకోవటం మొదలగు అంశాల భాగోతంపై**

నినాదం తర్వాతి సంచికలో మరిన్ని వివరాలు..



పీడీఎస్ రైస్ బ్యాగుల్ని అక్రమంగా తరలిస్తున్న ఓ వాహనం



## కమాండర్ పాపారావు సరెండర్..?

ఆయన ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలోనే సంచరిస్తున్నట్లుగా వార్తలు వచ్చాయి. కగార్ ఆపరేషన్ చివరి దశకు వచ్చింది. 31 మార్చి 2026 నాటికి సాయుధ మావోయిస్టు ఉద్యమాన్ని నిర్మూలిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పెట్టిన గడువు ఇంకా 7 రోజులే మిగిలి ఉంది. ఈలోపు మిగిలిన నక్సల్స్‌ని సరెండర్ చేయించడం లేదా ఎన్‌కౌంటర్‌లో క్లోజ్ చేయడం అనేది ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం, పోలీసుల ముందు ఉన్న లక్ష్యం. ఈ నేపథ్యంలో ఒకవైపు గాలింపు ముమ్మరం చేసి మరోవైపు లొంగుబాటుకి ద్వారాలు తెరిచారు. ఈ క్రమంలోనే మధ్యవర్తులు ప్రయత్నాలు ఆరంభించారు. అందులో భాగంగానే రంగంలోకి దిగిన మధ్యవర్తుల ద్వారా ఇప్పటికే బస్తర్ ప్రాంత పోలీస్ అధికారులకు పాపారావు సరెండర్ సమాచారం అందినట్లు తెలుస్తోంది. అయితే పాపారావు లొంగుబాటు విషయమై ఛత్తీస్‌గఢ్ పోలీసులు ఎలాంటి ప్రకటన చేయలేదు. అలాగే లొంగుబాటు వార్తలను కూడా ఖండించలేదు.

## ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌కు బెదిరింపు మెయిల్

**న్యూఢిల్లీ, నినాదం:**

దేశంలోని ప్రముఖులను హతమారుస్తామంటూ ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ విజేందర్ గుప్తాకు ఒక బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది. దీంతో ఈ అంశంపై భద్రతా సిబ్బంది, అధికారులు దృష్టిసారించి తగిన చర్యలు చేపట్టారు. మంగళవారం తనకు బెదిరింపు మెయిల్ వచ్చిందని స్పీకర్ విజేందర్ గుప్తా అధికారులకు తెలిపారు. దేశంలోని ప్రముఖులను హతమారుస్తామని పేర్కొంటూ ఆ మెయిల్ వచ్చింది. అందులో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జై శంకర్, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, ఢిల్లీ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సందు వంటి ప్రముఖుల పేర్లు ఉన్నాయి. అలాగే ఢిల్లీ అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్‌లకు కూడా బాంబు బెదిరింపు వచ్చింది. దీనిపై సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది, అధికారులు వెంటనే అసెంబ్లీ, విధాన సభ మెట్రో స్టేషన్లలో బాంబ్ స్క్వాడ్‌తో, డిస్పోజబుల్ టీమ్స్‌తో తనిఖీలు చేపట్టారు. అసెంబ్లీ ప్రాంగణం, మెట్రో స్టేషన్ పరిసరాల్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఈ ప్రాంతం మొత్తం హై అలర్ట్ కొనసాగిస్తున్నారు. అయితే, ఇలాంటి బెదిరింపులు రావడం సహజమే అని, అలాగని వాటిని తేలిగ్గా తీసుకోలేమని, అందుకే భద్రతను కట్టుదిట్టం చేశామని ఢిల్లీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మోహన్ సింగ్ బిష్ట్ అన్నారు. ఈ బెదిరింపులపై తామేమీ భయపడటం లేదని, అసెంబ్లీ సమావేశాలు యథావిధిగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. పరిస్థితి అదుపులోనే ఉందని, భద్రత విషయంలో ఎలాంటి ఆందోళనా అవసరం లేదని బీజేపీ ఎమ్మెల్యేలు అన్నారు. ఇక ఢిల్లీ అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతున్న సందర్భంగా సీఎం రేఖా గుప్తా కూడా అసెంబ్లీకి చేరుకున్నారు. బెదిరింపు ఈ మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకునేందుకు అధికారులు ఆరాతీస్తున్నారు.

## మతం మారితే ఎస్సీ హక్కులు కోల్పోతారు

ఈ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ చింతాడ ఆనంద్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టి.. మంగళశారం తుది ఉత్తర్వులు జారీ చేసింది. బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెంలో పాస్టర్ చింతాడ ఆనంద్ ఎటువంటి అనుమతులు లేకుండా చర్చి నిర్వహించడంపై అక్కల రామిరెడ్డితో పాటు స్థానికులు అభ్యంతరం తెలిపారు. వారిపై అట్రాసిటీ నిరోధక చట్టం కింద ఆనంద్ కేసు పెట్టారు. ఆ కేసును కొట్టివేయాలంటూ రామిరెడ్డి, స్థానికులు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. చింతాడ ఆనంద్ పాస్టర్‌గా పనిచేస్తుండటంతో క్రైస్తవుడవుతారని.. రాజ్యాంగం ప్రకారం షెడ్యూలు కులాలకు సంబంధం ఉండదని రామిరెడ్డి తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. పుట్టుకతో హిందువు అయినా.. క్రైస్తవం స్వీకరించడంతో ఆనంద్ షెడ్యూల్ కులానికి చెందరని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అట్రాసిటీ చట్టంలోని సెక్షన్లు ఆయనకు వర్తించవని, ఫిర్యాదు చట్ట వ్యతిరేకమని.. తమపై పెట్టిన కేసుకు విచారణార్హత లేదని వాదించారు. రామిరెడ్డి తరఫు న్యాయవాదుల వాదనలను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. కై□స్తవ మతంలో కులవ్యవస్థ లేదని పేర్కొంది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన వారికే ఎస్సీ హక్కులు పొందే అర్హత ఉంటుందని స్పష్టం చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఆనంద్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ అంజరియా ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఏపీ హైకోర్టు తీర్పును సమర్థించింది. హిందూ, బౌద్ధ, సిక్కు మతాల్లోని వారు మాత్రమే ఎస్సీ హోదాకు అర్హులని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలా కాకుండా మతం మారితే ఎస్సీ హోదా రద్దవుతుందని తేల్చి చెప్పింది. కై□స్తవ మతంలోకి మారి పాస్టర్‌గా పని చేస్తున్న వ్యక్తి ఎస్సీ, ఎస్టీ చట్టం కింద రక్షణ పొందలేరని స్పష్టం చేసింది. పాస్టర్ ఆనంద్ దశాబ్దానికి పైగా కై□స్తవంలో ఉన్నారని.. తిరిగి మారలేదని నిరూపణ అయిందని ధర్మాసనం పేర్కొంది.

## పిజి వైద్యసీట్ల కౌన్సిలింగ్ పొడిగింపు అసాధ్యం

పొడిగించాలని దాఖలైన పిటిషన్లను జస్టిస్ పీఎస్. నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. నేషనల్ మెడికల్ కమిషన్ వాదనలతో ఏకీభవిస్తూ కోర్టు ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఏడు రౌండ్ల కౌన్సెలింగ్ నిర్వహించామని, ఇంతకంటే ఎక్కువ రౌండ్లు నిర్వహించడం సాధ్యం కాదని న్యాయస్థానం తేల్చి చెప్పింది. కౌన్సెలింగ్ ప్రక్రియను నిరంతరాయంగా కొనసాగిస్తే విద్యా క్యాలెండర్ దెబ్బతింటుందని, ఇది వైద్య విద్య నాణ్యతపై ప్రభావం చూపుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రతి సంవత్సరం కొన్ని సీట్లు మిగిలిపోవడం సహజమేనని, ముఖ్యంగా □ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో అధిక ఫీజుల కారణంగా సీట్లు మిగిలిపోతాయని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఈ కేసులో ఎనఎంసీ తన నివేదికను సమర్పిస్తూ కౌన్సెలింగ్ పొడిగింపును తీవ్రంగా వ్యతిరేకించింది. మిగిలిపోయిన సీట్లలో అత్యధికం □ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు చెందినవేనని, ప్రభుత్వ సీట్లు దాదాపు భర్తీ అయ్యాయని వివరించింది. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పుల ప్రకారం, నిర్దేశిరచిన తేదీ దాటిన తర్వాత అడ్మిషన్లు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో సీటు వస్తుందని ఆశపడిన వందలాది మంది విద్యార్థులు ఈ విద్యా సంవత్సరానికి అవకాశం కోల్పోయారు.

## పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు

పశ్చిమాసియాలో యుద్ధం వల్ల తీవ్ర ఎనర్జీ సంక్షోభం ఏర్పడిందని, ఆ సంక్షోభాన్ని తట్టుకునే రీతిలో ప్రయత్నాలు జరుగుతున్నట్లు వెల్లడించారు. చర్చలు, దౌత్యం ద్వారా శాంతిని నెలకొల్పాలని భావిస్తున్నామన్నారు. యుద్ధ ఉద్రిక్తతలు తగ్గాలని, హోర్ముజ్ జలసంధిని ఓపెన్ చేయాలని ఆయన కోరారు. శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. ఒకవేళ పశ్చిమాసియా పరిస్థితులు సుదీర్ఘ కాలం కొనసాగితే అప్పుడు పరిస్థితులు భయానకంగా ఉంటాయన్నారు. భారత్ వద్ద ప్రస్తుతం 53 లక్షల మెట్రిక్ టన్నుల రిజర్వ్ ఇంధనం ఉన్నట్లు చెప్పారు. రాబోయే రోజుల ఆ సంఖ్యను 65 లక్షల మెట్రిక్ టన్నులకు చేర్చనున్నట్లు తెలిపారు. ఇంధన నౌకల తయారీ ప్రాజెక్టు కోసం సుమారు 70 వేల కోట్లు కేటాయించినట్లు చెప్పారు.

## గ్యాస్ కొరతపై నిజాలు చెప్పండి

హోటల్ వ్యాపారంపై ఆధారపడిన లక్షలాది మంది ఉపాధికి తీవ్ర విఘాతం కలిగిందని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గ్యాస్ సరఫరా సంక్షోభంపై ప్రజలకు నిజాలు చెప్పాలని డిమాండ్ చేశారు. యుద్ధం ప్రారంభమయ్యాక ఎల్‌పీజీ సిలిండర్ల కోసం గ్యాస్ ఏజెన్సీల వద్ద చాంతాడంత లైన్లు కనిపిస్తున్నాయని బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ తెలిపారు. గ్యాస్ కొరత లేదని కేంద్ర ప్రభుత్వం ప్రజలకు నమ్మబలుకు తోందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం గ్యాస్ కొరత తీవ్రంగా ఉందని చెప్పారు. రాష్ట్రంలో నెలకొన్న గ్యాస్ కొరతపై బీఆరఎస్ సభ్యులు నిరసన తెలిపారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ముందుగా గన్‌పార్క్ వద్దకు చేరుకున్న బీఆరఎస్ సభ్యులు గ్యాస్ సిలిండర్ల ప్లకార్డులతో నిరసన తెలిపారు. పెరిగిన ధరలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేంద్రం ఆధీనంలో పెట్రోలియం శాఖ ఉందని.. తామేవిÖ చేయలేమని రాష్ట్ర ప్రభుత్వం అంటోందని కేటీఆర్ అన్నారు. ఫ్యూచర్‌లో గ్యాస్ సిలిండర్ల సైజ్ తగ్గిస్తారనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయిని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సామాన్యులను ఇబ్బంది పెడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంబోతుల కొట్లాటలో లేగలు బలైనట్లుగా సామాన్యుల పరిస్థితి ఉందని అన్నారు. యుద్ధం కారణంగా గ్యాస్ కొరత చర్చనీయాంశంగా మారిందని తెలిపారు. కొరత లేదని కేంద్రం, సప్లయి లేదని రాష్ట్రం ప్రజలను మభ్యపెడుతున్నాయని విమర్శించారు.

# జిహెచ్‌ఎంసీ అభివృద్ధికి ప్రణాళికలు

**రూ.15 వేల కోట్లు నిధులు మంజూరు**

**మేడ్చెల్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్న మల్లారెడ్డి**

**అసెంబ్లీలో సమాధానం ఇచ్చిన మంత్రి శ్రీధర్ బాబు**

హైదరాబాద్, నినాదం:

బిఆరఎస్ ప్రభుత్వం మొదలు పెట్టిన పనులకు తాము నిధులు మంజూరు చేశామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మున్సిపల్ శాఖ అభివృద్ధికి సంబందించి.. సిఎం రేవత్ రెడ్డి ఓ ప్రణాళికను తీసుకున్నారని అన్నారు. అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నల సందర్భంగా శ్రీధర్ బాబు మున్సిపల్ శాఖ అభివృద్ధికి సంబందించిన విషయంపై మాట్లాడారు. జిహెచఎంసి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు నిధులు మంజూరు చేశామనీ, రూ. 122 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని ఎమ్మెల్యేలు చెప్పారని తెలియజేశారు. 2016 లో ఎసఆర్ డిపిని తీసుకువచ్చారని, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేస్తున్నామని అన్నారు. 15 రోజుల్లో పనులు ప్రారంభిస్తామని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. జవహర్ నగర్ ప్రాంతం తన గుండెకాయ అని మంత్రి చామకూర మల్లారెడ్డి తెలిపారు. హైదరాబాద్ చెత్త అంత అక్కడే వేస్తున్నారని అన్నారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై ఆయన ప్రస్తావించారు. ఇన్ చార్జి మంత్రి శ్రీధర్ బాబు అంటే తనకు చాలా అభిమానం అని తెలియజేశారు. చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్ బిఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ హయాంలో ఏర్పాటు చేశారని, మేడ్చల్ నియోజకవర్గాన్ని అతలాకుతలం చేశారని విమర్శించారు. జవహర్ నగర్ చెత్తతో రెండున్నర లక్షల మంది అవస్థలు పడుతున్నారని, వాసన భరించలేకపోతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యేగా ఎందుకు గెలిచానా అని అనిపిస్తుందని, తనపై కుట్ర పన్నుతున్నారని మల్లారెడ్డి ధ్వజమెత్తారు. మేడ్చల్ అభివ ద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని అన్నారు. మేడ్చల్ ప్రాంతాన్ని జీహెచఎంసీ పరిధిలోకి తీసుకొచ్చారు. కానీ, కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ మోరీలు, కరెంటు స్తంభాలు లేవు. జవహర్‌నగర్‌లో చెత్త కొండ పేరుకుపోతోంది. వాతావరణ కాలుష్యంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీధరన్నా వి కు దండం పెడతా. మాపై పగపట్టకండి. దయచేసి మేడ్చల్ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించండి' అని మల్లారెడ్డి కోరారు. అలాగే గత పదేళ్లుగా రోడ్లు, □డ్రైనేజీలు లేవని వ్యాఖ్యానించారు. దీనిపై శ్రీధర్ బాబు స్పందించారు. నిజాలు చెప్పినందుకు మల్లారెడ్డిని అభినందించారు. గత పదేళ్లగా అభివ□ద్ధి జరగలేదని తాము అంటున్నామని అన్నారు. ఇదిలావుంటే రేవంత్ రెడ్డిని సీఎంని చేసింది తానేనని బీఆరఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. రెడ్డి సామాజిక వర్గంలో రేవంత్ తప్ప మరెవరూ పవర్‌ఫుల్ నాయకుడు లేరని రెడ్డి సంఘం సమావేశంలో తానే చెప్పానని గుర్తు చేశారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ చేశారు. ఎవరు అవునన్నా, కాదన్నా తాను, రేవంత్ అన్నదమ్ములమేనని చెప్పారు.



# రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం

**అర్హులైన జర్నలిస్టులకు కార్డుల మంజూరు**

**ఏప్రిల్ మొదటివారంలో తిరిగి సమావేశం**

**హైదరాబాద్,మార్చి24(నినాదం):**

హైదరాబాద్‌లోని ఎఫ్‌డీసీ బోర్డు రూమ్‌లో ఈ రోజు రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జరిగింది. ప్రెస్ అకాడమీ, ఎసఎంఏసీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, సమాచారపౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్, ఎసఎంఏసీ కో`చైర్‌పర్సన్ సీహెచ్ ప్రియాంకతో కలిసి అక్రిడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. అక్రిడిటేషన్ కోసం జర్నలిస్టులు సమర్పించిన దరఖాస్తులను కమిటీ సభ్యులు సమగ్రంగా పరిశీలించారు. జర్నలిస్టుల నుంచి అందిన ప్రతి దరఖాస్తును కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేశారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేస్తామని, అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు కార్డు మంజూరులో ఎలాంటి లోపం ఉండదని స్పష్టం చేశారు. అక్రిడిటేషన్ కమిటీ సమావేశాన్ని వచ్చే నెల మొదటివారంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంకా దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులు ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. జిల్లాల వారీగా కలెక్టర్లు పంపే 'జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ (డీఎంఏసీ)' ప్రతిపాదనలను కూడా పరిశీలించి ఆమోదం తెలుపుతుందని వెల్లడించారు. ఈ మేరకు జిల్లా స్థాయిలో అక్రిడిటేషన్ పక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్లను కోరారు. సమాచారపౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కిషోర్ బాబు, అదనపు డైరెక్టర్ డి.ఎస్. జగన్ పాటు ఇతర కమిటీ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.

# మంత్రి పదవి ఇస్తే కాంగ్రెస్‌కే ప్రతిష్ట

## గతంలోనే మైకమాండ్ హామీ ఇచ్చింది

## మరోమారు మంత్రి పదవిపై పెదవి విప్పిన రాజగోపాల్

**హైదరాబాద్, నినాదం:**

కాంగ్రెస్ హైకమాండ్ తనకు మంత్రి పదవి ఇస్తామని గతంలో హామీ ఇచ్చిందని ఆ పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి గుర్తు చేశారు. తనకు పదవి ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ ప్రతిష్ట పెరుగుతుందని అన్నారు. మీడియాతో చిట్‌చాట్‌లో కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. తనకు గతంలో హామీనిచ్చిన అధిష్టానం ఇపుడు ఏం చేస్తుందో తెలియదన్నారు. నేను మంత్రి పదవి కోసం పాకులాడడం లేదు. ఏ పదవి లేకున్నా రాజగోపాల్ రెడ్డికి ప్రజల్లో తగిన గౌరవం ఉంటుందన్నారు. నాకు మంత్రి పదవి ఇస్తే కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్ర ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే నా లాంటి తెలంగాణ ఉద్యమకారుల సేవలు అవసరమన్నారు. తనకు రేవంత్ రెడ్డితో ఎలాంటి ఇబ్బంది లేదని.. నిన్న ముఖ్యమంత్రితో ప్రత్యేక భేటీ లేదు, ఎదురుపడితే పలకరించుకున్నామని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఇవాళ కేటీఆర్‌తో కూడా సాధారణంగా అన్ని విషయాలపై మాట్లాడానన్నారు.మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ అధిష్ఠానం గతంలో కూడా హామీ ఇచ్చిందని వ్యాఖ్యానించారు. హై కమాండ్ ఇప్పుడు ఏం చేస్తుందో తెలియదని చెప్పుకొచ్చారు. తాను మంత్రి పదవి కోసం పాకులాడటం లేదని పేర్కొన్నారు. ఏ పదవి లేకున్నా తనకి ప్రజల్లో తగిన గౌరవం ఉంటుందని స్పష్టం చేశారు. తనకు మంత్రి పదవి ఇస్తే కాంగ్రెస్‌కి, రాష్ట్ర ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చెప్పారు. కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే తన లాంటి తెలంగాణ ఉద్యమకారుల సేవలు అవసరమని తెలిపారు. తనకు సీఎం రేవంత్‌రెడ్డితో ఎలాంటి ఇబ్బంది లేదని క్లారిటీ ఇచ్చారు. నిన్న సీఎంతో ప్రత్యేకంగా ఏం భేటీ లేదని, ఎదురుపడితే పలకరించుకున్నామని చెప్పారు. మాజీమంత్రి కేటీఆర్‌తో ఇవాళ కూడా సాధారణంగా అన్ని విషయాలపై మాట్లాడానని వివరించారు. 2018 ఎన్నికల్లో 88 సీట్లు వచ్చిన తర్వాత కూడా 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తీసుకోవడం తప్పని కేటీఆర్‌కు చెప్పానని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.



# ఇవి వాహనాలపై 20శాతం డిస్కౌంట్

**హైదరాబాద్, నినాదం:**

హైదరాబాద్ నగరంలో వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందుకోసం ఎల క్ట్రిక్ వాహనాలు (ఈవీ) తీసుకువస్తున్నట్లు తెలిపారు. రూ.1000 కోట్ల ఆదాయం నష్టమైనా ఈవీ వాహనాలు తీసుకొస్తున్నామని వివరించారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడుతూ.. కాలుష్యాన్ని నివారించాలనే ఉద్దేశ్యంతోనే ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చామన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో పని చేస్తున్న ఉద్యోగులకు ఈవీ వాహనాలపై 20 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామని ప్రకటించారు. తెలంగాణ కాలుష్య రహిత రాష్ట్రంగా ఉండాలని ప్రయత్నిస్తున్నామని.. అందుకోసం ఈ ప్రయత్నం తీసుకువచ్చామని మంత్రి పొన్నం తెలిపారు. ఈవీ ఆటోలతోపాటు బస్సులను సైతం తీసుకుని వస్తున్నామన్నారు. నగరాన్ని క్యూర్ చేయాలని ఈ కార్యక్రమం చేపట్టామని వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో ఈవీ వాహనాలకు సబ్సిడీ ఇస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. దేశంలోని వివిధ ప్రధాన నగరాలు.. తీవ్ర కాలుష్యంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. వాహనాల నుంచి వెలువడే కాలుష్యం వల్లే ఈ విధంగా తయారవుతున్నాయని ఇప్పటికే పలు అధ్యాయనాల ద్వారా వెల్లడైంది. ఈ నేపథ్యంలో వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రజా పాలన ప్రభుత్వం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిరు ఢిల్లీ లాగ హైదరాబాద్ కాలుష్యం కావద్దని ఉద్దేశ్యంతో ఈవీ పాలసీ తీసుకొచ్చిందన్నారు. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రభుత్వం ఈవి పాలసీ తీసుకొచ్చింది..ఈవీ పాలసీ తో జీరో రోడ్ టాక్స్ ,జీరో రిజిస్ట్రేషన్ టాక్స్ మినహాయింపు ఉంటుంది.. దాని ద్వారా దాదాపు వెయ్యి కోట్లు ప్రభుత్వం నష్టపోయిన ఈవీ పాలసీ నీ ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది..ఈవి పాలసీ వచ్చిన తర్వాత ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం భారీగా పెరిగింది.. అందువల్ల ఇటీవల రవాణా శాఖ సవి క్షా సమావేశం లో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రోత్సాహం ఇవ్వాలని తయారీ దారులను కోరడం జరిగింది.ప్రభుత్వ సంస్థలకు కొనుగోలు చేస్తే ఈవీ వాహనాలు కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు..ఈవి వాహనాలకు అన్ని ప్రాంతాల్లో ఈవి ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం జరిగింది..కంపెనీ దారులు ప్రభుత్వ ఉద్యోగులకు 10`20 శాతం వారు డిస్కౌంట్ ఇస్తారు.. మహేంద్ర ఎలెక్టిక్స్ , ఆథర్ ఎనర్జీ, గ్రావిటన్ మోటార్స్,ఓలా తో పాలు పలు కంపెనీలు ముందుకు వస్తున్నాయి..క్యూర్ ఏరియా లో ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి.. క్యూర్ ఏరియా లో డీజిల్ ఆటో లు కూడా రిట్రైరోఫిట్ గా మార్చి నడపాలని నిర్ణయం తీసుకుంది.. రెడ్కో ద్వారా కూడా ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం జరుగుతుంది.. ఆర్థిక మంత్రికి శాసన మండలి లో చెప్పడం జరిగింది.. ప్రజా ప్రతినిధులు ఈవి వాహనాలకు లోన్ తీసుకునేలా చెప్పడం జరిగింది.. ముందుగా ఉద్యోగులకు ప్రథమ పౌరుడు సిఎస్ ,ఉద్యోగ సంఘాల నాయకులు ఈవీ వాహనాన్ని బుక్ చేసుకుంటున్నారని మంత్రి తెలిపారు.15 సంవత్సరాలు దాటిన వాహనాలు స్కా□పేజీ కి పంపిస్తున్నాం.. రవాణా శాఖ లో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నాం.. తెలంగాణ లో నిన్న వాహన్ పోర్టల్ లోకి చేరాం.. వాహనాన్ని కొనుగోలు చేసినప్పుడు షో రూమ్ లోనే రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి చేరాలంటే ఉద్యోగులే వారధిగా ఉంటారని అన్నారు.

# పునర్విభజనతో మరిన్ని అవకాశాలు

**పునర్విభజనపై వాస్తవిక దృక్పథంతో ముందుకు వెళ్దాం**

**గెలుపే లక్ష్యంగా స్థానిక పోరుకు సిద్ధమవ్వండి**

**నిలబడిన ప్రతి చోటా జనసేన జెండా ఎగిరేలా కష్టపడండి**

**నియోజకవర్గాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్ళాలి**

**వారంలో ఒకరోజు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించడం తప్పనిసరి**

**పార్టీ బలంగా ఉంటేనే ప్రజాప్రతినిధులు బలంగా ఉంటారు**

**పార్టీ నేతలకు జనసేనాని పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం**

**విజయవాడ, నినాదం:**

నియోజకవర్గాల పునర్విభజన వల్ల అవకాశాలు మరింత పెరుగుతాయని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. విజయవాడలోని ఓ □ప్రైవేటు హోటల్‌లో పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో ఆయన సుమారు మూడు గంటలకు పైగా సమావేశమయ్యారు. పార్టీ బలోపేతంపై చర్చించారు. సభ్యత్వ నమోదు, పార్టీ కమిటీలపై చర్చించారు. నియోజకవర్గాల్లో సమస్యలపై ఆరా తీశారు. కమిటీల ఏర్పాటు విషయంలో పిఠాపురం మోడల్‌ని మిగతా నియోజకవర్గాల్లోనూ అమలు చేయాలని సూచించారు. కూటమి పార్టీల సయోధ్య విషయంలో దిశానిర్దేశం చేశారు.పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశమై పలు ముఖ్య అంశాలపై చర్చించారు. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితులు, తాజా రాజకీయ పరిణామాలపై సమగ్రంగా చర్చించి నేతలకు పవన్ దిశానిర్దేశం చేశారు.నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంలో ప్రజాప్రయోజనమే లక్ష్యంగా, వాస్తవిక ద□క్పథంతో ప్రజాప్రతినిధులు ముందుకు వెళ్లాలని పవన్ కళ్యాణ్ ఉద్ఘాటించారు. 2009లో చివరిసారిగా పునర్విభజన జరిగినప్పుడు రాష్ట్రం, దేశంలో చోటు చేసుకున్న అంశాలను ఒకసారి జ్ఞప్తికి తెచ్చుకోవా లన్నారు. నిబంధనలకు అనుగుణంగా, ప్రజాప్రయోజనమే పరమార్థంగా, సహేతుకంగా పునర్విభజన జరిగేలా జనసేన ప్రజా ప్రతినిధులు ముందుకు వెళ్లాలని సూచించారు. ముఖ్యంగా జనసేన ప్రజాప్రతినిధులు అన్ని వర్గాలకు చేరువలో (రీచ్ అవుట్) ఉంటూ... నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులతో మంగళవారం విజయవాడలో సమావేశమయ్యారు.కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నియోజక వర్గాల పునర్విభజన నిర్ణయం వల్ల రాష్ట్రంలో అసెంబ్లీతోపాటు పార్లమెంట్ స్థానాలు పెరుగుతాయి. ఇప్పుడున్న నియోజకవర్గాలను 50 శాతం పెంచాలన్న కేంద్రం నిర్ణయం హర్షణీయం. కేంద్రం నిర్ణయంతో 88 అసెంబ్లీ సీట్లు, 12 వరకు పార్లమెంట్ సీట్లు కొత్తగా పెరుగుతాయి. అంటే కొత్తగా 100 మంది ప్రతినిధులను చట్ట సభలకు పంపించే అవకాశం వచ్చింది. దీనిని ద□ష్టిలో పెట్టుకొని డీలిమిటేషన్ ఎక్కడా దుర్వినియోగం కాకుండా చూసే బాధ్యత మనపై ఉంది. డీలిమిటేషన్ పై జనసేన ఏ విధంగా ముందుకు వెళ్లాలి? ఎటువంటి కార్యాచరణ అవలంబించాలి? అనే అంశాలపై సూచనలు చేయడానికి శాసనసభ్యులతో కూడిన కమిటీ నియమించాలని పార్టీ పీఏసీ ఛైర్మన్ శ్రీ నాదెండ్ల మనోహర్ గారికి సూచిస్తున్నాను. ఈ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా డీలిమిటేషన్ పై పార్టీ కార్యాచరణ నిర్దేశిరచుకుందాం. కొద్ది నెలల్లో రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు రానున్నాయి. కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రజా ప్రతినిధులు పని చేయాలి. క్షేత్రస్థాయిలో కూటమి పార్టీలను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలి. ఏ ఎన్నిక జరిగినా గెలుపే లక్ష్యంగా కష్టపడాలి. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో అభిలషణీయమైన సంఖ్యలో గెలుపొందడం మన శ్రేణుల పోరాట పటిమకు నిదర్శనం. వచ్చే స్థానిక పోరులో గెలుపే లక్ష్యంగా సిద్ధంగా ఉండాలి. పార్టీ బలంగా ఉంటేనే ప్రజా ప్రతినిధులు బలంగా ఉంటారు. దానిని ద□ష్టిలో పెట్టుకొని పార్టీ బలోపేతానికి ప్రజా ప్రతినిధులు ముందుండి పని చేయాలి. ఉద్యమి సభ్యత్వం ఎంత అధికంగా ఉంటే పార్టీ అంత బలంగా ఉంటుంది. ప్రజాప్రతినిధులు ఎన్నికల ముందు వివిధ వర్గాలు ప్రజలు, ఉద్యోగులు, వ్యాపారస్తులు, రైతులు, కార్మికులు, కర్షకులు, మహిళలను ఏ విధంగా కలిసి ఓట్లను అభ్యర్థించామో... అదే



విధంగా, అదే రీతిలో ఇప్పుడు కూడా నిరంతరం వారిని కలిసి వారి కష్టసుఖాలు తెలుసుకోవాలి. కొన్ని అసాధ్యమైన కోరికలు వ్యక్తమైనప్పటికీ సాధ్యాసాధ్యాలను వారి ముందు ఉంచితే వారి మనసులు గెలుచుకోవడం కష్టం కాదు. వారంలో ఏదో ఒక రోజు నియోజకవర్గంలో ఒక ప్రాంతంలో ప్రజల నుంచి స్వయంగా అర్జీలు స్వీకరించే కార్యక్రమాన్ని తప్పనిసరిగా చేపట్టాలి. వాటి పరిష్కారానికి క□షి చేయాలి. దీని కోసం పక్కాగా ప్రణాళిక రూపొందించుకొని అమలు చేయాలి. నియోజకవర్గాల అభివ□ద్ధిపై ప్రత్యేక ప్రణాళికతో ద□ష్టి పెట్టాలి. వ్యవసాయం, ఉద్యోగ, ఉపాధి, పరిశ్రమలు ఇలా అన్ని రంగాలపై ద□ష్టి సారించి అన్ని వర్గాల ప్రజలకు దగ్గరవ్వాలి. కులాలు లేకుండా సమాజం నడవదు. ప్రతి కులాన్ని గౌరవిస్తూ ముందుకు వెళ్లాలి. ప్రతి శాసనసభ్యుడు రాజకీయ వాస్తవికతకు దగ్గరగా ఉంటూ నియోజకవర్గ అభివ□ద్దే లక్ష్యంగా పనిచేయాలి. □Sష్ట్రంలో 8`12 శాతం వరకు యువత ఉన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో కూడిన మావన వనరులుగా వారిని తీర్చిదిద్దాలి. జెన్ జి ఆలోచనలు అర్థం చేసుకోవాలి. వారిని చేరువ అవ్వడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై ద□ష్టి పెట్టాలి. రాజకీయ కార్యకలాపాలకు కుటుంబ సభ్యులను ఎంత పరిమితి మేరకు అనుమతించాలో ప్రజాప్రతినిధులు ఎవరికి వారు లోతుగా ఆలోచన జరిపి నిర్ణయం తీసుకోవాలి. ఆ నిర్ణయం ప్రజలు హర్షించేలా ఉండాలి. వ్యక్తులు చేసిన పనులు వ్యక్తులకే పరిమితం అవ్వాలి. అంతే తప్ప వాటి ఆధారంగా పార్టీపై ప్రభావం పడకూడదు. పంచాయతీ రాజ్, గ్రావి□ణాభివ□ద్ధి శాఖల ద్వారా నిధులు సమకూర్చాము. వాటి సద్వినియోగంపై అందరూ ప్రత్యేక ద□ష్టి కేంద్రీకరించాలి. అవి క్షేత్ర స్థాయిలో ప్రజలకు చేరువ కావాలి. జల్ జీవన్ మిషన్ 2 .0 కి ఈ రోజు ఎం.ఓ.యూ. చేసుకున్నాము. జల్ జీవన్ నిధులతో ప్రతి ఇంటికీ తాగు నీరు ఇచ్చే లక్ష్యంతో పని చేస్తున్నాము. ప్రతి నియోజకవర్గానికి పీఆర్ ఆర్డీ శాఖలు, ఆర్. డబ్ల్యు.ఎస్. ద్వారా నిధులు అందుతున్నాయి. వాటి ద్వారా చేస్తున్న అభివ□ద్ధిని ప్రజలకు తెలియచెప్పాల్సిన బాధ్యత మీపైనే ఉంది' అన్నారు.

జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ... 'సంఖ్యాపరంగా అసెంబ్లీలో జనసేన పార్టీ రెండో స్థానంలో ఉండటం మనందరికీ గర్వ కారణం. స్థానిక సంస్థల ఎన్నికలకు స్థానికంగానే వ్యూహరచన చేసుకోవాలి. డీలిమిటేషన్ లో చేర్పులు, మార్పులు, విభజన పక్రియలు జిల్లా యంత్రాంగం చేతుల్లో కేంద్రీక□తమై ఉంటాయి. గతంలో జరిగిన డీలిమిటేషన్ పక్రియ ఆధారంగా ఈ మాటలు చెబుతున్నాను. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి చోట గెలిచి నూటికి నూరు శాతం ఫలితాలు రాబట్టుకోవాలి అని కోరారు. లెజిస్లేటివ్ పార్టీ సమావేశం ఆద్యంతం ఆహ్లాదకరంగా సాగింది. 3 గంటల సేపు కొనసాగిన ఈ సమావేశంలో పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ప్రారంభోపన్యాసం చేశారు. ఆ తరువాత గ్రూపులుగా, విడివిడిగా అందరి సభ్యులతో కలిసి మాట్లాడారు. ఈ సమావేశంలో అనేక అంశాలు ప్రస్తావనకు వచ్చిన క్రమంలో ముఖ్యమైన అంశాల వి□ద అధ్యయనానికి పార్టీకి, సలహాలు, సూచనలు ఇవ్వడానికి ప్రజాప్రతినిధులతో అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయాలని పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీకి సూచించారు. చర్చించిన అంశాలు ప్రజలు, పార్టీకి ఉపయోగపడేలా మలుచుకోవాలని సూచించారు. ప్రతి నెల 3 లేదా 4వ వారంలో పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల అందరితో సమావేశమవుతానని చెప్పారు. పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేస్తామని, ఈ సమావేశంలో రాజకీయంగా పార్టీ శ్రేణులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు గురించి చర్చిస్తామని చెప్పారు.

# పేదరికాన్ని జయించి...
# డాక్టరేట్ సాధించి

## అక్షరమే ఆయుధం... పట్టుదలే ప్రాణం...

**ప్రభుత్వ విద్యతో పిహెచ్‌డి శిఖరాగ్రానికి...**

**ములుగు జిల్లా ఆణిముత్యం చిలకమర్రి స్వరూప**

**ఒకే ఏడాదిలో మూడు సర్కారు కొలువులు నేడు కెమిస్ట్రీలో డాక్టరేట్**

**ములుగు జిల్లా మంగపేట మండలం తిమ్మంపేట గ్రామానికి చెందిన చిలకమర్రి స్వరూప నేటి విద్యార్థులకు, యువతకు ఆదర్శంగా నిలిచారు. ప్రభుత్వ విద్యాలయాల్లో చదివి కెమిస్ట్రీలో డాక్టరేట్ సాధించిన దీరవనిత, తండ్రి మరణం క్రుంగదీసినా, పేదరికం అడ్డు నిలిచినా, అలుపెరగని అంకుటిత దీక్షతో చదివి 2014లో అప్పటి ప్రభుత్వం నిర్వహించిన పోటీ పరీక్షలలో నెగ్గి ఒకే ఏడాదిలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. - ములుగు ప్రతినిధి, మార్చి 24 (నినాదం)**





నేడు డిగ్రీ లెక్చరర్ గా, డాక్టరేట్ గ్రహీతగా ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు స్వరూప. సాధారణంగా ఒక ప్రభుత్వ ఉద్యోగం వస్తేనే జీవితం స్థిరపడుతుందని చాలామంది విశ్రమిస్తుంటారు కానీ ఆ యువతి లక్ష్యం వేరు పేదరికం తన కాళ్లకు బేడీలు వేయాలని చూసిన కుటుంబ కష్టాలు వెనక్కి లాగాలని ప్రయత్నించిన ఆమె తన పట్టుదలను ఆయుధంగా మలుచుకుంది. ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని, నేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పాఠాలు చెబుతూ అత్యున్నతమైన పీహెచ్డీ పట్టాను అందుకొని "డాక్టర్ చిలకమర్రి స్వరూప" తన ఈ ప్రయాణం ఎందరో గ్రామీణ మధ్యతరగతి నిరుద్యోగులకు ప్రేరణగా నిలుస్తోంది.

**అక్షరానికి అండగా నిలిచిన ప్రభుత్వ విద్య**

తిమ్మంపేట గ్రామానికి చెందిన చిలకమర్రి నరసింహారావు – కళావతి దంపతుల కుమార్తె స్వరూప తన విద్యా ప్రస్థానం ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే సాగడం విశేషం. ములుగు జిల్లా మంగపేట మండలం తిమ్మపేటలోని ప్రభుత్వ పాఠశాలలో తన ప్రాథమిక విద్యను పూర్తి చేసుకున్న ఆమె చిన్నతనం నుంచి చదువులో ప్రతిభ కనబరిచారు. ఉన్నత చదువుల కోసం మహబూబాద్ జిల్లా కురవి రెసిడెన్షియల్ కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. కార్పొరేట్ చదువులకు ఆమడ దూరంలో ఉన్నా! తన మేధస్సుతో ప్రభుత్వ సంస్థల్లోనే రాణిస్తూ ఉన్నత శిఖరాల వైపు అడుగులు వేశారు స్వరూప.

**కృంగదీసిన తండ్రి మరణం...**
**వెన్ను తట్టిన కుటుంబం**

లక్ష్యం వైపు తను సాగుతున్న సమయంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో ఉన్నప్పుడే తండ్రి చిలకమర్రి నరసింహారావు మరణించారు ఇంటికి పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబం ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంది తల్లి కళావతి పిల్లల భవిష్యత్తు కోసం అహర్నిశలు శ్రమించారు తండ్రి లేని లోటును భర్తీ చేస్తూ అమ్మ ఇచ్చిన ప్రోత్సాహం స్వరూప ను మరింత దృఢంగా మార్చింది.

భర్త శ్రీరామ్ సత్యం ప్రోత్సాహం తనకు మరింత నూతన ఉత్సాహాన్ని కలిగించి లక్ష్యం వైపు ప్రయాణాన్ని మరింత వేగవంతం చేశారు. ఈ క్రమంలో హనుమకొండ, నక్కలగుట్ట లోని వివేకానంద ఇన్స్టిట్యూషన్ లో స్వరూప టాలెంట్ను గుర్తించిన ఆ సంస్థ చైర్మన్ పాక వెంకటేశ్వర్లు పీజీ ఎంట్రన్స్ కోసం ఫ్రీ కోచింగ్ ఇప్పించారు. అందుకుగాను ఆమెకు ఉస్మానియా యూనివర్సిటీలో పిజీకి మెరిట్ ద్వారా అడ్మిషన్ వచ్చింది ఆ విధంగా తనకు ఎంతో ప్రోత్సాహం లభించింది.

### ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు... ఒక అరుదైన విజయం

ఉద్యోగం వస్తే చదువును ఆపేయాలి అనే ధోరణికి భిన్నంగా తన వైవాహిక జీవితం అనంతరం కూడా ఎన్నో బాధ్యతలను అధిగమించి తన జ్ఞానాన్ని మరింత విశ్లేషించుకోవాలని భావించారు స్వరూప. ప్రతిష్టాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రసాయన శాస్త్రం విభాగంలో పీహెచ్డీ అడ్మిషన్ పొంది ప్రొఫెసర్ డాక్టర్ హరి పద్మ పర్యవేక్షణలో "డిజైన్ సింథసిస్ అండ్ అప్లికేషన్స్ ఆఫ్ మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్ వర్క్" అనే అంశంపై తన పరిశోధనలు పూర్తి చేశారు. ఎన్నో ఏళ్ల కృషి నిరంతర శ్రమ ఫలితంగా ఇటీవలే ఆమె తన పరిశోధనలు విజయవంతంగా పూర్తి చేసి డాక్టరేట్ పట్టా పొందారు. ఈ మేరకు ఉస్మానియా విశ్వవిద్యాలయం పరీక్షల విభాగం చిలకమర్రి స్వరూప కు డాక్టరేట్ ఇస్తున్నట్లు ప్రకటన విడుదల చేసింది. నిరుపేద కుటుంబం నుంచి వచ్చి ప్రభుత్వ సంస్థల్లోనే చదువుకొని డాక్టర్ చిలకమర్రి స్వరూపంగా గుర్తింపు పొందడం సామాన్య విషయం కాదు. పేదరికం అనేది మన గమ్యాన్ని అడ్డుకోలేదు పట్టుదల ఉంటే ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుకొని కూడా అద్భుతాలు సృష్టించవచ్చు అని స్వరూప నిరూపించారు. నేడు ప్రభుత్వ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న వేలాది మంది అభ్యర్థులకు ఆమె ప్రేరణగా నిలుస్తున్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా లక్ష్యం వైపు సాగితే విజయం వరిస్తుందని ఆమె ప్రయాణం నిరూపించింది. నేడు ఆమె సాధించిన ఈ విజయం పట్ల కుటుంబ సభ్యులు బంధుమిత్రులు మరియు ఆమె చదువుకున్న విద్యాసంస్థల అధ్యాపకులు, ప్రస్తుతం ఆమె పనిచేస్తున్న డిగ్రీ కళాశాల ఆచార్య బృందం "డాక్టర్ చిలకమర్రి స్వరూప" కీర్తి మరింత పెరగాలని ఆమ

# చెరువు కట్టకు మరమ్మతులు ఎప్పుడు?

## వానకాలం వచ్చిందంటే చెరువుకు వరద ఉధృతి

**అంచు వరకు నీరు చేరి ప్రమాదకర పరిస్థితి**

**హెచ్చరికలు జారీ చేసి చేతులు దులుపుకుంటున్న అధికారులు !**

**కట్ట మరమ్మత్తులో మాత్రం పూర్తి నిర్లక్ష్యం!**



**కోదాడ,మార్చి 23(నినాదం)**

ఈ ఫోటో ఇటీవల కురిసిన వర్షాకాలంలో వరద నీరు చేరడంతో ప్రమాదకరంగా ఉన్న అనంతగిరి మండలంలోని వాయిల సింగారం గ్రామ ఊర చెరువు కట్టది...వర్షాకాలం వచ్చిందంటే ఈ చెరువు కట్ట తెగే ప్రమాదం ఏర్పడుతుందని కట్టను మరమ్మతులు చేయాలని రైతులకు పలుమార్లు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రమాదకరంగా ఉన్నప్పుడు అధికారులు హడావుడి చేసి ఇదిగో చేస్తాం అదిగో చూస్తామంటూ వరద తగ్గాక యధా రాజా తథా ప్రజా అన్న చందాన వ్యవహరిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు...రైతులు పలుమార్లు చెప్పిన అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. వర్షాకాలం వస్తే ఎగువ ప్రాంతం నుండి వచ్చే నీరు వల్ల చెరువు నిండి ఈ కట్ట అంచు వరకు చేరుతుంది. ఈ ఏడాది వర్షాకాలంలో కురిసిన వర్షం లో కట్ట తెగిపోతుందేమోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు అధికారులు కూడా ముందస్తుగా హెచ్చరికలు జారీ చేశారు. కట్ట నిర్మాణం జరుపుతామని అధికారులు చెప్పి నేటికీ నెలలు గడుస్తున్న పట్టించుకోకుండా... మళ్లీ ప్రమాదం ఉన్నప్పుడు ఆలోచిద్దాంలే అనే ధోరణిలో వ్యవహరిస్తున్నారు..

**చెరువు కట్టకు మరమ్మతులు చేయాలి:**
**గ్రామ రైతు కొల్లు సుబ్బారావు**



వర్షాకాలం వస్తుందంటే గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఎగువ ప్రాంతం నుండి వరద నీరు మా గ్రామంలోని చెరువుకు చేరి కట్ట అంచు వరకు నీరు చేరుతుంది. వరద తాకిడికి కట్ట పై ఉన్న మట్టి కొట్టుకు పోతుంది. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆ సమయంలో భయపడుతూ ఉంటాం.. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరాం. కట్ట నిర్మాణం జరుపుతామని పనులు కూడా మొదలు పెడుతున్నామని అధికారులు చెప్పారు.. ఏమైందో తెలియదు నేటి వరకు పనులు ప్రారంభం కాలేదు.

# రాజీ మార్గంతో సమస్యలను పరిష్కరించుకోండి

**జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):**



ఈ నెల 28న నిర్వహించబడనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌లో రాజీమార్గంలో సమస్యలను పరిష్కరించుకోవాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన కేసులను పరస్పర సమ్మతితో త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు.ముఖ్యంగా క్రిమినల్ కంపౌండబుల్ కేసులు సివిల్ వివాదాలు, ఆస్తి విభజన కేసులు, కుటుంబ మరియు వైవాహిక సంబంధిత కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం కేసులు, చెక్ బౌన్స్ కేసుల్లో కక్షిదారులు రాజీ మార్గాన్ని ఎంచుకోవడం ద్వారా తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో పరిష్కారం పొందవచ్చని తెలిపారు. చిన్న చిన్న వివాదాల కోసం కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోవడం కన్నా రాజీ ద్వారా పరిష్కారం ఉత్తమమని సూచించారు. జ్యుడీషియల్ శాఖ అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. జిల్లాలోని పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి, ఇరువర్గాలకు కౌన్సిలింగ్ ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. తమ కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవాలనుకునే వారు సమీప పోలీస్ అధికారులను సంప్రదించాలని, లోక్ అదాలత్ ద్వారా బాధితులకు తక్షణ న్యాయం లభిస్తుందని ఆయన తెలిపారు.



# ప్రకృతి వ్యవసాయం ఉత్పత్తులను ప్రోత్సహిద్దాం

**జిల్లా అదనపు కలెక్టర్ వై అశోక్ రెడ్డి**

**నల్లగొండ ప్రతినిధి మార్చి 24 (నినాదం ):**

ప్రకృతి సంబంధిత వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చని జిల్లా అదనప కలెక్టర్ వై అశోక్ రెడ్డి అన్నారు. మంగళవారం " ఇన్నో యాత్ర " కార్యక్రమంలో భాగంగా నల్గొండ జిల్లాకు విచ్చేసిన విద్యార్థులు,స్టార్టప్ ర్లతో కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఆయన సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇన్నో యాత్ర ద్వారా నూతన ఆలోచనలు ప్రోత్సహించేందుకు వివిధ జిల్లాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం,స్టార్టప్ అవకాశాలు మరియు స్వయం ఉపాధిపై మార్గం నిర్దేశం అతుందని తెలిపారు.నల్గొండ జిల్లా జిల్లాలో నాటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మించిన తర్వాత నీటిపారుదల శాతం పెరిగి వ్యవసాయం ఎక్కువగా ఆధారపడి జీవించారని తదుపరి హరితహారం ద్వారా వరి ఆధునిక వంగడాలు జిల్లాలో ఎక్కువ ఉపయోగించడం జరుగుతుందని ప్రస్తుతం ఆసియా ఖండంలోనే నల్గొండ జిల్లా నుంచి అత్యధిక బియ్యం సరఫరా చేయబడటం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయంలో వాడుతున్న రసాయనాల వల్ల భూసారం దెబ్బ తినటంతో పాటు ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలుగుతుందని వ్యవసాయం నుండి రసాయనలను తొలగించి జీవ రసాయనాలను ఉపయోగించి రైతులకు ప్రకృతి తో మమైకమయ్యే చిరు, తృణ, వాణిజ్య పంటలు లాంటి ఆధునిక వ్యవసాయం చేసేలా యువత సృజనాత్మక ఆలోచనలను అందించాలని కోరారు. కార్యక్రమంలోజిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్, హర్టికల్చర్ అధికారి అనంతరెడ్డి, ఆర్ డబ్ల్యూఎస్ డీ ఈ సంపత్ కుమార్, డిఆర్డిఏ ఏపీడి శ్రవణ్ కుమార్ , డి ఎం దుర్గారావు,ఇనో యాత్ర నిర్వాహకులు యాని, ఇనోయాత్ర విద్యార్థులు స్టార్టపర్లు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లించని
# కమర్షియల్ బిల్డింగ్ సీజ్

**రాజేంద్రనగర్, మార్చి 24: (నినాదం):**



జిహెచ్ఎంసి రాజేంద్రనగర్ జోన్, అత్తాపూర్ సర్కిల్–20 పరిధిలో ఆస్తి పన్ను వసూళ్లపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. మంగళవారం ఎం.ఎం పహాడి ప్రాంతంలో నిర్వహించిన ప్రత్యేక ఆస్తి పన్ను వసూళ్ల కార్యక్రమంలో భాగంగా భారీగా బకాయిలు ఉన్న ఒక వాణిజ్య కట్టడాన్ని అధికారులు సీజ్ చేశారు.

రూ. 11 లక్షల బకాయి.. బ్యాంక్వెట్ హాల్ సీజ్

ఎం.ఎం పహాడిలోని ఎం.ఎం క్యూ బ్యాంక్వెట్ హాల్ (డోర్ నెం: 4–10–33/2/PH/2) యజమాని సయ్యద్ అయూబ్ అలీ హుస్సేన్, తన వాణిజ్య ఆస్తికి సంబంధించి సుమారు ₹11,39,149/– ఆస్తి పన్ను బకాయి పడ్డారు. పలుమార్లు నోటీసులు ఇచ్చినప్పటికీ స్పందించకపోవడంతో, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, ఏఎంసీ నిర్మల గ ఆధ్వర్యంలో అధికారులు బిల్డింగ్‌ను సీజ్ చేశారు.

ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రస్తుతం ఆస్తి పన్ను బకాయిలపై ఉన్న వడ్డీలో 90% రాయితీ కల్పిస్తోందని గుర్తు చేశారు. పన్ను చెల్లింపుదారులు ఈ అద్భుతమైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఎలాంటి జరిమానాలు కఠిన చర్యలు లేకుండా తమ బకాయిలను వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. సకాలంలో పన్నులు చెల్లించి నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి.ఐ హరికిషన్ , జిహెచ్ఎంసి రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



# 'హైడ్రా' మెరుపు దాడి

**రూ. 6 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి స్వాధీనం**

**రాజేంద్రనగర్ మార్చి 24 (నినాదం):**

నార్సింగి సర్కిల్ మణికొండ పరిధిలో లోని సెక్రటేరియట్ కాలనీ లో కబ్జాకు గురైన సుమారు 1.5 ఎకరాల ప్రభుత్వ భూమిని అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఈ భూమి విలువ సుమారు 6 కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా. ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించుకున్నారని అధికారులకు సమాచారం అందింది. ప్రభుత్వ, భూమిని ఆక్రమించుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని స్థానిక కాలనీ వాసులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించిన హైడ్రా బృందం, రెవెన్యూ అధికారులతో కలిసి రంగంలోకి దిగి రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రభుత్వ భూమి అని నిర్ధారించుకున్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేస్తూ అధికారులు ప్రభుత్వ బోర్డులను ఏర్పాటు చేశారు. "ప్రభుత్వ భూములను, చెరువులను కబ్జా చేస్తే ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని . భూ ఆక్రమణలపై మా నిఘా నిరంతరం కొనసాగుతుందని అధికారులు అన్నారు.



# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణి

**వలిగొండ, మార్చి 24 (నినాదం):**

మండలంలోని నర్సాపురం గ్రామానికి చెందిన కావటి నీలమ్మ, వేల్పుల కోమురెల్లి లు ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందగా వారికి ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన నీలమ్మ కు 60 వేలు, కోమురెల్లికి 21,500/–రూపాయల చెక్కులను మంగళవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు బాధితులకు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో జక్కుల వెంకటయ్య, వేల్పుల మంగమ్మ, బుంగపట్ల నరహరి, కూరెళ్ల దేవేందర్, కావటి లింగస్వామి, వేల్పుల యాదమల్లయ్య, పీసరి వెంకట్ రెడ్డి, మంటిపల్లి సుధాకర్, గుండు నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటంతో
# జీవితంలో ఏదైనా సాధించవచ్చు

**మున్సిపల్ చైర్మన్ చిలుకూరు సుధా బాలకృష్ణ**

**మిర్యాలగూడ మార్చి 24 (నినాదం ):**

విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటంతో జీవితంలో ఏదైనా సాధించవచ్చు అని మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ చిలుకూరు సుధా బాలకృష్ణ అన్నారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని బాలకలా ఉన్నత పాఠశాలలో అనీమియా ముక్త భారత్, ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రీషియన్స్ , అర్చన పిల్లల వైద్యశాల సంయుక్తంగా ఉచిత రక్త పర్సంటేజ్ పరీక్షల వైద్య శిబిరం ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. విద్యార్థులు బయటి ఆహార పదార్థాలను పూర్తిగా నిషేధించి ఇంట్లో ఉండిన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని సూచించారు. తాను చదివిన పాఠశాలకే ముఖ్యఅతిథిగా రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రముఖ చిన్న పిల్లల వైద్యుడు డాక్టర్ జి .అంజయ్య మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం 55 శాతం మంది విద్యార్థులు రక్తహీనత సమస్యతో బాధపడుతున్నారని తెలిపారు. దేశానికి వెన్నెముక లాగా ఉన్న అమ్మాయిలు రక్తహీనత సమస్యతో ఇబ్బందులు పడకుండా ఉండేందుకుగాను తమ వంతుగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రెండు రోజులపాటు వైద్య శిబిరంలో పాఠశాలలోని విద్యార్థినులందరికీ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయ కుమారి, డిసిసి నాయకులు చిలుకూరి బాలకృష్ణ, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కేమ వెంకటేశం పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

# అసమర్ధత? అవినీతి ఆరోపణలు?

**జగిత్యాల డీసీసీ పదవిపై అనిశ్చితి..!.. సమన్వయ లోపాలపై పీసీసీ అసంతృప్తి**

**జగిత్యాల ప్రతినిధి, మార్చి 24 (నినాదం):**

జగిత్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) వ్యవహారాలపై రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. జిల్లా పార్టీ వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించడంలో లోపాలు ఉన్నాయనే అభిప్రాయం పీసీసీ వర్గాల్లో వ్యక్తమవుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో డీసీసీ పదవిపై మార్పులు చోటుచేసుకునే అవకాశముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

మాజీ మంత్రి జీవన్ రెడ్డి సూచనల మేరకు నియమితులైన జిల్లా అధ్యక్షుడు స్థానిక రాజకీయ పరిణామాలను సమయానికి పీసీసీకి చేరవేయడంలో విఫలమయ్యారని కొందరు నాయకులు అభిప్రాయపడుతున్నారని తెలుస్తోంది. అలాగే ఇటీవల చోటుచేసుకున్న కొన్ని రాజకీయ పరిణామాలు పార్టీకి ఇబ్బందులు కలిగించాయని భావిస్తున్నట్లు సమాచారం.

మున్సిపల్ ఎన్నికల సమయంలో బి–ఫారంల పంపిణీ ప్రక్రియలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై కూడా పీసీసీ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. చివరి నిమిషంలో అభ్యర్థుల బి–ఫారంల రద్దు వంటి నిర్ణయాలు స్థానిక స్థాయిలో పార్టీకి ప్రతికూల సంకేతాలు ఇచ్చాయని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ అంశాలపై పీసీసీకి పలువురు ఆశావాహులు ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. ఇటీవల జగిత్యాలకు వచ్చిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్‌కు పార్టీ కార్యకర్తలు ఈ విషయాలపై వివరాలు అందించినట్లు తెలిసింది. జిల్లా స్థాయిలో పార్టీ కార్యకర్తలతో సమన్వయం లోపించిందనే అంశం కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. దీని పై అధిష్టానం అంతర్గతంగా సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.



మాజీ మంత్రి జీవన్ రెడ్డి అనుచరుడిగా గుర్తింపు పొందిన గాజంగి నందయ్యకు డీసీసీ బాధ్యతలు అప్పగించబడినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే, జిల్లా స్థాయిలో పార్టీని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లడంలో ఇబ్బందులు తలెత్తినట్లు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అలాగే స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌తో సమన్వయం విషయంలో తలెత్తిన విభేదాలు పరిస్థితిని మరింత క్లిష్టతరం చేశాయని కొందరు నాయకులు పేర్కొంటున్నారు. ఈ పరిణామాలు ఇటీవల రాజకీయ పరిణామాలపై ప్రభావం చూపినట్లు భావిస్తున్నారు.

డీసీసీ పదవిపై తుది నిర్ణయం గురించి పీసీసీ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# గ్యాస్ సిలిండర్లు పట్టివేత

**వలిగొండలో అక్రమంగా నిల్వ చేసిన 15 గ్యాస్ సిలిండర్లు సీజ్**

**జిల్లా పౌర సరఫరా శాఖ అధికారి రోజా రమణి**

**వలిగొండ, మార్చి 24 (నినాదం):**

గృహ అవసరాలకు వినియోగించవలసిన ఎల్పిజీ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న వారిపై జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు మంగళవారం దాడి చేసి అక్రమంగా వినియోగిస్తున్న 15 గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రోజా రమణి మాట్లాడుతూ విశ్వసనీయ సమాచారంతో గృహవసరాలకు వినియోగించే ఎల్పిజి గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేసి వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న వారిపై దాడి చేసి అక్రమంగా నిల్వచేసిన 15 గ్యాస్ సిలిండర్లను సీజ్ చేసి గ్యాస్ ఏజెన్సీకి తరలించామని, గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేసి అక్రమ వ్యాపారం చేయాలనుకునే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పౌర సరఫరాల శాఖ అధికారి బాలమణి తదితరులు పాల్గొన్నారు.





# సీటు పెరిగితే రాజకీయ పార్టీలకు పండగే!

సంపాదకీయం

రాజకీయ పార్టీలు కోరుకున్నట్లుగానేడిలీమిటేషన్‌కు రంగం సిద్దం అవుతోంది. దీంతో పార్లమెంట్ సీట్లు, అసెంబ్లీ సీట్లు పెరగడం ద్వారా రాజకీయ పార్టీలకు బహుళ ప్రయోజనం కలుగనుంది. ఆయా పార్టీలకు మరికొందరు ఎంపిలు, ఎమ్మెల్యేలు వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే పునర్విభజన జరిగితే బాగా ఆనందించేది రాజకీయ పార్టీలు తప్ప ప్రజలు కాదు. ఈ విభజన ద్వారా సీట్లు పెకిగితే ప్రజలకు ఒరిగేదేమీ లేదు. రాజకీయ నాయకుల్లో రిజర్వేషన్లు పెట్టాలి. గతంలో ఎంపిలుగా, ఎమ్మెల్యేలుగా పోటీ చేసిన వారు మరోమారు ఆ పదవులకు అనర్హులుగా ప్రకటించాలి. ఈ బిల్లులో అలాటి ప్రతిపాదన ఏదైనా పెడితే మంచిది. కేవలం రెండు టర్మ్‌లే పదవి అన్న రూల్ రావాలి. కానీ ఈ చట్టం తెస్తున్నవారు, తేవాలని కోరుకుంటున్న వారంతా పదవులకు అతుక్కుపోయిన వారే. అందువల్ల ఇప్పట్లో ఇది సాధ్యం కాదు. ఎంపిలు, ఎమ్మెల్యేలు పెరిగితే దేశం మీద మరింత ఆర్థిక భారం పడనుంది. వారి జీతభత్యాలు, పెన్షన్లు తడిసి మోపెడు అవుతాయి. ఇదంతా ప్రజలు కట్టే పన్నలనుంచే చెల్లిస్తారు. కనీసం ప్రజాప్రతినిధులకు జీతభత్యాలు, పెన్షన్లు లేకుండా చేసినా మంచిదే. రెండేసి పెనషన్లు ముందుగా ఎత్తేయాలి. అదికూడా చేస్తారని అనుకోవడానికి లేదు. దేశం ఏమయినా ఫర్వాలేదు..వీరికి జీతాలు, పెన్షన్లు రావాల్సిందే. అయితే మహిళా రిజర్వేషన్ల వల్ల వారి సీట్లు పెరగడం, వారి పఆరతినిధ్యం పెరగడం ఒక్కటే ఆనందించదగ్గ విషయం. ఇకపోతే దేశంలో పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనను 2011 జనాభా లెక్కల ఆధారంగా జరిపించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. అలాగే.. లోక్‌సభలో, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం కోటా కల్పించే మహిళా రిజర్వేషన్ చట్టాన్ని కూడా 2011 జనాభా లెక్కల ఆధారంగా అమలు చేసేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే ఈ మేరకు రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. ఈ బిల్లుల ఆమోదం కోసం శని, ఆదివారాలు కూడా పార్లమెంట్ సమావేశాలు జరిపించాలని, అవసరమైతే సమావేశాలను ఏప్రిల్ 2 నుంచి మరో వారం వరకు పొడిగించాలని ప్రభుత్వం భావిస్తోంది. దక్షిణాది రాష్ట్రాల జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపును వ్యతిరేకించడంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీని ప్రకారం ప్రతి రాష్ట్రంలోనూ ఇప్పుడున్న నియోజకవర్గాల్లో 50 శాతం అదనంగా నియోజకవర్గాలు చేరే అవకాశాలున్నాయి. ఫలితంగా లోక్‌సభ సభ్యుల సంఖ్య 816కు చేరే అవకాశం ఉంది. 816 సీట్లయితే.. అందులో 273 సీట్లు మహిళలకు రిజర్వు అవుతాయి. తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే.. తెలంగాణలో లోక్‌సభ సీట్లు 25 లేదా 26కు, అసెంబ్లీ సీట్లు 178 లేదా 179కి పెరిగే అవకాశాలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలు ప్రస్తుతం ఉన్న 25 నుంచి 37`38కి, అసెంబ్లీ సీట్లు 262`263కు పెరగొచ్చు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా దీనిపై తెలుగుదేశం, బిజూ జనతాదళ్, వైసీపీ, శివసేన (యూబీటీ), మజ్లిస్ తదితర పార్టీలతో చర్చలు జరిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో డిలిమిటేషన్ కూడా ఉంది. తెలుగు రాష్ట్రాల రాజకీయ నేతలు ఎంతో కాలంగా డీలిమిటేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. నియోజకవర్గాల పునర్విభజన, సీట్ల పెంపు అన్నీ కూడా 2029 సాధారణ ఎన్నికల నుండి అమలులోకి రానున్నాయి. ఈ పరిణామంతో ఇరు రాష్ట్రాల్లోని ప్రధాన రాజకీయ పార్టీల్లో నూతనోత్సాహం నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో అప్పుడే లెక్కలు వేసుకుంటున్నారు. నాయకులు కూడా ఇప్పటి నుంచే గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటారు. బిజెపి కూడా యా రాష్ట్రాల్లో సీట్లు పెరగాలని, తమ ప్రాతినిధ్యం కూడా పెరగాలని కోరుకుంటోంది. ఇటీవల ఢిల్లీలో కేంద్ర మంత్రులు అమిత్ షా, కిరణ్ రిజిజు, అర్జున్ రామ్ మేఘవాల్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాకుండా, దేశవ్యాప్తంగా లోక్‌సభ మరియు అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను 50 శాతం మేర పెంచాలని కేంద్రం భావిస్తోంది. దీనికి సంబంధించిన బిల్లును ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టేలా పావులు కదుపుతోంది. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా లోక్‌సభ స్థానాలు 543 నుండి 816కి పెరుగుతాయి. అన్ని రాష్ట్రాల్లోని మొత్తం అసెంబ్లీ స్థానాలు 4,123 నుండి 6,185కి చేరుతాయి. ఇకప ఎపిలో ప్రస్తుతం ఉన్న 175 నుండి 263కి పెరుగుతాయి.ప్రస్తుతం ఉన్న 25 ఎంపి స్థానాలు 38కి పెరుగుతాయి. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 119 నుండి 179కి పెరుగుతాయి. లోక్‌సభ స్థానాలు ప్రస్తుతం ఉన్న 17 నుండి 26కి పెరుగుతాయి. నియోజకవర్గాల పునర్విభజనకు 2011 లేదా 2027 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకునే అవకాశం ఉంది. వచ్చే ఏడాది మార్చి నాటికి దేశవ్యాప్తంగా జనగణన ప్రక్రియ పూర్తి కానుంది. ఆ నివేదిక రాగానే పునర్విభజన పనులను వేగవంతం చేయాలని అధికారులు భావిస్తున్నారు. సాధారణంగా జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల పెంపులో అన్యాయం జరుగుతుందనే ఆందోళన ఉంది. అయితే, అన్ని రాష్ట్రాల్లోనూ సమానంగా 50 శాతం సీట్లు పెంచడం ద్వారా ఈ వ్యత్యాసాన్ని తగ్గించవచ్చని కేంద్రం అంచనా వేస్తోంది. ఈ ప్రతిపాదనపై ప్రతిపక్ష కాంగ్రెస్ మరియు ఇతర మిత్రపక్షాల స్పందన ఎలా ఉంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అయితే పెంపుదల అందరూ కోరుకుంటున్నదే కనుక ఇందులో ఏకాభిప్రాయం తప్పకుండా వస్తుంది. మిగా విషయాల్లో కానరాదు.

# విరమణ కాదు.. విప్లవ నిర్ణయం?..



## జీవన్ రెడ్డి

### మరో రాజకీయ ప్రయాణం
### పార్టీపై అసంతృప్తి పర్వం
### మార్పు లేని జీవన్ రెడ్డి నిర్ణయం



తెలంగాణ రాజకీయాలలో ఇటీవలి కాలంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, ముఖ్యంగా కరీంనగర్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ కురువృద్ధుడు తాడిపర్తి జీవన్ రెడ్డి చుట్టూ నెలకొన్న రాజకీయ ఉద్రిక్తతలు, రాష్ట్ర రాజకీయ దిశను ప్రభావితం చేసే స్థాయికి చేరుకున్నాయి. దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్ పార్టీతో అనుబంధాన్ని కొనసాగించిన జీవన్ రెడ్డి పార్టీని వీడే దిశగా ముందడుగు వేయడం, ఆ నిర్ణయంపై అధిష్ఠానం చేసిన చర్చలు, సమన్వయ యత్నాలు, వాటి ఫలితం లేకపోవడం— ఇవి ఒక పెద్ద రాజకీయ మార్పు సంకేతాలుగా విశ్లేషించ బడుతున్నాయి.

జగిత్యాలలో జరిగిన తాజా పరిణామం ఈ సంక్షోభాన్ని మరింత గంభీరతరం చేసింది. రెండు రోజుల క్రితం రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సంక్షేమ శాఖల మంత్రి అద్లూరి లక్ష్మణ్ కుమార్, కరీంనగర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జీవన్ రెడ్డి ఇంటికి వెళ్లి, పార్టీ వీడవద్దని చేసిన విజ్ఞప్తులు సఫలీకృతం కాలేదు. మంగళ వారం
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి సచిన్ సావంత్, పార్టీ విప్ అది శ్రీనివాస్ తదితర కీలక నేతలు స్వయంగా జగిత్యాలకు చేరుకుని జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనతో ప్రత్యేకంగా సమావేశం కావడం ఈ వ్యవహారానికి ఉన్న ప్రాధాన్యాన్ని స్పష్టంగా తెలియ జేస్తుంది. సాధారణంగా స్థానిక స్థాయి అసంతృప్తులను జిల్లా లేదా రాష్ట్ర స్థాయిలోనే పరిష్కరించే కాంగ్రెస్ పార్టీ, ఈ సందర్భంలో నేరుగా జాతీయ స్థాయి ప్రతినిధులను పంపడం పరిస్థితి తీవ్రతను సూచిస్తుంది.

అయితే ఈ సమావేశం ద్వారా ఆశించిన ఫలితం సాధ్యం కాలేదని తెలుస్తోంది. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు జీవన్ రెడ్డి తన నిర్ణయం విషయంలో ఎలాంటి మార్పు లేదని ఖరాఖండిగా తెలియ జేయడం, కాంగ్రెస్ పార్టీతో తన రాజకీయ ప్రయాణాన్ని ముగించేందుకు సిద్ధమని చెప్పడం పరిస్థితిని మరింత క్లిష్టతరం చేసింది. ఇది కేవలం వ్యక్తిగత అసంతృప్తి కాకుండా, ఒక విస్తృత రాజకీయ భావజాల మార్పు సంకేతమా అన్న ప్రశ్నను కూడా లేవనెత్తుతోంది.

జీవన్ రెడ్డి రాజకీయ ప్రయాణాన్ని పరిశీలిస్తే, ఆయన కాంగ్రెస్ పార్టీకి ఒక నిబద్ధతగల నాయకుడిగా గుర్తింపు పొందారు. 1970 దశకంలో సర్పంచిగా, మల్యాల పంచాయతీ సమితి అధ్యక్షుడుగా, ఆయన రాజకీయ జీవితం, పలు దశాబ్దాల పాటు కొనసాగింది. ఆయన ఎమ్మెల్యేగా, మంత్రిగా, పార్టీ పదవుల్లో పనిచేసి కరీంనగర్ ప్రాంతంలో ఒక బలమైన సామాజిక-రాజకీయ వలయాన్ని నిర్మించుకున్నారు. 1980లలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రాంతంలో బలమైన స్థితిలో ఉన్నప్పుడు ఆయన కీలక పాత్ర పోషించారు. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు ఆయన ప్రభావం గణనీయంగా పెరిగింది. అధిష్టానం ఆదేశాల మేరకు రెండుసార్లు కరీంనగర్ లోకసభ స్థానం నుండి తెరాస అధినేత కేసీఆర్ పై పోటీ చేయడం గమనార్హం. అయితే 2014 తర్వాత తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో వచ్చిన రాజకీయ మార్పులు, ప్రాంతీయ పార్టీల పెరుగుదల, ముఖ్యంగా బీఆర్ఎస్ బలోపేతం, కాంగ్రెస్ బలహీనత— ఇవి ఆయన వంటి సీనియర్ నాయకులపై కూడా ప్రభావం చూపాయి.

గణాంకాల పరంగా చూస్తే, 2004లో తెలంగాణ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీకి దాదాపు 50 శాతం ఓటు వాటా ఉండగా, 2018 నాటికి అది 28-30 శాతానికి పడిపోయింది. నాలుగు జిల్లాల పట్టభద్రుల ప్రతినిధిగా ఎమ్మెల్సీగా గెలిచి, శాసన మండలిలో తన గొంతు ద్వారా సత్తా చాటారు.
2023 ఎన్నికలలో కాంగ్రెస్ తిరిగి కొంత పుంజుకున్నప్పటికీ, జీవన్ రెడ్డి ఎమ్మెల్యేగా, నిజామాబాద్ ఎంపీగా పోటీ చేసి ఓటములు రుచి చూడాల్సి వచ్చింది. తర్వాత బి ఆర్ ఎస్ నుండి గెలిచిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను కాంగ్రెస్ ఆదరించడం, ఆయనకు పార్టీ వ్యవరాల్లోనూ ప్రాధాన్యత ఇవ్వడం
స్థానిక నాయకత్వ విభేదాలు, ఇటీవలి మున్సిపల్ ఎన్నికల్లో టికెట్ల
కేటాయింపులపై అసంతృప్తులు, వర్గపోరాటాలు ఇంకా కొనసాగుతున్నాయి. జీవన్ రెడ్డి అసంతృప్తి కూడా ఈ విస్తృత సమస్యలలో భాగమే అని విశ్లేషకులు భావిస్తున్నారు.

జీవన్ రెడ్డి పార్టీని వీడే నిర్ణయానికి కారణాలపై అధికారికంగా పూర్తి స్పష్టత రానున్న క్రమంలో, అంతర్గతంగా కొన్ని అంశాలు చర్చకు వస్తున్నాయి. ముఖ్యంగా స్థానిక రాజకీయాల్లో తనకు సరైన ప్రాధాన్యం లభించకపోవడం, నిర్ణయాలలో తన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకపోవడం, వలస నాయకత్వానికి ప్రాధాన్యం పెరగడం వంటి అంశాలు ఆయన అసంతృప్తికి కారణమయ్యాయని తెలుస్తోంది.

ఈ నేపథ్యంలో మార్చి 25న జగిత్యాలలో జీవన్ రెడ్డి నిర్వహించనున్న బహిరంగ సభ కీలక మలుపుగా మారనుంది. ఈ సభలో ఆయన తన అనుచరులు, అభిమానులు, సహచరులు, సానుభూతిపరులతో చర్చించి వారి అభిప్రాయాలను తెలుసుకుని, తన భవిష్యత్ రాజకీయ కార్యాచరణను ప్రకటించనున్నట్లు సమాచారం. ఈ సభకు భారీగా జనసమ్మర్థం ఉండే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లాలోని పలు మండలాల నుంచి ఆయన అనుచరులు సభకు హాజరయ్యేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈ సభలో ప్రధాన అంశాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది. మొదటిది—ఆయన కాంగ్రెస్ పార్టీని అధికారికంగా వీడడం అన్నది. రెండవది—తరువాతి రాజకీయ గమ్యం ఏ పార్టీలో చేరతారో స్పష్టం కానున్నది. మూడవది—ఆయనతో పాటు ఎంతమంది స్థానిక నాయకులు, కార్యకర్తలు కొత్త మార్గాన్ని అనుసరిస్తారు అన్నది. ఈ మూడు అంశాలు తెలంగాణ రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే అవకాశముంది.

విశ్లేషకుల అంచనాల ప్రకారం, జీవన్ రెడ్డి వంటి సీనియర్ నాయకుడు పార్టీని వీడితే, కనీసం 10-15 శాతం స్థానిక ఓటు బ్యాంక్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆయనకు ఉన్న వ్యక్తిగత అనుబంధం, సామాజిక బలం, వర్గ ఆధారిత మద్దతు— ఇవి ఆయన నిర్ణయానికి రాజకీయ బలం చేకూరుస్తాయి. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీకి ఇది ఒక పెద్ద దెబ్బగా మారవచ్చు.

ఇంకా ఒక ముఖ్యమైన అంశం—ఈ పరిణామం ఇతర అసంతృప్త నాయకులపై చూపే ప్రభావం. ఇప్పటికే రాష్ట్ర కాంగ్రెస్‌లో కొందరు నేతలు తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. జీవన్ రెడ్డి నిర్ణయం వారికి ఒక మార్గదర్శకంగా మారే అవకాశం ఉంది. ఇది పార్టీ లోపలి ఐక్యతపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు.

ఇదిలా ఉండగా, కాంగ్రెస్ అధిష్ఠానం ఈ సమస్యను సీరియస్‌గా తీసుకుని పరిష్కార మార్గాలను అన్వేషిస్తోంది. మహేష్ కుమార్ గౌడ్, సచిన్ సావంత్ వంటి నేతల జోక్యం కూడా అదే దిశగా జరిగింది. అయినప్పటికీ జీవన్ రెడ్డి తన నిర్ణయాన్ని మార్చుకోకపోవడం, పార్టీకి ఒక హెచ్చరికగా భావించవచ్చు. ఇది కేవలం ఒక వ్యక్తి సమస్య కాకుండా, సంస్థాగత బలహీనతల ప్రతిబింబం అని చెప్పవచ్చు.

రాజకీయ విశ్లేషణ కోణంలో చూస్తే, ఈ పరిణామం తెలంగాణలో వచ్చే ఎన్నికలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. స్థానిక స్థాయిలో నాయకుల మార్పులు, పార్టీ మార్పులు, వర్గ సమీకరణాలు— ఇవి ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే అంశాలు. జీవన్ రెడ్డి నిర్ణయం కూడా అలాంటి ఒక కీలక కారకంగా మారవచ్చు.

మొత్తానికి, జగిత్యాలలో జరుగుతున్న ఈ రాజకీయ నాటకం ఒక సాధారణ నాయకుడి పార్టీ మార్పు కాదని, తెలంగాణ రాజకీయాల్లో ఒక పెద్ద మార్పుకు సంకేతమని చెప్పవచ్చు. మార్చి 25న జరిగే సభ ఈ కథలో తదుపరి అధ్యాయాన్ని రాయనుంది. ఆ సభలో వెలువడే నిర్ణయం కేవలం జీవన్ రెడ్డి భవిష్యత్తును మాత్రమే కాకుండా, కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తును, అలాగే తెలంగాణ రాజకీయ దిశను కూడా ప్రభావితం చేసే అవకాశముంది.

**- రామ కిష్టయ్య సంగనభట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్**
**కాలమిస్ట్...9440595494**

### క్షయవ్యాధిపట్ల ప్రజలు
# అప్రమత్తం అవసరం

**వ్యాధి లక్షణాలు గుర్తించి చికిత్స తీసుకోండి**
**ప్రభుత్వం ఉచితంగా వైద్యం అందిస్తోంది**
**నాపా ప్రతినిధుల అవేర్‌నెస్ కార్యక్రమం అభినందనీయం**
**వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

**హైదరాబాద్, నినాదం:**
క్షయవ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. ఇది సమాజానికి పట్టిన చీడ అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్షయవ్యాధి న ఇవారణకు అనేక చర్యలు తీసుకుంటున్నా..మళ్లీ ఇది విజృంభించడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. క్షయ లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం ఉచిత వైద్యం అందిస్తోందని అన్నారు. అంతర్జాతీయ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి మాట్లాడారు. అనుమానం ఉన్న ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలన్నారు. లేకుంటే ఒకరి నుంచి మరొకరికి ఇది వ్యాప్తి చెంది సమాజానికి సవాల్ చేయగలదన్నారు. ఇదిలావుంటే హైదరాబాద్‌లో యువ పల్మనాలజిస్టులు చేపట్టిన చైతన్య కార్యక్రమాన్ని మంత్రి అభినందించారు. ప్రతి ఒక్కరూ ఇలా చైతన్యం చేయడానికి ముందుకు రావాలన్నారు. ఈ క్రమంలో సామాజిక బాధ్యతగా గుర్తించిన యువ వైద్యులు ఓ బృందంప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు, చైతన్యం చేయడానికి పూనుకున్నారు. హైదరాబాద్ నగరంలో పెద్ద ఎత్తు ప్రచార కార్యక్రమాలకు దిగారు. మంగళవారం ప్రపంచ టిబి దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో చైతన్యం కోసం వాకథాన్ నిర్వహించారు. ఆదివారం సంజీవయ్యపార్క్‌లో నిర్వహించిన వాకథాన్‌తో పాటు మంగళవారం కెబిఆర్ పార్క్‌లో కూడా దీనిని నిర్వహించారు. న్యూ ఏజ్ పల్మనాలజిస్ట్స్ అసోసియేషన్ కోర్ కమిటీ నాపా ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టింది. ఇందులో ప్రముఖ పల్మనాలజిస్టు డాక్టర్లు డా. అంకిత్ కోట్ల, డా. వివేక్ వర్ధన్ వీరపనేని,డా. బి. అనిరుధ్,డా. రోహిత్ రెడ్డి,డా. గోవర్ధన్ రెడ్డి, డా. కె. ప్రశాంత్ ,డా. ఉపేంద్ర, డా. ఓబుల్ రెడ్డిలు ఉన్నారు. వీరంతా కలసి ఈకార్యక్రమం ద్వారా ప్రజాచైతన్యం కోసం వాకథాన్ మంగళవారం కెబిఆర్ పార్క్ వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సీనియర్ పల్మనాలజిస్టు డాక్టర్లు డా. విష్ణున్ రావు వీరపనేని, డా. సుధాకర్ కంది,డా. టిఎలఎన్ స్వామి,డా. దయానంద్ తదితరులు పాల్గొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచవ్యాప్తంగా 18 లక్షల మరణాలతో 1.04 కోట్ల కొత్త కేసులు నమోదైనవి అని నివేదించిందని అన్నారు. అవగాహనను పెంచడానికి, ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని 1982 నుండి ప్రతి సంవత్సరం మార్చి 24న జరుపుకుంటున్నామని అన్నారు. తమ బాధ్యతగా నాపా ప్రతినిధులంతా కలసి ప్రజలను చైతన్యం చేఏందుకు ముందుకు వచ్చామని నాపా ప్రతినిధి డాక్టర్ వివేక వర్ధన్ వీరపనేని అన్నారు. ప్రజలు అప్రమత్తం కావలని, సకాలంలో వైద్యుల సలహాలు తీసుకుని, చికిత్సకు సిద్ధం కావాలని వీరంతా సూచించారు.

# భయం కూడా ఒక ఆయుధమా?

**అమెరికా, ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు కేవలం రెండు దేశాల మధ్య ఘర్షణగా మాత్రమే కాకుండా, ప్రపంచ శక్తి సమీకరణాలను ప్రభావితం చేసే కీలక పరిణామంగా మారుతున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఉక్రెయిన్, రష్యా యుద్ధం, మధ్యప్రాచ్య అస్థిరత, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో పెరుగుతున్న పోటీ వంటి అంశాల మధ్య ఈ పరిణామాలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అమెరికా తన సాంకేతిక ఆధిక్యంతో ఆధిపత్యం సాధిస్తుందని భావించినప్పటికీ, ఇరాన్ అనుసరిస్తున్న వ్యూహాలు పరిస్థితులను క్లిష్టతరం చేస్తున్నాయని నివేదికలు సూచిస్తున్నాయి.**

### వైమానిక ఆధిపత్యానికి సవాళ్లు

అమెరికా సైన్యం గర్వకారణంగా భావించే స్టెల్త్ ఫైటర్ జెట్ల సామర్థ్యం ఈ ఘర్షణలో చర్చనీయాంశంగా మారింది. కొన్ని అంతర్జాతీయ నివేదికల ప్రకారం, ఇరాన్ తన వద్ద ఉన్న పాత తరహా క్షిపణి వ్యవస్థలతో కూడిన వ్యూహాల ద్వారా స్టెల్త్ టెక్నాలజీకి సవాళ్లు విసురుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్లు వంటి ప్రత్యామ్నాయ గుర్తింపు పద్ధతుల ప్రాముఖ్యత పెరుగుతోందని విశ్లేషణలు సూచిస్తున్నాయి. అయితే, ఇలాంటి సంఘటనలపై అధికారిక ధృవీకరణలు పరిమితంగానే అందుబాటులో ఉన్నాయి. అయినప్పటికీ, స్టెల్త్ టెక్నాలజీ పూర్తిగా అజేయం కాదన్న అభిప్రాయం రక్షణ వర్గాల్లో వినిపిస్తోంది. ఇరాన్ తన పరిమిత వనరులతో కూడిన సమన్వయ వ్యూహాల ద్వారా అమెరికా వైమానిక ఆధిపత్యాన్ని సవాలు చేస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పరిణామాలు భవిష్యత్తులో వైమానిక యుద్ధ స్వరూపం మారే అవకాశాన్ని సూచిస్తున్నాయి.

### మానసిక భయం ఒక వ్యూహాత్మక సాధనం

ఆధునిక యుద్ధాల్లో మానసిక ఒత్తిడి కూడా ఒక కీలక ఆయుధంగా మారుతోంది. "డర్టీ బాంబ్" వంటి ముప్పుల గురించి వినిపించే హెచ్చరికలు ప్రత్యర్థి సేనలపై భయాన్ని సృష్టించగలవని నిపుణులు భావిస్తున్నారు. ఇవి వాస్తవ వినియోగం కంటే వ్యూహాత్మక ఒత్తిడిని పెంచే సాధనాలుగా పరిగణించబడతాయి. ఇలాంటి పరిస్థితుల్లో నిర్ణయాలు తీసుకోవడం మరింత క్లిష్టంగా మారుతుంది. రక్షణ వ్యవస్థలు ఈ తరహా ముప్పులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, పూర్తిస్థాయిలో అడ్డుకోవడం సవాలుగా మారుతుందని విశ్లేషణలు సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భయం కూడా యుద్ధ వ్యూహంలో భాగమవుతున్నట్లు కనిపిస్తోంది.

### హైపర్‌సోనిక్ వేగం.. చాతుర్యం కలయిక

ఇరాన్ అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పబడుతున్న హైపర్‌సోనిక్ క్షిపణి వ్యవస్థలు ప్రపంచ రక్షణ రంగంలో చర్చకు దారి తీస్తున్నాయి. ఈ క్షిపణులు అధిక వేగంతో ప్రయాణిస్తూ లక్ష్యానికి చేరుకునే సమయంలో దిశ మార్చుకునే సామర్థ్యం కలిగి ఉంటాయని నివేదికలు సూచిస్తున్నాయి. అమెరికా యొక్క రక్షణ వ్యవస్థలు ఈ తరహా సవాళ్లను ఎదుర్కొనే క్రమంలో కొత్త పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పూర్తిస్థాయి సమర్థతపై ఇంకా చర్చలు కొనసాగుతున్నాయి. వేగం, మెన్యువరబిలిటీ కలయిక భవిష్యత్తు యుద్ధాల్లో కీలకంగా మారుతుందని విశ్లేషణలు సూచిస్తున్నాయి. పరిణామాలు ప్రపంచ రక్షణ వ్యూహాలను ప్రభావితం చేసే అవకాశం ఉంది.

### తక్కువ ఖర్చు.. ఎక్కువ ప్రభావం

ఆధునిక యుద్ధాల్లో ఆర్థిక అంశం కీలకంగా మారుతోంది. కొన్ని ప్రాథమిక అంచనాల ప్రకారం, తక్కువ ఖర్చుతో రూపొందించే డ్రోన్లు, క్షిపణులు ఖరీదైన రక్షణ వ్యవస్థలకు సవాళ్లు విసురుతున్నాయి. అధిక వ్యయంతో కూడిన ఇంటర్‌సెప్టర్ మిస్సైళ్లను ఉపయోగించి తక్కువ విలువ గల లక్ష్యాలను అడ్డుకోవాల్సిన పరిస్థితి ఆర్థిక ఒత్తిడిని పెంచుతోందని విశ్లేషణలు సూచిస్తున్నాయి. ఇరాన్ అనుసరిస్తున్న తక్కువ ఖర్చు, గరిష్ట ప్రభావం వ్యూహం ఈ సందర్భంలో ప్రాధాన్యం పొందుతోందని నిపుణులు చెబుతున్నారు. గల్ఫ్ ప్రాంతంలోని పరిణామాలు అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై ప్రభావం చూపుతున్నాయని నివేదికలు సూచిస్తున్నాయి. అయినప్పటికీ, ఖచ్చిత గణాంకాలు అధికారికంగా వెలువడే వరకు అంచనాలను జాగ్రత్తగా పరిగణించాల్సి ఉంటుంది. యుద్ధం ఇప్పుడు కేవలం సైనిక పోరాటమే కాకుండా ఆర్థిక పోటీగా కూడా మారుతోంది.

మారుతున్న యుద్ధ స్వరూపం
ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు యుద్ధాలు కేవలం సైనిక శక్తితోనే నిర్ణయించబడవని స్పష్టంగా సూచిస్తున్నాయి. వ్యూహాత్మక చాతుర్యం, మానసిక ప్రభావం, ఆర్థిక సమర్థత కలిసి ఫలితాలను ప్రభావితం చేస్తున్నాయి. ఇరాన్ తన వ్యూహాలతో కొంత మేర పైచేయి సాధించిందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నప్పటికీ, తుది ఫలితం ఇంకా స్పష్టంగా లేదు. భవిష్యత్తులో యుద్ధాల దిశను ఈ పరిణామాలు ప్రభావితం చేసే అవకాశముంది.



**ఫిరోజ్ ఖాన్,**
**సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9640466464**

### కారుణ్యమరణంతో
# హరీష్ రాణా మృతి

**సుప్రీం అనుమతితో చికిత్స నిలిపివేత**

**న్యూఢిల్లీ,మార్చి24(నినాదం):**
సుప్రీం కోర్టు ద్వారా కారుణ్య మరణానికి అనుమతి పొందిన హరీశ్ రాణా మృతిచెందాడు. సుమారు 13 ఏళ్లపాటు కోమాలో ఉండి జీవచ్ఛవంలా మారిన 32 ఏళ్ల హరీశ్ రాణా కారుణ్య మరణానికి సర్వోన్నత న్యాయస్థానం ఇటీవల అనుమతిచ్చిన విషయం తెలిసిందే. అతడికి చికిత్స నిలిపివేయొచ్చని న్యాయస్థానం పేర్కొంది. దీంతో ఎయిమ్స్ వైద్యులు అతడికి క్రమంగా చికిత్స నిలిపివేశారు. ఈ క్రమంలోనే అతడు మంగళవారం తుదిశ్వాస విడిచినట్లు సమాచారం. 13 ఏళ్లుగా కోమాలో ఉండి, జీవచ్ఛవంలా మంచానికే పరిమితమైన 32 ఏళ్ల హరీశ్ రాణాకు కారుణ్య మరణానికి(పాసివ్ యూతనేషియా) అనుమతిస్తూ సుప్రీంకోర్టు మార్చి 11న చారిత్రాత్మక తీర్పునిచ్చిన సంగతి విదితమే. న్యాయస్థానం ఆదేశాల మేరకు వైద్యం నిలివేసిన వైద్యులు.. క్రమంగా అతడి ఆరోగ్యం క్షీణింపజేసి, మరణించేలా చేశారు. ఈ విషయమై హరీశ్ రాణా తండ్రి అశోక్ రాణా స్పందిస్తూ.. 'మేం దీనికోసమే పోరాడుతున్నాం. ఏ తల్లిదండ్రులు తమ కొడుకుకు ఈ రకంగా జరగాలని కోరుకోరు' అని కన్నీటిపర్యంతమయ్యారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజియాబాద్‌కు చెందిన 32 ఏళ్ల హరీశ్ రాణా చండీగఢ్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతుండేవాడు. అతడు 2013 ఆగస్టు 20న హాస్టల్లో ప్రమాదవశాత్తూ నాలుగో అంతస్తు బాల్కనీ నుంచి కిందపడటంతో తలకు తీవ్ర గాయమైంది. శరీరం కదల్లేని స్థితికి చేరుకుంది. ప్రముఖ ఆసుపత్రుల్లో చికిత్స అందించినా అతడి హెల్త్ కండీషన్‌లో ఎలాంటి పురోగతి కనిపించలేదు. ప్రమాదానికి గురైన నాటి నుంచీ కోమాలోనే ఉండిపోయాడు. ఈ నేపథ్యంలో హరీశ్ తల్లిదండ్రులు 2024 జులైలో కుమారుడి కారుణ్య మరణానికి అనుమతించాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. పలు కారణాలతో ఈ పిటిషన్‌ను కొట్టివేసింది. తర్వాత సుప్రీంకోర్టుకు వెళ్లారు హరీశ్ తల్లిదండ్రులు. వైద్య నివేదికలు పరిశీలించిన సుప్రీం ధర్మాసనం.. ఈ ఏడాది జనవరి 13న హరీశ్ తల్లిదండ్రులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకుంది. మానవీయ కోణంలో మర్యాదపూర్వక మరణాన్ని ప్రసాదించాలని వారు కోర్టును వేడుకున్నారు. సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న ఈ కేసు విచారణలో సర్వోన్నత న్యాయస్థానం మార్చి 11న సంచలన తీర్పు వెలువరించింది. 13 ఏళ్లుగా జీవచ్ఛవంలా ఉన్న హరీశ్ రాణాకు పాసివ్ యూతనేషియాకు అనుమతించగా.. 2018లో చట్టబద్ధత అనంతరం దేశంలో పరోక్ష కారుణ్య మరణం జరిగిన తొలి కేసుగా నిలిచిన సంగతి తెలిసిందే.

# ఉసిరి జ్యూస్‌లో పోషకాలు

## కోకుమ్ జ్యూస్‌లో రోగనిరోధక శక్తి



## ఆయుర్వేద మూలికలతో
# అతివలకు ఆరోగ్యం

ఈ రోజుల్లో చాలా మంది మహిళలు పని ఒత్తిడి, అసమయ జీవనశైలి, మానసిక భారం వల్ల ఒత్తిడి, మానసిక స్థితిలో మార్పులు, నిద్ర సమస్యలు, హార్మోన్ల అసమతుల్యత వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. జీవనశైలి ముఖ్యమైన పాత్ర పోషించినప్పటికీ, ఆయుర్వేదం ప్రకారం కొన్ని ఔషధ మొక్కలు శరీరం రోజువారీ ఒత్తిడిని ఎదుర్కోవడానికి సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. మహిళల జీవితంలో వివిధ దశలలో వారి ఆరోగ్యానికి తోడ్పడటానికి అనేక మూలికలను ఆయుర్వేదంలో చాలా కాలంగా ఉపయోగిస్తున్నారని, కొన్ని ప్రత్యేక మూలికలు మహిళల్లో హార్మోన్ల అసమతుల్యత, స్ట్రెస్, ఆందోళన, నిద్ర సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయని, వీటిని వీటిని దినచర్యలో జాగ్రత్తగా చేర్చుకోవడం వల్ల మంచి ఫలితాలను పొందవచ్చని నిపుణలు తెలియజేస్తున్నారు. మహిళల ఆరోగ్యానికి ఉపయోగపడే ముఖ్యమైన మూలికల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**అశ్వగంధ, శతావరి..**

అశ్వగంధను అడాప్టోజెనిక్ మూలికగా పరిగణ◌ిస్తారు. దీనిని ఆయుర్వేదంలో రసాయనంగా పరిగణిస్తారు. శరీర పునరుజ్జీవనం కోసం, జీవశక్తికి దీనిని ఉపయోగిస్తారు. అశ్వగంధను ఉపయోగించడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయి. దీనిని ఉపయోగించడం వల్ల కార్టిసాల్ తగ్గుతుంది. దీంతో ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలు తగ్గుతాయి. నాడీ వ్యవస్థ అతిగా ఉత్తేజితం కాకుండా నివారిస్తుంది. థైరాయిడ్, అడ్రినల్ గ్రంథుల పనితీరుకు మద్దతు ఇస్తుంది. మొత్తం బలం, జీవశక్తిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. దీనిని హెర్బల్ టీ రూపంలో తీసుకోవచ్చు. అలాగే మహిళల ఆరోగ్య విషయానికి వస్తే ఆయుర్వేదంలో శతావరికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఆయుర్వేదంలో దీనిని హెర్బ్స్ క్వీన్ అని పిలుస్తారు. PCOS, ఇన్ఫర్టిలిటీ, మెనోపాజ్ సమస్యలతో బాధపడుతున్న మహిళలకు శతావరి సహాయకరంగా ఉంటుంది. అంతేకాకుండా హార్మోన్ల సమతుల్యతను కాపాడడంలో, అండాశయాల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, నెలసరి సక్రమంగా ఉండేలా చేయడంలో, PMS లక్షణాలను తగ్గించడంలో, గర్భధారణ తర్వాత పాల ఉత్పత్తి పెంచడంలో కూడా శతావరి ఎంతగానో సహాయపడుతుంది. దీనిని టీ రూపంలో లేదా లేహ్యం రూపంలో కూడా తీసుకోవచ్చు.

**తులసి..**

మహిళల ఆరోగ్యానికి, ముఖ్యంగా ఒత్తిడి, భావోద్వేగ సమతుల్యత విషయంలో తులసి ఎంతో సహాయపడుతుంది. తులసిని తీసుకోవడం వల్ల స్ట్రెస్, ఆందోళన వంటి సమస్యలు తగ్గుతాయి. కార్టిసాల్ స్థాయిలు అదుపులో ఉంటాయి. సెరోటోనిన్, డోపమైన్ వంటి హార్మోన్లు సమతుల్యంగా ఉంటాయి. మూడ్ స్వింగ్స్, చిరాకు తగ్గుతుంది. నిద్ర మెరుగుపడుతుంది. అన్ని వయసుల మహిళలకు తులసి ఉపయోగకరంగా ఉంటుంది. ఈ మూలికలు అన్ని వయసుల మహిళలకు ప్రయోజనకరంగా ఉన్నప్పటికీ వీటిని తీసుకునే ముందు నిపుణుడిని సంప్రదించడం మంచిది. మూలికలు ఆరోగ్యానికి మేలు చేసినప్పటికీ దీర్ఘకాలిక హార్మోన్ల ఆరోగ్యం రోజువారీ జీవనశైలిపై ఆధారపడి ఉంటుంది. కనుక జీవనశైలిలో కూడా మార్పులు చేసుకోవడం చాలా అవసరమని నిపుణులు తెలియజేస్తున్నారు.

వేసవి వేడి ఎక్కువగా పెరుగుతున్న సమయంలో ప్రజలు శరీరాన్ని చల్లగా ఉంచుకోవడానికి అనేక రకాల ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. ముఖ్యంగా శరీరాన్ని చల్లబరిచే పానీయాలను ఎక్కువగా తీసుకుంటూ ఉంటారు. వేసవిలో బయట మార్కెట్ లో లభించే శీతల పానీయాలకు బదులుగా సంప్రదాయ జ్యూస్ లను తీసుకోవడం మంచిది. వేసవిలో తీసుకోదగిన సహజ పానీయాల్లో కోకుమ్ జ్యూస్, ఉసిరి జ్యూస్ లు ముందు వరుసలో ఉంటాయని చెప్పవచ్చు. ప్రజలు కూడా వేసవిలో కోకుమ్ జ్యూస్, ఆమ్లా జ్యూస్ వంటి పానీయాలను ఎక్కువగా తీసుకుంటూ ఉంటారు. ఈ సంప్రదాయ సూపర్‌ఫుడ్స్‌తో తయారయ్యే ఈ జ్యూసులు శరీరానికి లోపల నుంచి చల్లదనం కలిగించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి. కోకుమ్ పండ్లు, మొత్తం ఉసిరి కాయలు పోషకాలను అధికంగా కలిగి ఉంటాయి.





**తాజా జ్యూస్‌లను తీసుకోవడం శ్రేయస్కరం..**

అయితే ప్రస్తుతం మార్కెట్లో సిరప్స్, పౌడర్ రూపంలో లభిస్తున్న జ్యూసులతో పోలిస్తే తాజా కోల్డ్–ప్రెస్డ్ జ్యూస్ లను తీసుకోవడం ఎక్కువ ప్రయోజనకరమని వైద్యులు చెబుతున్నారు. రెడీమేడ్ జ్యూసుల్లో కృత్రిమ రంగులు, రుచులు, రసాయనాలు ఉండే అవకాశం ఉంది. ఇవి ఆరోగ్య ప్రయోజనాలను తగ్గించవచ్చని కనుక తాజా జ్యూస్ లనే తీసుకునే ప్రయత్నం చేయాలని చెబుతున్నారు. అసలు వేసవిలో జ్యూస్ లను ఎందుకు తీసుకోవాలి.. కోకుమ్, ఉసిరి జ్యూస్ లలో ఏది శరీరానికి మేలు చేస్తుంది.. వంటి విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం. వేసవిలో జీర్ణవ్యవస్థ నెమ్మదిస్తుంది. అందుకే ఆహారాన్ని తక్కువగా తీసుకుంటారు. ఈ సమయంలో కోకుమ్ లేదా ఆమ్లా జ్యూస్ వంటి పానీయాలను తీసుకోవడం వల్ల శరీరానికి నీరు అందుతుంది. అవసరమైన పోషకాలు లభిస్తాయి. శరీరం లోపల నుంచి చల్లగా ఉంటుంది.

**కోకుమ్ జ్యూస్‌తో కలిగే లాభాలు..**

ఇక కోకుమ్ జ్యూస్ ను కోకుమ్ పండుతో తయారు చేస్తారు. దీనిలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అలాగే దీనిలో ఆంథోసైనిన్లు వంటి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. ఇందులో గార్సినాల్ కూడా ఉంటుంది. ఇది యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలను, శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటుంది. అలాగే దీనిలో హైడ్రాక్సీసిట్రిక్ యాసిడ్ వంటి ఆమ్లాలు కూడా ఉంటాయి. ఇవి జీర్ణశక్తిని మెరుగుపరచడంలో దోహదపడతాయి. అలాగే కొద్ది మొత్తంలో కాల్షియం, పొటాషియం, మెగ్నిషియం వంటి ఖనిజాలు కూడా ఇందులో ఉంటాయి. కోకుమ్ జ్యూస్ జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. వేసవిలో వచ్చే అలసటను తగ్గిస్తుంది.

**ఉసిరికాయ జ్యూస్ అయితే..**

ఉసిరి జ్యూస్ కూడా పోషకాలను కలిగి ఉంటుంది. మార్కెట్లో లభించే ప్యాక్డ్ జ్యూసుల్లో ఆమ్లా శాతం తక్కువగా ఉండే అవకాశం ఉంది. కాబట్టి లేబుల్ చూసి తీసుకోవడం మంచిది. తాజా ఆమ్లా జ్యూస్‌లో విటమిన్ సి 600–700 mg వరకు ఉంటుంది. అలాగే పాలీఫెనాల్స్, ఫ్లేవనాయిడ్స్ బలమైన యాంటీ ఆక్సిడెంట్ చర్యను అందిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడి నుండి రక్షిస్తాయి. ఇందులో కాల్షియం, ఐరన్, ఫాస్ఫరస్, పొటాషియం వంటి ఖనిజాలు కూడా ఉంటాయి. ఈ జ్యూస్ లో ఉండే అమినో యాసిడ్లు శరీర జీవక్రియకు మద్దతును ఇస్తాయి. ఉసిరి జ్యూస్ లో ఉండే ఫైబర్ జీర్ణక్రియకు మద్దతును ఇస్తుంది. ఇందులో క్యాలరీలు తక్కువగా ఉంటాయి కనుక రోజూ తీసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. ఉసిరి జ్యూస్ రోగనిరోధక శక్తిని పెంచి, శరీరానికి శక్తినిస్తుంది.

**దేన్ని తీసుకోవాలి..**

కోకుమ్ జ్యూస్, ఉసిరి జ్యూస్ రెండూ కూడా ఆరోగ్యానికి మేలు చేస్తాయి. కోకుమ్ జ్యూస్ శరీరాన్ని బాగా చల్లబరుస్తుంది. వేసవిలో వచ్చే జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. జీరా, ఉప్పు కలిపి ఈ జ్యూస్ ను తీసుకోవడం ఇంకా ప్రయోజనకరంగా ఉంటుంది. అదే విధంగా ఆమ్లా జ్యూస్ శరీరాన్ని హైడ్రేట్ చేస్తుంది. కొలెస్ట్రాల్ తగ్గించడంలో సహాయపడుతుంది. మెటబాలిజాన్ని మెరుగుపరుస్తుంది. రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. కోకుమ్ జ్యూస్ శరీరాన్ని చల్లగా ఉంచడంలో కొంచెం ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. ఆమ్లా జ్యూస్ మొత్తం ఆరోగ్యానికి ఎక్కువ ప్రయోజనాలను అందిస్తుంది. ఈ రెండు జ్యూసులు కూడా ఆరోగ్యానికి మంచివే. ఏ జ్యూస్ తీసుకోవాలన్నది సొంత నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు.

# బంగారం ధరలు తగ్గుముఖం



## రూ.2,940 తగ్గిన గోల్డ్.. భారీగా తగ్గిన వెండి

దేశంలో బంగారం ధరలు వరుసగా తగ్గుముఖం పడుతున్నాయి. హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,40,350గా ఉంది. ఇంతకుముందు రోజు రూ.14,32,90 ఉంది. అంటే ఒక్క రోజులోనే రూ.2,940 వరకు తగ్గింది. ఇరాన్‌పై దాడులను నిలిపివేస్తామంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం, రూపాయి విలువ తగ్గడం, డాలర్ బలపడటం వంటి కారణాలు బంగారం ధరలపై తీవ్ర ప్రభావం చూపాయి. సాధారణంగా డాలర్ విలువ పెరిగితే బంగారం ధరలు తగ్గుతాయి. ఇదే సమయంలో వెండి ధరలు కూడా భారీగా పతనమవుతున్నాయి. ఈ నెలలోనే బంగారం ధరలు దాదాపు 19.52 శాతం పడిపోయాయి. 1975 తర్వాత ఒక నెలలో ఈ స్థాయిలో బంగారం ధరలు పతనమవ్వడం ఇదే మొదటిసారి అని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక ఔన్స్ బంగారం ధర సుమారు 4,263 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ప్రస్తుతం వివిధ మార్కెట్లలో బంగారం, వెండి ధరలు ఈ విధంగా ఉన్నాయి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,40,350, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,27,777, 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,04,544గా ఉంది.

ఇక చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 14,1820, 22 క్యారెట్ల ధర రూ. 1,30,000, 18 క్యారెట్ల ధర రూ. 10,82,00, ముంబైలో ముంబై.. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 14,0350, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 12,8650, 18 క్యారెట్ల బంగానం ధర రూ. 10,5260, బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 14,0350, 22 క్యారెట్ల బంగారం ధర రూ. 12,8650, 18 క్యారెట్ల బంగారం ధర రూ. 10,526, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.14,0350, 22 క్యారెట్ల బంగారం ధర రూ.12,86,50, 18 క్యారెట్లు బంగారం ధర రూ10,52,60. వెండి కిలో ధర రూ.2,18,348గా ఉంది.




# లాభాల్లో ముగిసిన మార్కెట్

## 1,372 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్.. నిఫ్టీ 445 పాయింట్లు లాభం

భారతీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ లాభాల్లో ముగిశాయి. మధ్యాహ్నం ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 1,372 పాయింట్లు (1.89 శాతం) పెరిగి, 74,068 వద్ద ముగిసింది. అలాగే నిఫ్టీ 445 పాయింట్లు పెరిగి 22,957.80 వద్ద ముగిసింది. సెన్సెక్స్ ఒక దశలో 1700 పాయింట్లు పెరిగింది. నిఫ్టీ కూడా ఒక దశలో 23000 దాటింది. 30 షేర్ బీఎస్ఈ సెన్సెక్స్‌లో ఇండిగో, ఎల్ అండ్ టీ, ఎటర్నల్, బజాజ్ ఫైనాన్స్, ఏసియన్ పెయింట్స్, పవర్ గ్రిడ్, లాగార్ భారీ లాభాలు పొందాయి.

హెచ్‌డీఎఫ్‌సీ షేర్లు 1.1 శాతం పెరిగాయి. అంతకుముందు మూడు సెషన్లలో కలిపి హెచ్‌డీఎఫ్‌సీ షేర్లు 11.7 శాతం తగ్గి, రూ 1,35,000 కోట్లు మార్కెట్ విలువ కోల్పోయింది. ఈ రోజు నిఫ్టీ స్మాల్‌క్యాప్100 0.77 శాతం, నిఫ్టీ మిడ్‌క్యాప్100 1.10 శాతం పెరిగింది. ఇరాన్‌పై ఐదు రోజులపాటు దాడుల్ని నిలిపివేస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన మార్కెట్లకు మంచి బలాన్నిచ్చింది. అలాగే అంతర్జాతీయ మార్కెట్లు కూడా లాభాల్లోనే కొనసాగడం కలిసొచ్చింది. దీంతో సోమవారం నష్టాల్లో ముగిసిన మార్కెట్లు మంగళవారం లాభాలబాట




పట్టాయి. ఇన్వెస్టర్ల సంపద మంగళవారం ఒక్క రోజే రూ.7 లక్షల కోట్లకు పెరిగింది. దీంతో మొత్తం మార్కెట్ విలువ రూ.423 లక్షల కోట్లకు చేరింది. మంగళవారం ఉదయం ట్రేడింగ్ లాభాల్లోనే ప్రారంభమైంది. సోమవారం 72,696.39 వద్ద ముగిసిన సెన్సెక్స్ మంగళవారం ఉదయం 74,212.47 వద్ద లాభంతో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. మరోవైపు డాలర్‌తో రూపాయి విలువ 93.86గా ఉంది. అంతర్జాతీయంగా బ్యారెల్ క్రూడాయిల్ ధర 101 డాలర్లుగా ఉంది. బంగారం ఔన్స్ ధర 4,430 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## ఎలక్ట్రిక్ కార్లపై ఏకంగా
# ₹4 లక్షల వరకు డిస్కౌంట్
## మహీంద్రా ధమాకా ఆఫర్స్





ఇంధన కష్టాలు పెరుగుతున్న వేళ ఎలక్ట్రిక్ కారు కొనాలనుకుంటున్న ఆటో లవర్స్‌కు ఇది అదిరిపోయే శుభవార్త. దేశీయ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా తన ఎలక్ట్రిక్ వాహనాల పోర్ఫ◌ోలియోపై మార్చి నెలలో కనీవినీ ఎరుగని రీతిలో భారీ ఆఫర్లను ప్రకటించింది. కొత్త మోడళ్ల రాకతో పాత స్టాక్‌ను క్లియర్ చేయడంతో పాటుగా.. దేశీయ ఈవీ మార్కెట్లో తన పట్టును పెంచుకోవడానికి కంపెనీ ఏకంగా రూ.4 లక్షల వరకు డిస్కౌంట్లను ఆఫర్ చేస్తోంది. మీరు గనుక స్టైలిష్ లుక్, పవర్‌ఫుల్ పర్ఫార్మెన్స్ ఉన్న ఈవీ కోసం చూస్తుంటే.. ఈ నెల మీకు సరైన సమయం అనే చెప్పాలి. మహీంద్రా పోర్ట్‌ఫోలియోలో అత్యధిక ఆఫర్లను అందిస్తున్న మోడల్ ఏదైనా ఉందంటే అది XUV 400 EL Pro. ఈ కారుపై కంపెనీ ప్రస్తుతం రూ.4 లక్షల వరకు భారీ డిస్కౌంట్ ఆఫర్ చేస్తోంది కంపెనీ. ఇందులో 34.5 kWh, 39.4 kWh బ్యాటరీ ప్యాక్ ఆప్షన్లు ఉన్నాయి. ఇవి సింగిల్ ఛార్జ్‌పై 359 కిమీ నుంచి 456 కిమీ వరకు రేంజ్‌ను ఇస్తాయి. ఈ మోడల్ కార్ల ధర రూ.17లక్షల 49వేలుగా ఇప్పుడు కంపెనీ అందిస్తున్న డిస్కౌంట్‌తో అత్యంత ఆకర్షణీయమైన డీల్‌గా మారింది. మహీంద్రా నుండి వచ్చిన సరికొత్త ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ BE 6 కూడా భారీ ఆఫర్ల జాబితాలో చేరిపోయింది. ఈ కారుపై ఏకంగా రూ.2 లక్షల వరకు క్యాష్ డిస్కౌంట్ లభిస్తోంది మహీంద్రా గ్రూప్. ఇది 59 kWh, 79 kWh బ్యాటరీ ఆప్షన్లతో వస్తుంది. దీని ప్రారంభ ధర రూ.18లక్షల 90వేలుగా ఉంది. మరోవైపుప్రీమియం లుక్‌తో ఆకట్టుకునే 'XEV 9e' మోడల్‌పై కూడా కంపెనీ రూ.లక్షా 40వేల వరకు తగ్గింపును ప్రకటించింది. ఈ కారు లాంగ్ డ్రైవ్ ఇష్టపడే వారికి అద్భుతమైన ఆప్షన్ అంటున్నారు ఆటో నిపుణులు.

మహీంద్రా ఇప్పటికే తన లైనప్‌లోకి XEV 9S, XUV 3XO EVలను చేర్చింది. భవిష్యత్తులో మరిన్ని మోడళ్లను లాంచ్ చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో ప్రస్తుత మోడళ్లపై ఇస్తున్న ఈ భారీ డిస్కౌంట్లు కేవలం ఈ మార్చి నెలకు మాత్రమే పరిమితం కావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. పెరుగుతున్న పెట్రోల్ ధరల నుంచి ఉపశమనం పొందాలనుకునే వారు.. ఈ భారీ ఆఫర్లను ఉపయోగించుకుని మహీంద్రా ఈవీని ఇంటికి తెచ్చుకోవడానికి ఇదే సరైన అవకాశం.

# టికెట్ క్యాన్సిలేషన్‌కు కొత్త రూల్స్
## రైల్వే ప్రయాణికులకు అలర్ట్!

భారతీయ రైల్వే టికెట్ క్యాన్సిలేషన్ ఛార్జీల విషయంలో కీలక మార్పులు చేసింది. ట్రైన్ బయల్దేరే సమయం ఆధారంగా టికెట్ సొమ్మును రిఫండ్ చేసే విధానాన్ని సవరించింది. కొత్త రూల్స్ ప్రకారం 72 గంటల ముందు ఎవరైనా కన్ఫామ్ టికెట్‌ను రద్దు చేసుకుంటే పూర్తి మొత్తం రిఫండ్ (క్యాన్సిలేషన్ ఛార్జీలకు లోబడి) చేసేలా మార్పులు చేసింది. బోర్డింగ్ పాయింట్ నిబంధనలనూ మార్చింది. ఈ మేరకు కొత్తగా తీసుకొచ్చిన పలు సంస్కరణలను రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వివరించారు. ఏప్రిల్ 1 నుంచి ఏప్రిల్ 15 మధ్య దశలవారీగా ఈ మార్పులు అమలు చేయనున్నట్లు ప్రకటించారు.

**కొత్త రూల్స్ ఇలా..**

ప్రయాణానికి 72 గంటల ముందు టికెట్‌ను రద్దు చేసుకుంటే 'మ్యాగ్జిమమ్ రిఫండ్' చేస్తారు. కొంత క్యాన్సిలేషన్ ఛార్జీలను ఉపసంహరించుకుని మిగిలిన మొత్తాన్ని రిఫండ్ చేస్తారు.

ట్రైన్ బయల్దేరడానికి 72 గంటల నుంచి 24 గంటల మధ్య టికెట్ రద్దు చేస్తే 'స్టాండర్డ్ పెనాల్టీ' విధిస్తారు. టికెట్ ధరలో 25 శాతం మినహాయించుకుని మిగిలిన మొత్తాన్ని (కనీస ఛార్జి ఆధారంగా) రిఫండ్ చేస్తారు.

ట్రైన్ బయల్దేరడానికి 24 గంటల ముందు నుంచి 8 గంటల మధ్య టికెట్ రద్దు చేసుకుంటే 'లేట్ క్యాన్సిలేషన్'గా పరిగణించి 50 శాతం ఫేర్‌ను మినహాయించి మిగిలిన మొత్తం రిఫండ్ చేస్తారు.

ప్రయాణానికి 8 గంటల ముందు గానీ, ట్రైన్ బయల్దేరిన తర్వాత ఎవరైనా టికెట్ రద్దు చేసుకుంటే ఎలాంటి రిఫండ్ ఉండదు.



దీంతో పాటు ప్రయాణానికి 30 నిమిషాల ముందు వరకు బోర్డింగ్ పాయింట్ మార్చుకునే సదుపాయాన్నీ రైల్వేశాఖ కల్పించింది. ముఖ్యంగా నగరాల్లో ఎక్కువ స్టేషన్లు ఉన్నప్పుడు ఈ వెసులుబాటును ప్రయాణికులు ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతానికి చార్ట్ ప్రిపేర్ చేయడానికి ముందు వరకు మాత్రమే అనుమతిస్తున్నారు.

గతంలో కౌంటర్ టికెట్‌ను రద్దు చేసుకోవాలంటే రైలు ప్రారంభమయ్యే స్టేషన్‌లో మాత్రమే వెసులుబాటు ఉంది. ఇకపై ఏ స్టేషన్‌లోనైనా క్యాన్సిల్ చేసుకోవచ్చు.

అలాగే, ఇ–టికెట్ కలిగిన ప్రయాణికులు టికెట్ డిపాజిట్ రిసీట్ ఫైల్ చేయాలంటే మాన్యువల్‌గా చేయాల్సి వచ్చేది. ఇకపై ప్రయాణికుడి ప్రమేయం లేకుండా టీడీఆర్ రూల్స్‌ను అనుసరించి ఆటోమేటిక్‌గా రిఫండ్ చేస్తారు. కౌంటర్ టికెట్‌పై ప్రయాణానికి 30 నిమిషాల ముందు కూడా ఇకపై ప్రయాణ తరగతిని అప్‌గ్రేడ్ చేసుకునే వెసులుబాటును కల్పిస్తున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

# పదిలంగా భారత ఆర్థిక వ్యవస్థ



పశ్చిమాసియాలో తీవ్రరూపం దాల్చిన ఘర్షణలు, అమెరికా చేపట్టిన తాజా వాణిజ్య దర్యాప్తులు ప్రపంచ మార్కెట్లలో తీవ్ర హెచ్చుతగ్గులకు దారితీశాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మార్చి బులెటిన్ పేర్కొంది. విదేశీ కుదుపుల నుంచి దేశాన్ని రక్షించేందుకు మనవద్ద విదేశీ మారకపు నిల్వలు తగిన స్థాయిలో ఉన్నాయని బులెటిన్‌లోని స్టేట్ ఆఫ్ ది ఎకానమీ కథనం స్పష్టం చేసింది. (బులెటిన్‌లో ఇచ్చిన విషయాలు ఆర్‌బీఐ అధికారిక ప్రకటన కిందకు రావు). ఫిబ్రవరి చివరి నుంచి పశ్చిమాసియాలో భౌగోళిక ఉద్రిక్తతలు పెద్ద ఘర్షణగా మారాయి. హర్మూజ్ జలసంధిలో ఆటంకాల వల్ల ఇంధనం, ఇతర వాణిజ్య సరఫరాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీనిని చరిత్రలోనే అతిపెద్ద చమురు సరఫరా అంతరాయంగా ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ అభివర్ణించింది కూడా. ఫలితంగా ముడి చమురు ధరల్లో విపరీతమైన అస్థిరత నెలకొంది. మార్చిలోనే బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 78 డాలర్ల నుంచి ఏకంగా 112.2 డాలర్లకు పెరిగింది. చమురుతో పాటు అల్యూమినియం, యూరియా ధరలు సైతం భారీగా పెరిగాయి. ఇలాంటి అనిశ్చితి వల్ల, ద్రవ్యోల్బణ భయాలతో ప్రపంచంలోని ప్రధాన కేంద్ర బ్యాంకులు తమ వడ్డీ రేట్లను మార్చకుండా యథాతథంగా ఉంచాయి.

## అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలి

### మాజీ కార్పొరేటర్ శ్రీనివాసరెడ్డి



**అల్వాల్, మార్చి 24( నినాదం):** అల్వాల్ డివిజన్ పరిధిలోని రామచంద్రపురం కాలనీలో జరుగుతున్న అభివృద్ధి మురుగు కాలువ పైప్ లైన్ ను పనులను మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి. మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హెచ్ఎమ్ డబ్ల్యూ ఎస్ఎస్ బి డిజిఎం వెంకటేశ్వర్లు, శేఖర్ తో కలిసి పనుల పురోగతి సమీక్షించారు. అనంతరం కాలనీవాసులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులు నిర్దిష్ట స్థాయిలో నాణ్యత తో చేపట్టాలని ఎటువంటి ఆలస్యం చేయకుండా త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్. అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాలనీ నెంబర్ నారాయణ, శీను, రాజు, పాల్గొన్నారు

## సీతారాముల కళ్యాణానికి హాజరుకండి

### ఎమ్మెల్యే జిఎంఆర్‌ను ఆహ్వానించిన ఆలయ కమిటీ సభ్యులు



**పటాన్చెరు, మార్చి 24 (నినాదం):** శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని పటాన్చెరు డివిజన్ పరిధిలోని శ్రీ కోదండ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈ నెల 25 నుండి 29 వరకు నిర్వహించనున్న శ్రీ రామనవమి బ్రహ్మోత్సవాలలో పాల్గొనాలని కోరుతూ మంగళవారం సాయంత్రం ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి గారిని కలిసి, ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. కళ్యాణ మహోత్సవం సందర్భంగా గణపతి పూజ, కళ్యాణం, అన్నప్రసాద వితరణ, స్వామి వార్ల ఊరేగింపు కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ప్రధాన అర్చకులు నరసింహచార్యులు, పూజారులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు భరోసా

### సిఎంఆర్ఎఫ్ పత్రాలను అందజేసిన కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, మార్చి 24 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఎనిమిది మంది అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ద్వారా మంజూరైన (నాలుగు లక్షల యాభై వేల) 4.50 లక్షల విలువైన సి ఎం ఆర్ ఎఫ్ చెక్కులను షాపూర్ నగర్ లోని ఆయన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం అర్హులైన నిరుపేదలకు అనారోగ్యంతో బాధపడుతతూ అత్యవసర పరిస్థితులలో భరోసా ఇస్తుందని పేర్కొన్నారు. అనారోగ్యం కారణంగా చికిత్స చేయించుకున్న రాజేష్ కుమార్, లావు సప్న, శ్రీలేఖ, ముద్దుల బాబు, మహమ్మద్ హుస్సేన్, మాధవి, చిన్న స్వామి, విశాలకు మంజూరైన సి.ఎం.ఆర్.ఎఫ్ ఎల్ఓసి పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# పోలీస్ సిబ్బంది క్రమశిక్షణకు నిదర్శనం

### పోలీస్ డి.ఏ.ఆర్ హెడ్ క్వార్టర్స్‌ను పరిశీలించిన ఎస్పీ స్నేహ మెహ్రా



**వికారాబాద్, మార్చి 24(నినాదం):** జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలోని డిఏఆర్ క్వార్టర్స్‌ను సోమవారం జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐ పి ఎస్ సందర్శించారు. ముందుగా అక్కడి పోలీస్ అధికారులు, సిబ్బందితో మాట్లాడి వారి పనితీరు, విధులు తదితర అంశాలను తెలుసుకున్నారు. తదుపరి, హెడ్ క్వార్టర్స్‌లోని వివిధ విభాగాలను ఎస్పీ సందర్శించి ఆర్మరీ రూమ్, డ్యూటీ ఆఫీసర్స్ రూమ్, బి.డి టీమ్ రూమ్ వంటి ముఖ్య విభాగాల పనితీరును పరిశీలించారు. అదేవిధంగా ఆర్ఐ ఆఫీస్, డిఎస్పి ఆఫీస్‌లను పరిశీలించి, అక్కడి నిర్వహణ విధానాలపై సూచనలు చేశారు. అనంతరం పోలీస్ క్యాంటీన్, డి.ఏ.ఆర్ పరిసరాలు, ఎం.టి సెక్షన్, గ్యాస్ ఆఫీస్, గ్యాస్ గోదాం, వాటర్ ప్లాంట్ వంటి విభాగాలను కూడా సందర్శించి సమగ్రంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ సంబంధిత అధికారులను వివిధ అంశాలపై ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ముఖ్యంగా క్లూస్ టీమ్‌కు సంబంధించిన మినిస్ట్రీ ఆఫ్ హోం అఫైర్స్ నుండి వచ్చిన ప్రత్యేక వాహనాన్ని పరిశీలించి, దాని వినియోగం నిర్వహణపై ఆరా తీశారు. వాటర్ ప్లాంట్ వద్ద నీటి నాణ్యతను స్వయంగా పరీక్షించి, శుద్ధమైన తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆమె జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ, జిల్లా పోలిడ్ ఆర్మ్డ్ రిజర్వ్ హెడ్ క్వార్టర్స్ అనేది జిల్లా రక్షణ వ్యవస్థకు వెన్నెముక వంటిదన్నారు. ఇక్కడ పనిచేసే ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో పాటు తమ పని ప్రదేశాన్ని కూడా శుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచడం చాలా అవసరమన్నారు. డీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన తనిఖీల్లో పరిసరాలు పరిశుభ్రంగా, సక్రమంగా నిర్వహించడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. పోలీస్ సిబ్బంది క్రమశిక్షణకు నిదర్శనమని అన్నారు. హోం శాఖ నుండి వచ్చిన కొత్త క్లూస్ టీమ్ వాహనం నేర పరిశోధనలో మరింత సాంకేతిక సామర్థ్యాన్ని అందిస్తుందని ఆయుధాలు, వాహనాలు ఇతర వనరులను అత్యంత జాగ్రత్తగా సంరక్షించడం ప్రతి సిబ్బంది బాధ్యత. పోలీస్ శాఖలో ప్రతి విభాగం సమర్థవంతంగా పనిచేస్తేనే ప్రజలకు మెరుగైన భద్రత, సేవలు అందించగలుగుతామని, అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి.రాములు నాయక్, డి.ఏ.ఆర్ డిఎస్పి వీరేష్, ఆర్ఐ నాగరాజు, ఎంటిఓ శ్రీశైలం,ఆర్ఎస్ఐ లు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రేషన్‌డీలర్ల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం





### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్చెరు, మార్చి 24 (నినాదం):** పల్లె నుండి పట్నం వరకు నిత్యం ప్రజలతో సంబంధాలు కలిగి ఉండే రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని, అవసరమైన పక్షంలో ఉద్యమాలకు సైతం సిద్ధమని పటాన్చెరు శాసన సభ్యులు, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన రేషన్ డీలర్ల సంఘం సంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశానికి ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల సంభవించిన, కరోనా లాంటి మహమ్మారి మూలంగా లక్షలాదిమంది చనిపోయిన సమయంలోనూ ప్రాణాలకు తెగించి ప్రజలకు నిత్యవసర వస్తువులు అందించడంలో రేషన్ డీలర్ల పాత్ర శ్లాఘనీయమన్నారు. దశాబ్ద కాలంగా రేషన్ డీలర్లు వివిధ సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రేషన్ డీలర్లకు ఇచ్చిన ప్రధాన హామీలను వెంటనే అమలుపరచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో డీలర్ల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాయికోటి రాజు మాట్లాడుతూ.. రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలతో పాటు, ప్రతి రేషన్ డీలర్ కు 10 లక్షల రూపాయల ఇన్సూరెన్స్, ఎంఎల్ఎస్ పాయింటలో ఎలక్ట్రానిక్ వే బ్రిడ్జిలు, కరోనా సమయంలో మరణించిన రేషన్ డీలర్ల కుటుంబ సభ్యులకు తిరిగి రేషన్ దుకాణాలు కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, రేషన్‌డీలర్లు పాల్గొన్నారు.

## నాచారం పెద్ద చెరువును సందర్శించిన హైడ్రా కమిషనర్





**కాప్రా, మార్చి 24 (నినాదం) :** ఉప్పల్ నియోజకవర్గంలోని చెరువులను రూ.102 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్టుగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. చెరువులలో అభివృద్ధితో పాటు సుందరీకరణ పనులను కూడా చేపడుతున్నట్టుగా చెప్పారు. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆహ్వానం మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ నాచారం(హెచ్ఎంటీనగర్) చెరువును సందర్శించారు. నాచారం చెరువులో త్వరలోనే అభివృద్ధి, సుందరీకరణ పనులను చేపట్టనున్నట్టుగా ఈ సందర్భంగా రంగనాథ్ తెలిపారు. రూ.30 కోట్ల నిధులతో త్వరలోనే పనులు జరుగుతాయన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని చెరువుల అభివృద్ధి, సుందరీకరణకు కృషి చేస్తున్నట్టుగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో మొదటి విడతలో నాలుగు చెరువుల అభివృద్ధి, సుందరీకరణ పనులకు నిధులు సైతం మంజూరు చేయించినట్టుగా చెప్పారు. ఉప్పల్ నల్ల చెరువు రూ.20 కోట్లు, నాచారం(హెచ్ఎంటీనగర్) చెరువు రూ.30 కోట్లు, కాప్రా చెరువు రూ.35 కోట్లు, రామంతాపూర్ పెద్ద చెరువు రూ.17 కోట్ల చొప్పున నిధులొచ్చినట్టుగా తెలిపారు. ఇప్పటికే ఉప్పల్ నల్లచెరువులో పనులను చేపట్టి తుది దశలో ఉన్నాయన్నారు. అతి త్వరలోనే నాచారం మిగతా చెరువులలో పనులను చేపట్టనున్నట్టుగా చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణారెడ్డి, హెచ్ఆర్ మోహన్, ప్రకాష్ రెడ్డి, అశ్వద్ధామ రెడ్డి, భావన గౌడ్, మహేష్ యాదవ్, రమేష్ గౌడ్, నూతలకంటి రాజు, సంతోష్ రెడ్డి, రాజి రెడ్డి, కృష్ణ యాదవ్, వెంకట్ రెడ్డి, వెంకట్ గౌడ్, తుంగ తిరుపతి, సూర్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇస్కాన్ ఆధ్యాత్మిక సంస్థకు స్థలం కేటాయించాలి

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**అల్వాల్, మార్చి 24 (నినాదం):** మల్కాజ్‌గిరి నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి అసెంబ్లీలో దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్కాజ్‌గిరి నియోజకవర్గ పరిధిలోని సికింద్రాబాద్ మహేంద్ర హిల్స్ ప్రాంతంలో ఉన్న శ్రీ జయగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం సమీపంలో ఇస్కాన్ సంస్థకు దేవాదాయ శాఖకు చెందిన భూమిని కేటాయించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మంత్రివర్యులను కోరారు. ప్రపంచవ్యాప్తంగా ఆధ్యాత్మిక సేవలందిస్తున్న ఇస్కాన్ సంస్థ భగవద్గీత బోధన, యువతకు నాయకత్వ శిక్షణ, సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా శిక్షణ వంటి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజానికి విశేష సేవలందిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా అన్నదానం, ప్రసాదం పంపిణీ వంటి సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఆధ్యాత్మికతతో పాటు సామాజిక సేవలను అందిస్తున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో సుమారు 500 నుండి 1500 చదరపు గజాల భూమిని కేటాయించి, శ్రీ కృష్ణ దేవాలయం, కళ్యాణ మండపం మరియు ఆధ్యాత్మిక, నైతిక విద్యా కార్యక్రమాల కోసం అవసరమైన వసతులను ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అందుకుగాను మంత్రి వర్యులు సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత బలపడటంతో పాటు ప్రజలకు మేలుకలిగే అవకాశాలు ఏర్పడతాయని ఎమ్మెల్యే గారు ఆశాభావం వ్యక్తం చేశారు.

### ఘనంగా సీతారామ వసంత నవరాత్రి ఉత్సవాలు



**అల్వాల్, మార్చి 24 (నినాదం):** శ్రీ సీతారామ సంకీర్తన సంగం ఆధ్వర్యంలో 75వ శ్రీ సీతారామ వసంత నవరాత్రిత్సవంలో భాగంగా మంగళవారం శివాలయం ప్రాంగణంలో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారికి చందనాభిషేకం, నాగావళి దళార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించిన బ్రహ్మశ్రీ మిరియంపల్లి వరుణ్ కుమార్ శర్మ, ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామ సంకీర్తన సంఘం సభ్యులు కందకట్ల సుదర్శన్ రెడ్డి, పరాంకుశం మాధవ్, వెంకట రామచంద్రరావు, చందిల్ , రవి, రాము, కృష్ణారెడ్డి, జర్నీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు

### నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే మా లక్ష్యం

### లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలి

### పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్చెరు, మార్చి 24 (నినాదం):** పటాన్చెరు నియోజకవర్గ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికి సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని లకడారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు ప్రొసిడింగ్ పత్రాలతో పాటు.. గృహ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలకు సొంత స్థలం ఉంటే ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తూ సొంతింటిని నిర్మించడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని తెలిపారు. నియోజకవర్గం వ్యాప్తంగా 3500 ఇల్లు మంజూరు అయ్యాయని తెలిపారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారిని గుర్తించి లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. పూర్తి పారదర్శకతతో రాజకీయాలకు అతీతంగా అర్హులకే వీటిని కేటాయించడం జరిగిందని స్పష్టం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని దుర్వినియోగం చేయకుండా ఇళ్లను నిర్మించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇళ్ల కోసం దళారులను ఆశ్రయించి మోసపోవద్దని కోరారు. ఇళ్ల నిర్మాణ దశకు అనుగుణంగా నిధులు విడుదల అవుతాయని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో ఇల్లు లేని కుటుంబాలు వేల సంఖ్యలో ఉన్నాయని.. ఇందుకు అనుగుణంగా ఇళ్ల కేటాయింపును పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుమలత, మున్సిపల్ కమిషనర్ వెంకట కిషన్, స్థానిక కౌన్సిలర్లు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలలో ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శం

### కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్



**జవహర్‌నగర్, మార్చి 24 (నినాదం):** సంక్షేమ పథకాలలో తెలంగాణ రాష్ట్రం దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందని, పేదలకు గృహాలను నిర్మించి ఇవ్వడంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మొదటి వరసలో నిలబడడం అభినందనీయమని జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ మదర్ తెరిసా కాలనీ వాస్తవ్యులైన మేడ లతా రాజు లకు ఇటీవలే ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం లో భాగంగా ఇంటి నిర్మాణం చేపట్టగా లతా రాజులు ఇటీవలే ఇల్లు నిర్మించుకొని గృహప్రవేశానికి సిద్ధమయ్యారు. ఈ మేరకు గృహప్రవేశానికి జవహర్ నగర్ మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్ తదితరులతో మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ గృహప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 6 గ్యారంటీ పథకాలలో భాగంగా ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకానికి జవహర్ నగర్ లో పెద్ద ఎత్తున లబ్ధిదారులు ఎంపికవ్వడం ఆనందంగా ఉందన్నారు. పేద ప్రజలకు నిలయమైన జవహర్ నగర్ లో ప్రభుత్వ పథకాలు ను సద్వినియోగం చేసుకోవడం ముదావహమన్నారు. ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం ఐదు లక్షలు సాయం అందించడంతో పేదల బతుకులు మారిపోతాయనటంలో సందేహం లేదన్నారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, ఇందిరమ్మ కమిటీ ప్రెసిడెంట్ బూడిద వెంకటేష్, హౌసింగ్ ఏఈ శ్రీహరి, భాష పల్లి రమేష్ చారి, యూత్ ప్రెసిడెంట్ మాట్ల వినయ్, రాజు యాదవ్, మేరీ, రవి, భాస్కర్ గౌడ్, కిషోర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## హెల్త్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి



**దుబ్బాక మార్చి 24( నినాదం):** ఉచిత హెల్త్ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ సూచించారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 2026 మార్చి 25న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో స్త్రీల వ్యాధులు, చిన్నపిల్లల వ్యాధులు, సాధారణ రోగాలు, ఎముకల సమస్యలు, కంటి మరియు దంత సంబంధిత వ్యాధులకు నిపుణులైన వైద్యులు సేవలు అందించనున్నారని చెప్పారు. కావున సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

## గీతంలో ఆధునిక కృత్రిమ మేధస్సుపై కార్యశాల






**పటాన్చెరు, మార్చి 24 (నినాదం):** హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ కు చెందిన గణిత, గణాంక శాస్త్ర విభాగం 'ఆధునిక ఏఐ అన్వేషణ: సహజ భాషా ప్రాసెసింగ్ నుంచి అభిజ్ఞా మేధస్సు వరకు' పేరిట నిర్వహిస్తున్న రెండు రోజుల ఆచరణాత్మక కార్యశాలను మంగళవారం ఉదయం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాదు విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ శిబా ఉద్గాట ముఖ్య అతిథిగా, కెపిఎమ్ జీ గ్లోబల్ డెలివరీ సెంటర్, హైదరాబాదుకు చెందిన డాక్టర్ కె. సంపత్ కుమార్ ఆత్మీయ అతిథిగా పాల్గొన్నారు. ముఖ్య అతిథి మాట్లాడుతూ, మానవ మెదడు యొక్క అద్భుతమైన సామర్థ్యాలను, దక్షతను వివరిస్తూ, మానవ మేధస్సు అనేక అంశాలలో కృత్రిమ మేధస్సును అధిగమిస్తూనే ఉందని నొక్కి చెప్పారు. విద్యార్థులంతా ఆత్మవిశ్వాసంతో ఉండాలని, నిరంతరం నేర్చుకోవాలని, ఏఐని సామాజిక ప్రయోజనానికి ఒక సాధనంగా బాధ్యతాయుతంగా ఉపయోగించాలని ప్రొఫెసర్ ఉద్గాట ప్రోత్సహించారు. ఏఐ యొక్క వేగవంతమైన పరిణామం గురించి గౌరవ అతిథి ప్రసంగిస్తూ, 'అటెన్షన్ ఈజ్ ఆల్ యు నీడ్' వంటి ప్రాథమిక పరిశోధనల నుంచి చాట్ జీపీటీ వంటి ఆధునిక అప్లికేషన్ల వరకు దాని పురోగతులను వివరించారు. వివిధ పరిశ్రమలలో ఏఐ తీసుకొస్తున్న పరివర్తనాత్మక ప్రభావాన్ని, ఏఐని వినియోగించుకోవడంలో పెరుగుతున్న డెవలపర్ల పాత్రను వివరించారు. సైబర్ సెక్యూరిటీతో సహా కొత్తగా ఎదురయ్యే సవాళ్లకు సిద్ధంగా ఉండాల్సిన ప్రాముఖ్యతను డాక్టర్ సంపత్ కుమార్ వివరించారు. ఈ కార్యశాలలో డాక్టర్ పి.కృష్ణమూర్తి (ఐఐఐటీ హైదరాబాదు), ప్రొఫెసర్ రమేష్ కుమార్ మిశ్రా (హైదరాబాదు విశ్వవిద్యాలయం), ప్రొఫెసర్ అనిమేష్ ముఖర్జీ (ఐఐటీ ఖరగ్ పూర్) వంటి ప్రముఖ నిపుణులు పాల్గొంటున్నారు. కృత్రిమ మేధస్సు, సహజ భాషా ప్రాసెసింగ్, కాగ్నిటివ్ సైన్స్ లలోని ఇటీవలి పురోగతులను, వాటి గణిత, గణన పునాదులపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రముఖ సంస్థలకు చెందిన విద్యావేత్తలు, పరిశోధకులు నైపుణ్యోపన్యాసాలు చేయడంతో పాటు ఆచరణాత్మక శిక్షణ కూడా ఇస్తున్నారు. ఇందులో పాల్గొంటున్న వారు, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్, ఏజెంటిక్ ఏఐ, బహుభాషా ఎన్ఎల్ పీ, కాగ్నిటివ్-ప్రేరిత వ్యవస్థలతో సహా అభివృద్ధి చెందుతున్న ఏఐ సాంకేతికతలపై ఆచరణాత్మక అనుభవాన్ని పొందడంతో పాటు వివిధ పరిశ్రమలలో వాటి వినియోగంపై అవగాహనను కూడా ఏర్పరచుకుంటున్నారు. తొలుత, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ మోతహర్ రెజా అతిథులను స్వాగతించి, సత్కరించారు. విభాగాధిపతి డాక్టర్ జాదవ్ గణేష్ మార్గదర్శనంలో, డాక్టర్ కె.కృష్ణ, డాక్టర్ కె.భీమశంకర్ సహకారంతో డాక్టర్ డి. మల్లికార్జునరెడ్డి ఈ కార్యశాలను సమన్వయం చేస్తున్నారు. విద్యార్థి సమన్వయకర్తలు సహస్ర, దీప, సుష్మిక, స్నేహలు వారికి సహకరిస్తున్నారు. ఎం.ఎస్సీ. డేటా సైన్స్, బీ.ఎస్సీ. సీఎస్ సీఎస్, బీ.ఎస్సీ. స్టాటిస్టిక్స్ కోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులతో పాటు పలువురు అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆచార్య జయశంకర్ విగ్రహ ఆవిష్కరణ

### విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కొలను హనుమంత రెడ్డి



**కుత్బుల్లాపూర్, మార్చి 24 (నినాదం):** తెలంగాణ సిద్ధాంతకర్త, ఆరు దశాబ్దాల ఉద్యమ ప్రదాత, అపర మేధావి, తెలంగాణ జాతిపితగా పేరుగాంచిన స్వర్గీయ కీ.శే.ఆచార్య కొత్తపల్లి జయశంకర్ (సార్) జ్ఞాపకార్థంగా ప్రగతి నగర్‌లోని అలీప్ సర్కిల్‌లో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించి, అనంతరం పూలమాల అర్పించి ఘనంగా నివాళులు సమర్పించారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించి, తన జీవితాన్ని ప్రజల కోసం అంకితం చేసిన మహానుభావుడని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో నడుచుకుంటూ, తెలంగాణ అభివృద్ధికి కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో

# ఎన్‌సీసీ శిబిరం విజయవంతం

**విద్యార్థుల్లో దేశభక్తి,**

**నైతిక విలువల పెంపుపై దృష్టి**




**కరీంనగర్, మార్చి 24(నినాదం):** కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో గత రెండు రోజులుగా నిర్వహించిన ఎన్సీసీ శిబిరం విజయవంతంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి శిక్షణ పొందుతున్న కెడెట్లతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థుల్లో దేశభక్తి భావన పెంపొందించడం, హక్కులు-విధులపై అవగాహన కల్పించడం ఈ శిబిరం లక్ష్యమని ఆయన తెలిపారు. పోటీ ప్రపంచంలో నైతిక విలువలు, క్రమశిక్షణ, ఏకాగ్రత అవసరమని, పరస్పర సహకారం, కరుణతో వ్యవహరించాలని సూచించారు. బాధ్యతలను నిర్భయంగా, అడ్డంకులు లేకుండా నిర్వర్తించే గుణాలు అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఎన్సీసీకి ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నదని, మార్గదర్శకాల ప్రకారం శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్నారు. సుమారు 150 మంది విద్యార్థులకు శిక్షణతో పాటు భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. శిబిరంలో అందించిన వసతులు, నాణ్యమైన ఆహారం పట్ల విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేయగా, ఎన్సీసీ అధికారులు నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. సిద్దిపేట, కరీంనగర్, సిరిసిల్ల ప్రాంతాల నుంచి వచ్చిన కేడెట్లు, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మహిళా పోలీసుల సాధికారతకు షీ లీడ్స్ సదస్సు

**నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం పెంపొందింపుకు కరీంనగర్ పోలీసుల వినూత్న కార్యక్రమం**

**పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం**




**కరీంనగర్, మార్చి 24(నినాదం):** మహిళా పోలీసు అధికారుల నైపుణ్యాలను అభివృద్ధి చేసి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు కరీంనగర్ పోలీసుల ఆధ్వర్యంలో "షీ లీడ్స్ 2026" సదస్సు ఘనంగా నిర్వహించారు. అస్త్ర కన్వెన్షన్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజ రక్షణలో మహిళా పోలీసుల పాత్ర కీలకమని, సేవాభావంతో బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. రోజంతా సాగిన ఈ సదస్సులో పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు, చర్చలు నిర్వహించారు. సంస్కృతఓయూ డాక్టర్ మొహమ్మద్ అబ్దుల్ కలాం మహిళా అధికారుల్లో ధైర్యాన్ని పెంపొందించే ప్రసంగం చేశారు. ఆరోగ్యం, యోగా ప్రాధాన్యంపై దీప్తి పోషకాహారం, ఆహార నియమాలను వివరించారు. విధుల నిర్వహణలో బాధితులు, నిందితులు, ఆందోళనకారులతో వ్యవహరించే విధానంపై ఏసీపీ హుజూరాబాద్ వి. మాధవి అవగాహన కల్పించారు. మధ్యాహ్నం మహిళా అధికారుల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సాధారణ పరీక్షలు, స్త్రీ రోగ సలహాలు, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, కంటి పరీక్షలు చేపట్టారు. కార్యక్రమం ముగింపులో పాల్గొన్న వారికి బహుమతులు అందజేసి, అతిథులను సన్మానించారు.

# ఆర్డీవో కార్యాలయం వద్ద అర్జీదారుల హరిగోస

**కూర్చునేందుకు కుర్చీలు లేవు.. మంచినీటి సౌకర్యం సున్నా..**

**టాయిలెట్ల దుర్వాసనతో నరకప్రాయం**



**హుస్నాబాద్, మార్చి 24(నినాదం):-** హుస్నాబాద్‌లోని రెవెన్యూ డివిజనల్ అధికారి (=ఆర్డీఓ) మరియు తహశీల్దార్ కార్యాలయా లకు వివిధ పనుల నిమిత్తం వచ్చే సామాన్య ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పూర్తిస్థాయిలో విఫలమవుతున్నారు. నిత్యం వందలాది మంది అర్జీదారులు భూ సమస్యలు, కుల ధృవీకరణ పత్రాలు మరియు ఇతర ప్రభుత్వ పథకాల దరఖాస్తుల కోసం సుదూర ప్రాంతాల నుండి ఈ కార్యాలయాలకు వస్తుంటారు. అయితే గంటల తరబడి అధికారుల కోసం వేచి ఉండాల్సి వస్తున్న తరుణంలో, వారికి కూర్చునేందుకు కనీసం ఒక్క కుర్చీ లేదా బెంచీ కూడా అందుబాటులో లేకపోవడం గమనార్హం. దీనితో వృద్ధులు, మహిళలు, వికలాంగులు సైతం కార్యాలయ కారిడార్లలో ఉన్న సిమెంట్ ప్లాట్‌ఫారమ్‌లపై, మెట్లపైనే కూర్చోవాల్సిన దుస్థితి నెలకొంది. ఎంతో ఆశతో తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చే సామాన్యులకు కనీస మర్యాద కూడా దక్కకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఎండలు ముదురుతున్న తరుణంలో కార్యాలయానికి వచ్చే అర్జీదారులకు కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా మారింది. దాహంతో అలమటిస్తున్న ప్రజలు బయట ప్రైవేట్ దుకాణాలకు వెళ్లి నీళ్లు కొనుక్కోవాల్సి వస్తోంది. మరోవైపు కార్యాలయ ఆవరణలో ఉన్న టాయిలెట్ల పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. సరైన నిర్వహణ లేకపోవడం, నీటి సదుపాయం సరిగ్గా లేకపోవడంతో టాయిలెట్లు విపరీతమైన దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఈ కంపు భరించలేక కార్యాలయానికి వచ్చే వారు ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా మహిళా అర్జీదారులు ఈ అపరిశుభ్రత వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏసీ గదుల్లో కూర్చునే అధికారులకు సామాన్య ప్రజలు అనుభవిస్తున్న ఈ కష్టాలు కనిపించడం లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. కోట్లాది రూపాయల నిధులతో భవనాలు నిర్మిస్తున్నప్పటికీ, వచ్చే ప్రజల కోసం కనీస సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహించడం సరికాదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, వెంటనే వెయిటింగ్ హాల్స్ ఏర్పాటు చేయాలని, సరిపడా కుర్చీలు వేయించడంతో పాటు మంచినీటి వసతి కల్పించి, టాయిలెట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

గ్యాస్ సరఫరాలో

# నిబంధనలు కచ్చితంగా పాటించాలి

**గృహ వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా సరఫరా నిర్వహణపై**

**అధికారుల ఆదేశాలు**

**కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్, మార్చి 24(నినాదం )** జిల్లాలో గ్యాస్ సరఫరా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జరగాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా హెచ్చరించారు. మంగళవారం సీతారాంపూర్‌లోని నిర్మల భారత్ గ్యాస్ ఏజెన్సీ గోదామును ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, గృహ మరియు వాణిజ్య సిలిండర్ల బుకింగ్, నిల్వలు, రోజువారీ సరఫరా వివరాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి, ఆసుపత్రులు మరియు ఇతర వినియోగదారులకు సరఫరా పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా డీలర్లు నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా సరఫరా నిర్వహించాలని, ఎటువంటి అక్రమాలకు పాల్పడవద్దని ఆదేశించారు. గృహ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే నిల్వలు, బుకింగ్ వివరాలను నిరంతరం పౌర సరఫరాల శాఖకు తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ తనిఖీలలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, జిల్లా పౌర సరఫరాల అధికారి నర్సింగరావు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులకు భయపడేది లేదు

**-వడ్డెర సంఘం మండల అధ్యక్షుడు పల్లపు రవి**




**జమ్మికుంట, మార్చి 24 (నినాదం) :** ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసే వరకు పోరాటం ఆగదని జమ్మికుంట మండల వడ్డెర సంఘం అధ్యక్షుడు పల్లపు రవి అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మా న్యాయమైన డిమాండ్ కొరకు రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు చలో సెక్రటేరియట్ ప్రోగ్రాం కు వెళ్తున్న మమ్మల్ని అక్రమంగా పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసే వరకు పోరాటం చేస్తామని ఇలాంటి అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. అంతేకాకుండా వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయబద్ధమైన మా డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఆయన కోరారు.

సీతారామచంద్రస్వామి

## బ్రహ్మోత్సవాలకు రండి

**-మున్సిపల్ చైర్మన్ ను ఆహ్వానించిన ఆలయ చైర్మన్**



**జమ్మికుంట, మార్చి 24 (నినాదం):** అపర భద్రాద్రిగా పేరుపొందిన ఇల్లంతకుంట లోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం లో ఈ నెల 27న జరిగే బ్రహ్మోత్సవాలకు రావాలని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్, వైస్ చైర్మన్ జావేద్ లను ఆహ్వానించిన ఇల్లంతకుంట ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ప్రశాంత్ కుమార్ ను కలిసి భద్రాచలం తర్వాత అదే తరహాలో అంగరంగ వైభవంగా రాముల వారి కళ్యాణం ఇల్లంతకుంటలో నిర్వహిస్తామని ఈ కార్యక్రమానికి మున్సిపల్ పాలకవర్గాన్ని ఆహ్వానించిన ఆలయ కమిటీ. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని మీకు మా పూర్తి సహకారం అందిస్తామని ఆ శ్రీరామచంద్రుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఇంగిలే రామారావు ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

**అక్రమ అరెస్టులకు భయపడేది లేదు**

**బిఆర్ఎస్వి నాయకులు కొమ్ము నరేష్**



**జమ్మికుంట, మార్చి 24 (నినాదం) :** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వారి న్యాయమైన డిమాండ్ల కొరకు పోరాటం చేస్తున్న ఉద్యమకారులను అడ్డుకొని అక్రమ అరెస్టు చేయడం దారుణమైన చర్య అని బిఆర్ఎస్వి విద్యార్థి విభాగం నాయకులు కొమ్ము నరేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ఆరు గ్యారెంటీల పథకాన్ని ప్రవేశపెట్టారని అందులో ఉద్యమకారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డుతో పాటు 250 గజాల ఇంటి స్థలం 25 వేల రూపాయల పెన్షన్ ప్రతి ఉద్యమకారునికి అందిస్తానని అప్పుడు హామీ ఇచ్చారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇచ్చిన హామీని నెరవేర్చకుండా పోరాటం చేస్తున్న నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం సరైన పద్ధతి కాదని ఆయన తెలిపారు. అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తారేమోనని సోమవారం రాత్రి ముంతస్తుగా జమ్మికుంట పోలీసులు అరెస్టు చేయడం సరైన పద్ధతి కాదని ప్రభుత్వం ఎన్ని అరెస్టులు చేసినా భయపడే ప్రసక్తి లేదని ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

# హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైంది

**బుర్ర శ్రీనివాస్ గౌడ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు**

**ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరాలి**

**ఒక ఉచిత బస్సు ప్రయాణం తప్ప మిగతా గ్యారెంటీలకు మంగళం పాడిన సర్కార్**




**హుస్నాబాద్ మార్చ్ 24 (నినాదం):** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరు గ్యారెంటీలలో ఒక మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప మిగతా హామీలకు మంగళం పాడిందని ఆరు గ్యారెంటీలపై ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఆరోపిస్తూ హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీఓ రామ్మూర్తికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో అన్ని వర్గాల ప్రజలకు మోసం చేసిందని రైతుల సమస్యలు, ఉద్యోగుల సమస్యలు, నిరుద్యోగుల సమస్యలు, ఆర్టీసీ కార్మికుల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. వృద్ధులకు వికలాంగులకు ఇచ్చే పింఛన్లను పెంచుతామని రాష్ట్ర సర్కార్ హామీ ఇచ్చి మరిచిపోయిందని విమర్శించారు. మహిళలకు నెలకు 2500 రూపాయల పెన్షన్ మరియు మహాలక్ష్మి పథకం కింద తులం బంగారం లాంటి హామీలను విస్మరిస్తుందని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే అంశమే లేదని అన్నారు. ఆరు గ్యారెంటీలపై స్పష్టమైన హామీలేదని ప్రభుత్వంపై ఆయన మండిపడ్డారు. కేవలం కుంభకోణాల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బడ్జెట్ ను పెటుకున్నారని ఆరోపించారు నిరుద్యోగ సమస్య ఉద్యోగుల సమస్య ప్రజల సమస్యలు పై బడ్జెట్లో ఎలాంటి అంశం లేదని విమర్శించారు. రైతులకు ఇచ్చే రైతు భరోసా కు ఇచ్చిన మాట ప్రకారం ఈసారైనా 15 వేలకు పెంచుతారని ఆశించిన రైతులకు నిరాశ మిగిలించారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి రెండున్నర ఏళ్ళు అవుతున్న హామీలను నెరవేర్చలేదని ఆయన అన్నారు న వృద్ధాప్య పింఛన్లను వికలాంగుల పింఛన్ల విషయంలో కూడా ప్రభుత్వం మాట తప్పేందని వృద్ధులకు 4 వేలు వికలాంగులకు 6 వేలు ఇస్తానన్న ప్రభుత్వం మోసం చేసిందని ఆగ్రహించారు. ఇలా ప్రజల పట్ల ప్రజలను మోసం చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు ఇస్తూ పబ్బం గడుపుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీ ల పైన స్పష్టమైన హామీ ఇస్తూ అమలు చేయాలని ఆయన అన్నారు లేనిపక్షంలో ప్రజల పక్షాన ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీ ల అమలకు పోరాడుతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎంపీ రెడ్డి, నాయకులు శ్యాంసుందర్, జగన్, శ్రీనివాస్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు

## కష్టానికి ఫలితం... నవోదయ సీటు సాధించిన విద్యార్థికి సన్మానం



**మల్లాపూర్, మార్చి 24 (నినాదం) :** మండలంలోని గుండంపల్లి గ్రామానికి చెందిన జక్కుల నవదీప్ కష్టానికి ఫలితంగా నవోదయ ప్రవేశ పరీక్షలో సీటు సాధించి గుండంపల్లికే గర్వకారణంగా నిలిచాడు. ధర్మారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యాభ్యాసం సాగిస్తూ ఉపాధ్యాయుల, తండ్రి మధుబాబు ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నందున కుమారుడికి పూర్తి సహకారంతో విద్యార్థి సాధించాడు. జువ్వాడి కృష్ణారావు విద్యార్థి నవదీప్ ని ఘనంగా సన్మానించారు. కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని నవోదయ, కేంద్రీయ విద్యాలయాల్లో, గురుకులాల్లో అర్హత సాధించి ఉజ్వల భవితను నిర్మించుకొని తల్లిదండ్రులకు, గ్రామాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. నవదీప్ సాధించిన విజయం పట్ల గ్రామ ప్రజలు, యువకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడుపుల పుష్పలత నరసయ్య, సర్పంచ్ పద్మ నరసయ్య, బెజ్జారపు శ్రీనివాస్, మామిడి లక్ష్మారెడ్డి, రాజ తిరుపతి, గంగారెడ్డి, గంగాధర్, కిరణ్, గంగరాజం, విజయ్, క్రాంతి, నరేష్, దినేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ

**టీబీ రహిత సమాజాన్ని నిర్మిద్దాం**

**ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ వరుణ**



**జమ్మికుంట, మార్చి 24 (నినాదం):** ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ బాలుర పాఠశాల విద్యార్థులతో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వరుణ ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవ ర్యాలీని నిర్వహించడం జరిగినది. టి బి అంతం - మన అందరి పంతం. టి బి రహిత సమాజాన్ని -నిర్మిద్దాం. టి బికి -పరీక్షలు ఉచితం. టి బి కి -మందులు ఉచితం వంటి నినాదాలతో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం పాఠశాల విద్యార్థులకు డాక్టర్ వరుణ, హెల్త్ ఎడ్యుకేటర్ అడిదెల మోహన్ రెడ్డి టి బి వ్యాధి లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలను క్లుప్తంగా వివరించి చెప్పినారు. ఎవరికైనా రెండు వారాలకి మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవటం, రాత్రి పూట చెమటలతో జ్వరం రావటం, దగ్గులో తెమడ పడటం, అలసట వంటి మొదలగు లక్షణాలు ఉంటే వెంటనే హాస్పిటల్ కి వచ్చి పరీక్షలు చేహించు కోవాలని విద్యార్థులకు సూచించారు. వ్యక్తి గత పరిశుభ్రత పై అవగహన కల్పించినారు. వడ దెబ్బ లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలను క్లుప్తంగా వివరించి చెప్పినారు. అనంతరం విద్యార్థులచే మానవహారం నిర్వహించి ,టి బి ప్రతిజ్ఞ చేహించినారు. ఈ కార్యక్రమములో డాక్టర్ వరుణ, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యేసు మని, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఏఎన్ఎం రాధ,టిబి క్లస్టర్ కోఆర్డినేటర్ తిరుపతి,ఆశా కార్యకర్త సునీత,పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సీఎం కప్‌లో తృతీయ ఓవరాల్ చాంపియన్షిప్

**కరీంనగర్, మార్చి 24(నినాదం)** రాష్ట్రస్థాయి సీఎం కప్ క్రీడా పోటీల్లో కరీంనగర్ జిల్లా తృతీయ ఓవరాల్ చాంపియన్షిప్‌ను సాధించింది. ఈ విషయాన్ని జిల్లా క్రీడా అధికారి శ్రీనివాసు వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవంలో రాష్ట్ర క్రీడామంత్రి ట్రోఫీలు అందజేశారు. పోటీలలో ఆదిలాబాద్ జిల్లా 82.3 పాయింట్లతో ప్రథమ స్థానం సాధించగా, రంగారెడ్డి జిల్లా 79.5 పాయింట్లతో ద్వితీయ స్థానం పొందింది. కరీంనగర్ జిల్లా 79.4 పాయింట్లతో తృతీయ స్థానం దక్కించుకుంది. విజేతలకు క్రీడామంత్రి, క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, అంతర్జాతీయ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ తదితరులు బహుమతులు ప్రదానం చేశారు. కరీంనగర్ జిల్లా ఈ స్థాయి విజయం సాధించడం ఇదే మొదటిసారి కావడం విశేషం.

నానో యూరియా ఉపయోగంపై

## రైతులకు అవగాహన..



**జమ్మికుంట, మార్చి 24 (నినాదం) :** వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ బిటిటి హుజురాబాద్ వారి ఆధ్వర్యంలో జమ్మికుంట మండలంలోని మడిపల్లి, అంకుసాపూర్ గ్రామ రైతులకు మడిపల్లి రైతువేదిక నందు పంటల సాగులో నానో యూరియా ఉపయోగం,వరి మొక్కజొన్న పంటలో సస్యరక్షణ చర్యలు పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం జమ్మికుంట శాస్త్రవేత్త విజయ్ మాట్లాడుతూ పంటల సాగులో భూమి ఆరోగ్యం చాలా ముఖ్యమైనది, ప్రధాన పంటకు ముందు పచ్చి రొట్టె ఎరువులు అయినా జీలుగా, జనుము, పిల్లి పెసర వంటి పొలంలో చల్లి పూత వచ్చే సమయానికి నేలలో కలియదున్నడం వలన భూమి పాటు ఉంటుందని తెలిపారు. భూమిలో ఆర్గానిక్ కర్బనం ఉన్నప్పుడే భూమి సారం ఉన్నట్టు అని తెలిపారు. జమ్మికుంట లోని కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రకృతి పద్ధతి లో సాగు చేయడం జరుగుతుందని, రైతులు కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించి సాగు విధానాన్ని అలవరుచుకోవడం వలన నేల ఆరోగ్యం తో పాటుగా మనుషుల ఆరోగ్యం కూడా బాగుంటుందని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్ మాట్లాడుతూ పంటలకు చీడపీడలు ఆశించకుండా ఉండడం కొరకు సూడోమొనాస్ ను పంట కాలంలో మూడుసార్లు పిచికారి చేసినట్లయితే పంట ఎటువంటి రోగానికి గురికాకుండా ఉంటుంది, పిచికారి చేసిన సమయంలో వేప నూనెను వాడినట్లయితే పురుగులు పెట్టిన గుడ్లను నాశనం చేయపడతాయి అలాగే తల్లి పురుగులు ఇట్టి పంటపై గుడ్లు పెట్టడం జరగదు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో వరి పంటలో అగ్గి తెగులు ఉధృతి గమనించడం జరుగుతుంది కనుక సస్యరక్షణ చర్యలను పాటించాలి అని తెలిపారు. యూరియా ను అధిక మోతాదులో వాడడం వలన పంట వివిధ రోగాలకు మరియు పురుగు లు ఆశించడానికి అనుకూలంగా ఉం టుందని తెలియజేశారు. నానో యూ రియాను బాటిల్లో యూరియా శాతాన్ని 20% పెంచడం జరిగింది. పంట మొదటి రెండు దఫాలు పై పాటుగా యూరియా బస్తాలను వాడిన తర్వాత మూడు నాలుగు దఫాలలో నానో యూరియాను స్ప్రే చేసుకున్నట్లయితే మంచి దిగుబడులను పొందవచ్చు .

ఓటరు జాబితా

## పారదర్శకతకు ప్రత్యేక సమగ్ర సవరణ




**కరీంనగర్, మార్చి 24(నినాదం):** ఓటరు జాబితా పారదర్శకంగా, ఖచ్చితంగా ఉండేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీలు సమన్వయంతో సహకరించాలని ఆమె కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, బూత్ స్థాయి అధికారులు మాత్రమే కాకుండా రాజకీయ పార్టీలు నియమించే బూత్ స్థాయి ప్రతినిధుల పాత్ర కూడా కీలకమని పేర్కొన్నారు. 1951 నుంచి ఇప్పటివరకు ఎనిమిది సార్లు ఈ సవరణ నిర్వహించబడిందని, చివరిసారిగా 20022004 మధ్య జరిగింది అని వివరించారు. ఈ సవరణ ద్వారా నకిలీ, మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన లేదా రెండు చోట్ల ఓటు నమోదు ఉన్న వారి పేర్లు మాత్రమే తొలగిస్తారని స్పష్టం చేశారు. ఎవరూ అపోహలకు గురికాకుండా జాగ్రత్తపడాలని సూచించారు. సవరణ అనంతరం ఓటు హక్కు రాకపోతే అభ్యంతరం తెలియజేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డీవో రమేష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కూచనపల్లి, అంకుస్‌గండి వాగులపై వంతెనలు నిర్మించాలి



**హుస్నాబాద్ మార్చి 24(నినాదం):-** హుస్నాబాద్ మండలంలోని కూచనపల్లి గ్రామం నుండి మాలపల్లికి వెళ్లే దారిలోని వాగుపై, అలాగే హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కింద ఉన్న అంకుస్‌గండి వాగుపై వెంటనే వంతెనల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి నిరసన చేపట్టారు. కూచనపల్లి గ్రామం నుండి మాలపల్లికి వెళ్లే వాగులో వంతెన లేకపోవడం వల్ల రైతులు తమ వ్యవసాయ భూములకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా చిన్నపాటి వర్షం కురిసినా వాగు ప్రవాహం కారణంగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం చిన్న వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయని, దీనివల్ల ఎల్లమ్మ చెరువు కింద ఉన్న పొలాలకు వెళ్లడం రైతులకు కష్టతరంగా మారిందని పేర్కొన్నారు. ఈ సమస్యపై గతంలో అనేకసార్లు ప్రభుత్వానికి విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదని, ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రభాకర్ గారు ప్రత్యేక దృష్టి సారించి వెంటనే వంతెనల నిర్మాణం చేపట్టి రైతుల ఇబ్బందులను తొలగించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ అధికార ప్రతినిధులు సుద్దాల చంద్రయ్య, అయిలేని మల్లికార్జున రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు అయిలేని గాల్ రెడ్డి, మేకల వికాస్ యాదవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు. వీరితో పాటు రైతులు గీకురూ తిరుపతి, నరసయ్య, బంక రాజు, బండి చంద్రం, గుళ్ళ సారయ్య, సతీష్, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

29 వ వార్డు అభివృద్ధికి

## సహకరించండి

**బిజెపి నేత గట్టు రాకేష్**

**జమ్మికుంట, మార్చి 24 (నినాదం) :** మున్సిపల్ పరిధిలోని 29వ వార్డులో నెలకొన్న సమస్యలను దృష్టిలో పెట్టుకొని వార్డు అభివృద్ధి కోసం ప్రత్యేక చొరవ చూపాలని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ములుగు ప్రశాంత్ కుమార్ ను కలిసి వార్డు సమస్యల గురించి వివరించిన వార్డు అధ్యక్షుడు బిజెపి నేత గట్టు రాకేష్ గౌడ్. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ప్రశాంత్ కుమార్ ను పర్యాయ పూర్వకంగా కలిసి ఆయనను శాలువాతో సన్మానించారు. అనంతరం రాకేష్ మాట్లాడుతూ, పార్టీలకు అతీతంగా పట్టణ ప్రజలు చైర్మన్ గా మిమ్మల్ని ఎన్నుకున్నారని మున్సిపల్ అభివృద్ధి కోసం మీరు చేస్తున్న సేవలు అభినందనీయమని భవిష్యత్తులో కూడా ఇలాగే పనిచేస్తూ ప్రజల మనసులను గెలుచుకోవాలని కోరారు.

# పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే ఎలా

**పరిశుభ్ర వాతావరణంలో పిల్లలు ఉండేలా చూడాలి**

**పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనం పెంచాలి**

**కలెక్టర్ రాహుల్ శర్మ**

**పాఠశాల నిర్వహణ తీరుపై కలెక్టర్ అసంతృప్తి**



**మహాముత్తారం, మార్చి 24(నినాదం):** విద్యార్థులు చదువుకునే పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే ఎలా అని జిల్లా కలెక్టర్ రాహల్ శర్మ అసహనం వ్యక్తం చేశారు. సోమవారం మహాముత్తారం మండలం లోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అపరిశుభ్రంగా ఉంటే పరిసరాల్లో విష జంతువులు సంచరించే అవకాశం ఉన్నందున, విద్యార్థుల భద్రతకు ముప్పు ఏర్పడుతుందని పేర్కొన్నారు. తక్షణమే పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి పాఠశాల ప్రాంగణాన్ని పూర్తిగా పరిశుభ్రంగా మార్చాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. చేపట్టిన పారిశుద్ధ్య పనుల ఫోటోలను తనకు పంపించాలని సూచించారు. అదనంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతూ పచ్చదనం పెంచాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలకు వెళ్లే రోడ్డు నిర్మాణం ఇంకా పూర్తికాకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, జాప్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు విద్యుత్ పనులను వెంటనే ప్రారంభించి, బుధవారం నుండి పనులు వేగవంతం చేయాలని సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మంచినీటి సరఫరా విషయమై మిషన్ భగీరథ అధికారులు పరిస్థితిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తనిఖీ అనంతరం, జిల్లా కలెక్టర్ 10వ తరగతి విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారితో స్నేహపూర్వకంగా మాట్లాడారు. హాలో స్టూడెంట్స్‌డ ఎలా ఉన్నారు? ఇప్పటి వరకు ఎన్ని పరీక్షలు వ్రాసారు? ఎలా వ్రాసారు? ఇంకా ఎన్ని పరీక్షలు మిగిలి ఉన్నాయి?" అని అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పరీక్షలను కూడా విజయవంతంగా పూర్తి చేయాలని, బాగా చదివి ఉన్నత స్థాయికి చేరాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డీఈఓ రాజేందర్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఓ ప్రకాష్, సర్పంచ్ బాబు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

# ఐదేళ్ల చిన్నారిపై ఇద్దరు మైనర్ బాలుర అత్యాచారం

**మహాదేవపూర్ మార్చి 24, (నినాదం):** ఐదేళ్ల చిన్నారిపై ఇద్దరం మైనర్ బాలురు అత్యాచారం చేసిన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తెలిసిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన ఓకే సామాజిక వర్గానికి, అదే కాలనీకి చెందిన చిన్నారి ఆదివారం రోజున మండల కేంద్రంలోని ఓ పాఠశాల గ్రౌండ్ లో ఆడుకుంటుండగా 7వ తరగతి,9 వ తరగతి చదువుతున్న ఇద్దరు మైనర్ బాలురు ఆ చిన్నారికి నమ్మవలిగించి అత్యాచారానికి ఒడిగట్టినట్లు తెలిసింది. కాగా ఆ చిన్నారి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో నొప్పి లేస్తుందని తెలుపగా స్థానిక ఆసుపత్రికి తీసుకురాగా డాక్టర్లు విషయం కాస్త తల్లిదండ్రులకు తెలుపగా వెంటనే చిన్నారి తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆ చిన్నారిని జిల్లా ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. ఫోక్సు చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరు మైనర్ బాలురను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మండల కేంద్రంలో ఆ చిట్టి తల్లి పై జరిగిన అమానవీయ సంఘటన చర్చనీయాంశంగా మారింది. కాగా ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. నిందితులకు కఠిన కారాగార శిక్ష విధించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉంటేనే దేశానికి బలం

**జిల్లాలో టీబి నిర్మూలనపై ప్రత్యేక కార్యక్రమాలు**

**కలెక్టర్ రాహుల్ శర్మ**





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉంటేనే దేశం బలంగా ఉంటుందనీ టీబీపై పోరాటం మన అందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మంగళవారం ప్రపంచ టీబీ దినోత్స వం సందర్భంగా జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ఏర్పాటు చేసిన టీబీ దినోత్సవంలో మున్సి పల్ కార్మికులకు ఏర్పాటు చేసిన ఉచిత టీబీ స్క్రీనింగ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ టీబీపై ప్రతి ఒక్కరూ అవగాహన పొందాలని సూచించారు. ప్రభుత్వం టీబీ నిర్మూలనకు అనేక కార్యక్రమాలు చేపట్టిందని ముఖ్యంగా టీబీ రహిత తెలంగాణ కోసం మన జిల్లాకు మొబైల్ ఎక్సరే మిషన్ ను అందించడం జరిగిందని అన్నారు. జిల్లా లో టీబీ నిర్మూలనకు 35 గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాలలో మొబైల్ ఎక్సర్ ద్వారా ప్రతి ఒక్కరికి స్క్రీనింగ్ చేపట్టి 6 నెలలు పాటు చికిత్స అందించడం జరుగుతుందని తెలిపారు. లక్షణాలు గుర్తించిన వ్యక్తులకు ఉచిత వైద్య సేవలతో పాటు పోషణ కిట్లను సైతం అందించడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ కార్మికులు, ఆశా కార్యకర్తలు ప్రజల ఆరోగ్య పరిరక్షణలో సైనికులని అభినందించారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి కార్యాచరణలో భాగంగా మున్సిపల్ కార్మికులకు, ఆశా సిబ్బందికి ప్రత్యేకంగా వైద్య శిబిరం నిర్వహించి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారిని, మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య మాట్లాడుతూ క్షయ వ్యాధిసోకిన వ్యక్తులను గుర్తించి వైద్య సేవలు అందించి పరిపూర్ణ ఆరోగ్య వంతులుగా మార్చాలని తెలిపారు. వైద్య సేవలు అందించే వైద్య సిబ్బంది ప్రజలకు దేవుళ్ళతో సమానమని తెలిపారు. అనంతరం మొబైల్ ఎక్సరే ద్వారా మున్సిపల్ కార్మికులకు ఛాతీ ఎక్స్ రే తీయు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, కౌన్సిలర్ అప్పం కిషన్, వైద్యులు డా ఉమారాణి పాల్గొన్నారు.

# ఏప్రిల్ 15 నుంచి పొగిళ్ల భూముల సర్వేకు ప్రత్యేక సర్వే బృందాలు



**నల్లగొండ ప్రతినిధి మార్చి 24( నినాదం ) :** నల్గొండ జిల్లా చందంపేట మండలం,పొగిళ్ల ,కంబాలపల్లిల లో ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, జిల్లా అధికారులతో కలిసి పొగిళ్ల, కంబాలపల్లి గ్రామాలను సందర్శించారు. ముందుగా గ్రామంలో పర్యటించి ఇందిరమ్మ ఇండ్లు , గ్రామ సమస్యలను గ్రామస్తుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాల ను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. వంటగదిని ,పాఠశాలలో సౌకర్యాలు ,మధ్యాహ్న భోజనం, తదితర వివరాలను పరిశీలించడమే కాకుండా, తనిఖీ చేశారు. అసంపూర్తిగా ఉన్న పాఠశాల తరగతిగదితోపాటు, తాగునీరు,కిచెన్ ఇతర పనులన్నింటిని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీతో తీర్మానం చేయించి అంచనాలు పంపించి పనులు చేపట్టి పూర్తి చేయించాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. ఎలా చదువుతున్నారని? విద్యార్థులను ప్రశ్నించడమే కాకుండా, యూనిఫామ్ వేసుకోవాలనీ చెప్పి విద్యార్థులతో తెలుగు శతకాలు ,పద్యాలు చదివించారు. విద్యార్థులు మధ్యలో బడిమాని వేయకుండా చూడాలని, ఉపాధ్యాయులు రెగ్యులర్ గా పాఠశాలకు వచ్చేలా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు.అనంతరం పాఠశాల ఆవరణలో గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామంలో ఉన్న భూ సమస్యల విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, గ్రామస్తులతో కలెక్టర్ మాట్లాడుతూ పొగిళ్ల గ్రామంలో సర్వేనెంబర్ 2 లో సుమారు 1056 ఎకరాలు ఉందని, గతంలో డిఫామ్ పట్టాలు ఇవ్వడం జరిగిందని, 2023 లో ఎల్ ఆర్ యు పి అమలు సందర్భంగా కొంతమంది రైతుల భూములకు పట్టాలు రాలేదని, కొంతమంది రైతులకు ఎక్కువ భూమి రికార్డు కావడం, కొంతమందికి రికార్డు కాకపోవడం జరిగాయని, ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకురాగా, కంబాలపల్లి లో ఇదే విషయమై మోకా సర్వే నిర్వహించడం జరుగుతున్నదని, అక్కడ సర్వే పూర్తయిన తర్వాత ఏప్రిల్ 15 నుండి పొగిళ్లలో భూముల సర్వే తో పాటు, మోక సర్వే నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులు సర్వేకు సహకరించాలని, ప్రస్తుతం ఉన్న పట్టాలు, రికార్డుల ఆధారంగా సర్వే నిర్వహించి, మోకాపై ఉన్న రైతుల జాబితానునోటీస్ బోర్డులో ప్రదర్శించి అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం, వాటిని పరిష్కరించి, భూ భారతి ద్వారా అర్హులైన రైతులకు పట్టాలు ఇవ్వనున్నట్లు చెప్పారు.

## మందులు వాడి క్షయ వ్యాధిని నివారించవచ్చు



**కమలాపూర్ మార్చి 24(నినాదం)** ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కమలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. మనం క్షయను అంతం చేయగలము నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ క్షయ వ్యాధిని క్రమం తప్పకుండా మందులు వాడితే పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా పరీక్షలు, మందులు, నిక్షయ్ పోషణ్ యోజన ద్వారా రోగులకు పౌష్టికాహారం కోసం ఆర్థిక సాయం కూడా అందజేస్తున్నట్లు వివరించారు.రెండు వారాలకు మించి దగ్గు ఉంటే వెంటనే పరీక్ష చేయించుకోవాలని సూచించారు.క్షయ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకూడదని, వారిని ఆదరించాలని కోరారు. మందులు వాడే విధానం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ మాధవి, డాక్టర్ మానస, హెచ్ ఈ ఓ రవీందర్, హెల్త్ సూపర్ వైజర్లు వెంకటరమణారెడ్డి, అమృత, స్టాఫ్ నర్సులు ప్రమీల, సుమేరా, సరిత, టీబీ నోడల్ పర్సన్ ప్రభాకర్, హెల్త్ అసిస్టెంట్లు గోవర్ధన్, బాబు, రాము, రవీందర్, ఆశా కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్ విబిజి రాంజీ బిల్లులను రద్దు చేయాలి




**కమలాపూర్ మార్చి 24 (నినాదం) :** కార్మికులను యజమానులకు కట్టుబానిసల్లాగా మార్చే నాలుగు లేబర్ కోడ్ లను, ఉపాధి కూలీలకు పొట్టను కొట్టే వి బి జి రాంజీ బిల్లును ,ఈ పార్లమెంట్ సమావేశాలలో రద్దు చేయాలని ఆల్ హామాలి వర్కర్స్ యూనియన్, మండల అధ్యక్షులు దాసరి రవీందర్ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు మండల అధ్యక్షులు శనిగరపు పురుషోత్తం లు డిమాండ్ చేశారు. మంగళవారం సి ఐ టి యు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక ఏండ్లుగా కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లు తీసుకురావడంతో. కార్మికుల హక్కులు మొత్తం కాలరాయపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పని లేని సమయంలో గ్రామీణ ప్రాంతంలో ఉపాధి కూలీలకు ఉపాధిగా ఉండే గ్రామీణ ఉపాధి అని చట్టాన్ని రద్దుచేసి వ్యవసాయ కూలీల పొట్టన కొట్టారనిఅన్నారు. అందుకే ఈ బిల్లులను తక్షణమే రద్దు చేయాలని, విద్య సంస్కరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో సి ఐ టి యు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## ఆస్తి పన్ను బకాయిపై మునిసిపల్ కమిషనర్ సమీక్ష



**అమరచింత, మార్చి 24, (నినాదం):** ఆత్మకూర్ మునిసిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను బకాయిల వసూళ్లపై మునిసిపల్ కమిషనర్ చికినే శశిధర్ తన కార్యాలయంలో మంగళవారం సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, తెలంగాణ మున్సిపాలిటీ ఆక్ట్ 2019 ప్రకారం ఆస్తి పన్ను ప్రతి సంవత్సరం జూన్ 30 (మొదటి అర్ధభాగం), డిసెంబర్ 31 (రెండవ అర్ధభాగం) లోపు చెల్లించాల్సి ఉంటుంది. గడువు దాటిన పక్షంలో బకాయి మొత్తంపై నెలకు 2% చక్రవడ్డీ విధించబడుతుందని తెలిపారు.పన్ను చెల్లించని వారికి డిమాండ్ నోటీసులు జారీ చేయబడతాయని, నోటీసు అందిన 15 రోజుల్లోపు బకాయిలు చెల్లించకపోతే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. చట్టంలోని సెక్షన్ 91, 94 ప్రకారం, పదేపదే నోటీసులు ఇచ్చినప్పటికీ స్పందించని ఆస్తి యజమానులపై నీటి కనెక్షన్ నిలిపివేతతో పాటు మునిసిపాలిటీ అందించే ఇతర పౌర సేవలను కూడా నిలిపివేయవచ్చని పేర్కొన్నారు. అందువల్ల, పట్టణ ప్రజలందరూ తమ ఆస్తి పన్నులను తక్షణమే చెల్లించి మునిసిపాలిటీకి సహకరించాలని కమిషనర్ కోరారు.

# కంటిచూపును నిరంతరం పరిక్షించుకోవాలి





**-ప్రతి డ్రైవర్ తన భద్రతను దృష్టిలో ఉంచుకోవాలి**

**జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** వాహన డ్రైవర్లు నిరంతరం కంటిచూపును పరీక్షించుకోవాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు. అరీవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా ఆటో, లారీ, టిప్పర్ డ్రైవర్ల కోసం నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరాన్ని హన్మకొండకు చెందిన శరత్ ఐ కేర్ హాస్పిటల్ సహకారంతో సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, డ్రైవర్ల కంటి ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, వారి ప్రాణ భద్రతను కాపాడడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. డ్రైవర్లు తమ కంటి చూపును నిరంతరం పరీక్షించించుకుని అవసరమైన చికిత్స పొందాలని సూచించారు. ఇటీవలి కాలంలో రోడ్డు ప్రమాదాలు అధికమవుతున్న నేపథ్యంలో డ్రైవర్లు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించరాదని, మద్యం సేవించి వాహనం నడపరాదని, ఓవర్‌టేకింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ వంటి ప్రమాదకర అలవాట్లను నివారించాలని సూచించారు. అలాగే హెల్మెట్ లేకుండా ప్రయాణించడం ప్రమాదకరమని హెచ్చరించారు. కంటిచూపు సరిగా లేకపోవడం కూడా ప్రమాదాలకు కారణమవుతుందని, రోడ్డు పై సూచనలు స్పష్టంగా కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి డ్రైవర్ తన భద్రతతో పాటు తన కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేశారు. సుమారు 300 మందికి పైగా ఆటో, లారీ డ్రైవర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీ సంపత్ రావు, సీఐ నరేష్ కుమార్, ఎస్సై సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## వేతనాల పెంపు కోసం బీడీ యాజమాన్యానికి డిమాండ్ నోటీసు



**అమరచింత, మార్చి 24, (నినాదం):** 1000 బీడీలకు 350 రూపా యలకి ఇవ్వాలని జిల్లా బీడీ కార్మిక సంఘం (బి అర్ టీ యు) జిల్లా అధ్యక్షులు అబ్ర హం బీడి యాజమాన్యా లను డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మహబూబ్ నగర్ జిల్లా చిన్నచితకుంట మండలంలో బీడీ యాజమాన్యాలకు వేతనాల పెంపు కోసం డిమాండ్ నోటీసు అందజేశారు. బీడీ కార్మికులకు గతంలో చేసుకున్న వేతన ఒప్పందం ఈ సంవత్సరం మార్చుతూ ముగిసినందున వెంటనే కొత్త వేతన ఒప్పందాన్ని చేసుకోవాలని యాజమాన్యాలతో చర్చించారు. సమస్య నాణ్యమైన ఆకు వంటి సమస్యల పైన ఆయన ఫ్యాక్టరీ యాజమాన్యాలు స్వర్ణ సుధాకర్ రెడ్డితో లేవనెత్తారు. ఈ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఫ్యాక్టరీ యాజమాన్యాలకు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పెద్ద బాలరాజు యోహాను యువ రాజు కోరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



**కమలాపూర్ మార్చి 24 (నినాదం):** హుజురాబాద్ కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్, ఆధ్వర్యంలో మంగళవారం కమలాపూర్ మండల కేంద్రంలోని నల్లకుంటలో పనిచేస్తున్న, వందమంది ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు మాట్లాడుతూ ఎండ వేడిమి నుండి ఉపశమనం పొందుటకు మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ మాట్ల జయరాజు, హుజరాబాద్ సోషల్ మీడియా కన్వీనర్ తులసి లక్షణామూర్తి,ఉపాది కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

## కల్లు విక్రయించేందుకు అనుమతినివ్వాలని సీఐకి వినతి



**అమరచింత, మార్చి 24, (నినాదం):** ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ అనుమతి గల దుకాణాలలో కల్లు విక్రయించుకునేందుకు అనుమతినివ్వాలని మంగళవారం ఎక్సైజ్ సీఐ యమునాధర్ రావును పట్టణ కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు అలవెందర్ గౌడ్ కమిటీ సభ్యులు కోరారు. పట్టణంలోని ప్రభుత్వ అనుమతి గల దుకాణాల్లో 2026 - 27 ఒక సంవత్సరం వరకు కనువిక్రయాలు జరుపుకునేందుకు కల్లుగీత పారిశ్రామిక సంఘం మెజారిటీ సభ్యులు తీర్మానం చేశామని తీర్మానం కాపీని సిఐ కి అందజేశారు. సందర్భంగా కల్లు గీతా పారిశ్రామిక కార్మిక సంఘం అధ్యక్షులు సీఐ తో మాట్లాడుతూ పట్టణంలో తమ సొసైటీకి ఎలాంటి సంబంధం లేకుండా అనిల్ కుమార్ గౌడ్ అనే వ్యక్తి కల్లు విక్రయాలు చేస్తున్నారని ఆరోపించారు. తనకు ఎవరు అనుమతి ఇవ్వకున్నా దౌర్జన్యంతో దుకాణంలో కల్లు విక్రయాలు జరుగుతున్నారని ప్రజలకు ఏమైనా హాని జరిగితే తమ సొసైటీ ఎలాంటి సంబంధం లేదని అన్నారు. ప్రభుత్వ అనుమతి ఉన్న తమ సొసైటీ మెజార్టీ సభ్యులు కల్లు విక్రయాలు జరుపుకు నేందుకు తీర్మానం చేశామని అధికారులు తమకు అనుమతి ఇవ్వాలని వినతి పత్రంలో కోరారు. వినతి పత్రం అందించిన వారిలో చందు గౌడ్, మధు గౌడ్ తో పాటు పలువురు ఉన్నారు

## సలాడ్స్ మిల్లెట్స్ వర్క్ షాప్



మహాదేవపూర్ మార్చి 24, (నినాదం): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం సూరారం జిల్లా పరిషత్ పాఠశాలలో నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో సలాడ్స్ మిల్లెట్స్ పై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈఓ పురుషోత్తం రెడ్డి విద్యార్థులు ఉపాధ్యాయులు తయారుచేసిన పోషక విలువలతో కూడిన సలాడ్లను స్వయంగా పరిశీలించి వారిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు ఇలాంటి పౌష్టికాహారం పై అవగాహన కల్పించడం అభినందనీయమని విద్యార్థులను ఉత్సాహపరుస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన గైడ్ టీచర్లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, మేరీ బాయ్, మధుకర్ రెడ్డి, రవీందర్, సతీష్, కవిత దేవి, మనోహర్ దేవి, పిడి కార్తీక్ తో పాటు పలువురు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కుట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన అడిషనల్ కలెక్టర్



**మహాదేవపూర్ మార్చి 24, (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని ఆదివాసి భవన్ లో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీ విజయలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె కుట్టు శిక్షణ లో పాల్గొంటున్న సభ్యులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ కోట రాజబాపు, గోవింద్, ఎంపీడీవో రవీంద్రనాథ్, ఏటీఎం రాజన్న తోపాటు సీసీలు పాల్గొన్నారు.

## గురుకుల నవోదయ ప్రవేశ ఫలితాల్లో లిటిల్ ఫ్లవర్ ప్రభంజనం

**అమరచింత, మార్చి 24, (నినాదం):** రాష్ట్రవ్యాప్తంగా గురుకుల నవోదయ సైనిక్ పాఠశాలలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఆత్మకూరు లిటిల్ ఫ్లవర్ కోచింగ్ సెంటర్ ప్రభంజనం సృష్టించినట్లు నిర్వాహకులు మీర్జా అన్వర్ బేక్ మీర్జా అక్బర్ మంగళవారం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన పరీక్ష ఫలితాలు మంగళవారం వేలు పడ్డాయని ఇందులో తమ సెంటర్కు చెందిన 11 మంది విద్యార్థులు రాష్ట్రంలోని వివిధ గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. రహమతుల్లా, మున్సిపల్ చైర్ పర్సన్ నాగమణి వైస్ చైర్మన్ నల్లగొండ శ్రీనివాసులు విద్యార్థులను అభినందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

## రూ.28,93000 పలికిన మరిపెడ అంగడి వేలం పాట



**డోర్నకల్ /మరిపెడ మార్చి 24(నినాదం):** మరిపెడ మున్సిపాలిటీ పట్టణ అంగడి ప్రతి ఆదివారం నిర్వహించే వారపు సంత వేలం పాట మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ విజయనంద్,మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. 2026-27 సంవత్సరానికి గాను నిర్వహించిన ఈ వేలంలో పలువురు పోటాపోటీగా పాల్గొన్నారు.చివరకు మరిపెడ గ్రామానికి చెందిన మహ్మద్ వసీం రూ.28 లక్షల 93,000/- రూలకు ఈ వేలం దక్కించుకున్నారు.ఈ వేలం కాలపరిమితి 2026 ఏప్రిల్ 1 నుంచి 2027 మార్చి 31 వరకు అమల్లో ఉంటుందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు జాటోతు సురేష్,మెరుగు రాము గంట్ల గౌతమ్ రెడ్డి,బోడ భాస్కర్,జియో రమేష్, సత్యవతి యుగంధర్,గంట్ల మహిపాల్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ తాజుద్దీన్,కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ ఖలీల్, అలువాల ఉపేందర్ ప్రజాపతి,గంధసిరి భిక్షపతి, షేక్ ఖాదర్,కుడితి నర్సింహా రెడ్డి, గుండగాని వెంకన్న, బాషిపంగు రవికాంత్, గంధసిరి కృష్ణమూర్తి, లచ్చిరాం, కరణ్ సింగ్ చెన్నూరు మహేష్,మాజీ కౌన్సలర్ బానోత్ కిషన్ నాయక్,పరశురాం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

**నల్లగొండ ప్రతినిధి మార్చి 24( నినాదం):** నల్లగొండ సబ్ డివిజన్ పరిధిలోని తిప్పర్తి పో లీస్ స్టేషన్ త్వరలోనే ప్రజలకు మ రింత చేరువవుతూ ఆధునిక సేవ లతో ముందుకెళ్ళాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు. మంగళవారం ఆయన తిప్పర్తి పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ నిర్వ హించి భవిష్యత్ కా ర్యాచర ణకు మార్గదర్శక సూచనలు చేశారు. ముఖ్యంగా రిసెప్షన్ మేనేజ్మెంట్, ఉమెన్ హెల్ప్ డెస్క్, రికార్డు విభాగం, లాక్ అప్, ఎస్‌హెచ్‌ఓ గది వంటి విభా గాలను పరిశీలించి, భవిష్యత్తులో ఇవి మరింత సాంకేతిక తో మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డయల్ 100 కాల్స్‌కు క్షణాల్లో స్పందించేలా సాంకేతిక అప్‌గ్రేడ్లు చేపట్టాలన్నారు. సంఘటన స్థలానికి వేగంగా చేరుకునే సామర్థ్యాన్ని పెంచే చర్యలు అమలు కానున్నాయన్నారు .గంజాయి, అక్రమ ఇసుక రవాణా, పిడిఎస్ బియ్యం దందా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై భవిష్యత్తులో కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## క్షయ రహిత జిల్లా కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



**నల్లగొండ ప్రతినిధి మార్చి 24 (నినాదం ):** క్షయ రహిత జిల్లా కోసం ప్రతి ఒక్కరు కృషి చేద్దామని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం చందం పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి అధ్యక్షతన క్షయ నివారణ దినోత్సవం జరుపుకున్నారు. జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ టీబీ ముక్త్ భారత్ అభియాన్ రెండవ దశ వందరోజుల కార్యక్రమం ను అయన ప్రారంభించాడు జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి గారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఉచిత మొబైల్ ఏ ఐ చెస్ట్ ఎక్స్ రే స్క్రీనింగ్ క్యాంప్స్ ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు డిప్యూటీ డిఎంహెచ్‌ఓలు డాక్టర్ రాహుల్, డాక్టర్ దీప వివిధ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ కృష్ణకుమారి డాక్టర్ రవి ప్రసాద్ సర్పంచ్ సాదిక్ ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నినాదం
నిఖార్సైన జర్నలిజం


# ధాన్యం నిల్వ చేసేందుకు గోదాముల్లో స్థలం సిద్ధం చేయాలి




### పెద్దపల్లిలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్

**పెద్దపల్లి రూరల్,మార్చి-24(నినాదం):**ధాన్యం నిల్వ చేసేందుకు గోదాములలో స్థలం సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి మండలంలో పర్యటించారు.పెద్దపల్లి మండలం లోని ప్రభుత్వ ఆయుర్వేద హోమియో యునాని వైద్య కళాశాల, రాఘవపూర్ లోని జి.ఎం.ఆర్.వేర్ హౌసింగ్ గోదాములను,శాంతి నగర్ లోని వేర్ హౌసింగ్ గోదాములను అదనపు కలెక్టర్ వేణు తో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా మాట్లాడుతూ, రాబోయే యాసంగి సీజన్ నందు ధాన్యం కొనుగోలు సమయంలో ఇబ్బందులు ఎదురోకుండా ముందస్తుగానే ఎస్.డబ్ల్యూ.ఎస్ పరిధిలో ఉన్న గోదాములలో ఖాళీ స్థలం ధాన్యం నిల్వ చేసుకు నేందుకు సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. గోదాములలో ఉన్న బియ్యం త్వరగా లిఫ్ట్ చేసి ధాన్యం నిల్వ చేసుకునేందుకు వీలుగా స్థలం కేటాయించాలని కలెక్టర్ ఆదేశించారు.ఆయుష్ ఆసుపత్రి నందు వస్తున్న రోగుల వివరాలు,అందుబాటులో ఉన్న మందులు వివరాలను కలెక్టర్ ఆరా తీశారు.ఆసుపత్రికి అవసరమైన మందుల స్టాక్ ఎప్పటికప్పుడు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఆయూ ష్ ఆసు పత్రి రికార్డులను పరిశీలించారు.రోగులకు మెరు గైన వైద్య చికిత్స అందించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట డిసిహెచ్ఎస్ డా.శ్రీధర్,డా.మారుతి ,డి.సిఎస్ ఓ శ్రీనాథ్,డి.ఎం సివిల్ సప్లై శ్రీకాంత్, అధికారులు, పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



**సుల్తానాబాద్ , మార్చి 24(నినాదం):**న్యాయవాదుల రక్షణ కోసం ఏర్పాటుచేసిన న్యా యవాదుల రక్షణ బిల్లును తెలంగాణ ప్రభుత్వ మంత్రి వర్గం ఆమోదించి అసెంబ్లీ లో బిల్ పాస్ చేయడం పట్ల సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల తిరుపతి రెడ్డిఆధ్వర్యంలో మం గళవారం న్యాయవాదులు స్థానిక కోర్టు ముందు రాష్ట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పా లాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంత రం స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నా రు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ గతంలో హైకోర్టు న్యాయవాద దంపతులు గట్టు నాగమ ణి వామన్రావు లను అతి దారుణంగా హ త్య చేయడం, ఇతర న్యాయవాదులపై దాడులు చేసి హత్య చేయడం వంటి సంఘటనలతో న్యా యవాదులకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిణామాలపై ఇటీవల పలు బార్ అసోసియేషన్ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి తమ సమస్యలను విన్నవిం చుకొని న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించి న్యాయ వాదుల రక్షణ చట్టం బిల్లును మంత్రి మండలి ఆ మోదించడం అసెంబ్లీ లో బిల్లు పాస్ చేయడం శుభ పరిణామమని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి వర్గ సహచ రులకు సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ న్యాయవాదుల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపా రు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధా న కార్యదర్శి బోయిని భూమయ్య, ఏజీపీ దూడం ఆంజనేయులు, న్యాయవాదులు ఆవుల లక్ష్మి రాజం, ఆలూరి శ్రీనివాసరావు, భూసారపు బా లకిషన్ ప్రసాద్, పడాల శ్రీరాములు, వోడ్నాల రవీందర్, అవునూరి సత్యనారాయణ, జోగుల రమేష్, కోడం అజయ్, పెగడ శ్యామ్ సుందర్, సామల రా జేంద్ర ప్రసాద్, ఆవుల శివకృష్ణ, చీకటి సంతోష్ కు మార్, అంబాల రాజు,వడ్లకొండ రవికిరణ్,మా దూరి పృథ్వీ, బొబ్బిలి శ్యాం,వేముల స్నేహ,రు ద్రారపు శ్యాం సుందర్ , మందల రమేష్, అడ్వకేట్ క్లర్క్ లు అశోక్, గండి శ్రీనివాస్, సందీప్ తదితరు లు పాల్గొన్నారు.

## కొండగట్టు అంజన్నకు మొక్కులు చెల్లించుకున్న మేయర్



**మంచిర్యాల, మార్చి 23 (నినాదం):** ప్రసిద్ధి పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయస్వామిని మంగళవారం మంచిర్యాల కార్పొరేషన్ మేయర్ మధుకర్ దర్శించుకొని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆరోగ్యాన్ని ఆ కాంక్షిస్తూ సీతారాంపల్లి గ్రామం హనుమాన్ దేవాలయం నుంచి కొండగట్టుకు చేపట్టిన పాదయాత్ర విజయవంతం అయిందని పేర్కొన్నారు.మంచిర్యాల శాసన సభ్యులు కొక్కి రాల ప్రేమ్ సాగర్ రావు గారు అనారోగ్యం నుండి త్వరగా కోలు కోవాలని 2029 లోనూ మళ్ళీ ఎమ్మెల్యే గా గెలుపొంది నియోజక వర్గ ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు.పాదయాత్ర లో మేయర్ తో పాటు స్థానిక గ్రామస్థులు,హనుమాన్ స్వాములు పాల్గొనడం జరిగింది.

## జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



**మంచిర్యాల, మార్చి 23 (నినాదం):** జిల్లా కేంద్రంలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని విగ్రహ సాధన కమిటీ సభ్యులు నరేష్, విజయ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ కుమార్ దీపక్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అట్టడుగు వర్గాలు అభివృద్ధి కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొంద్ర ఉదయ్ కిరణ్, మహేందర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు

## ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ సీనియర్ నేత వెంకటేష్..

### అభివృద్ధి దిశగా కీలక చర్చలు!



గోదావరిఖని మార్చి 25 (నినాదం): అంతర్గాం మండలం పొట్యాల గ్రామా నికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎదులాపురం నీరజ వెంకటేష్ మంగళవారం హైదరాబాద లోని అసెంబ్లీలో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ భేటీ సౌహార్దపూర్వక వాతావరణంలో కొనసాగింది.

## ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలి లేకపోతే సమ్మె తప్పదు

ఆర్టిజన్లకు ఏ.పీ.ఎస్.ఈ.బీ.సర్వీస్ రూల్స్ అమలు చేయాలి

పాలకుర్తి ఏ.ఈ పై చర్యలు తీసుకోవాలి

ఆర్టిజన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా జే.ఏ.సీ.చైర్మన్ తూళ్ల నాగరాజు




**పెద్దపల్లి రూరల్,మార్చి 24(నినాదం):**రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న 23,667మంది ఆర్టిజన్లకు ఏ.పీ.ఎస్.ఈ.బీ.సర్వీస్ రూల్స్ అమలు చేయటంతో పాటు, సమస్యలు పరిష్కరించాకపోతే సమ్మె తప్పదని ఆర్టిజన్స్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా జే.ఏ.సీ.చైర్మన్ తూళ్ల నాగరాజు అన్నా రు.మంగళవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆర్టిజన్ కార్మికు లను వెంటనే కన్వర్షన్ ఇవ్వాటంతో పాటు,ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ బోర్డు ఏ.పీ.ఎస్.ఈ.బీ. సర్వీసు రూల్స్‌ను అమలు చేయాల న్నారు.2016 కు ముందు అన్ని అర్హతలు ఉండి ఆర్టిజన్లుగా గుర్తించని వారందరినీ,అన్‌మ్యాన్డ్ కార్మికులను ఆర్టిజన్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు.విద్యుత్ సంస్థల్లో విద్యుత్ రీడర్లు,ఎస్.పీ.ఎం,పీ.ఏ.ఏ, గార్డెసర్,సెక్యూ రిటీ,ఏ. పీ.టీ.ఎస్, విజిలెన్స్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న వారం దరికీ జీవో నెంబర్11 ప్రకారం కనీస వేతన చట్టాన్ని అమలు చేస్తూ, ఈ.పీ.ఎ.ఫ్, ఈ.ఎస్.ఐ,సౌకర్యాలతో పాటు 30రోజుల పని విధానాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల ఈనెల 26,30 తేదీల్లో డివిజన్ కార్యాల యాల వద్ద ధర్నా, ఏప్రిల్ 2 న సర్కిల్ కార్యలయాల వంటా వార్పు నిర్వహించను న్నట్లు వెల్లడించారు.ఏప్రిల్ 7న ఛలో వరంగల్ పెరిటెన్సీ డిసిఎల్ కార్యాలయం వద్ద మహా ధర్నా చేపడు తామని,అప్పటికి స్పందన లేకపోతే ఏప్రిల్ 8 న ఉదయం 9 గంటల నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని స్పష్టం చేశా రు.అలాగే పాలకుర్తి మండలం బసంత్‌నగర్ పరిధిలో పనిచే స్తున్నా ఆర్టిజన్ కార్మికుడు గడ్డం జయదేవ్‌ను వేధిసూ న్నా,ఏ.ఈ మాభాల ప్రసాద్ పై విచారణ చేపట్టి చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు.గడ్డం జయదేవ్ ఒక్కడు కాద ని,అత ని వెంట రాష్ట్రంలో పనిచేస్తున్నా 23 వేల మంది ఆర్టిజ న్లు ఉన్నారన్నారు. తక్షణమే అతడి పై చర్యలు తీసుకో కపోతే ఏ.ఈ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో టీ.జీ.ఎన్.పీ. డీ.సీ.ఎల్,కంపెనీ ఆర్గ నైజింగ్ సెక్రెటెరిఎం.డి.ఖలీమోద్దీన్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షు లు ఎం. క్రిష్టారెడ్డి,జిల్లా కో కన్వీనర్ ఎం. ఎల్లయ్య పాల్గొన్నారు.

## పారదర్శకతే లక్ష్యం.. మీడియాతో ఎన్టీపీసీ ముఖాముఖి!

విద్యుత్ రంగంలో ఎన్టీపీసీ దూసుకెళ్తున్న వేగం ప్రెస్ మీట్‌లో వెల్లడి!





**గోదావరిఖని, మార్చి 24 (నినాదం):** ఎన్టిపిసి లిమిటెడ్ రామగుండం తెలంగాణ యూనిట్ ఆధ్వర్యంలో 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక ప్రెస్ మీట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం, గోదావరిఖని, జ్యోతినగర్, కరీంనగర్ ప్రాంతాలకు చెందిన ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముఖ్య అతిథి స్వాగతంతో ప్రారంభమైన కార్యక్రమం.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత ని అధికారులు మరియు సిబ్బంది ఘనంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా సీనియర్ అధికారులు ముకుల్ రాయ్ (జిఎం-ాడ ఎం తెలంగాణ), మనీష్ అగర్వాల్ (జిఎం ఎం రామ గుండం), అభిజిత్ దత్తా (జయం మెయింటెనెన్స్ ఢ రేడియం), బినోయ్ జోస్ (జిఎం ప్రాజెక్ట్స్) తదితరులు పాల్గొన్నారు. దీపప్రజ్వలనతో ప్రారంభం ఎన్టీపీసీ గీతంతో ఆహ్లాదకర వాతావరణం దీపప్రజ్వలన కార్యక్రమంతో ఈ సమావేశం ప్రారంభమైంది. అనంతరం ఎన్టీపీసీ గీతంతో కార్యక్రమం సాంప్రదాయబద్ధంగా కొనసాగింది. అధికారులు ఉద్యోగులు అతిథులను సత్కరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంస్థ విజయాలు భవిష్యత్ లక్ష్యాలు వివరించిన డైరెక్టర్,సభను ఉద్దేశించి మాట్లాడిన చందన్ కుమార్ సమంతా గారు, ఎన్టీపీసీ సంస్థ యొక్క ప్రస్తుత పనితీరు, సాధించిన విజయాలు మరియు రాబోయే ప్రణాళికలను వివరించారు. సుస్థిర అభివృద్ధి, విశ్వసనీయ విద్యుత్ ఉత్పత్తి, పారదర్శకత పట్ల ఎన్టీపీసీ కట్టుబాటును ఆయన స్పష్టం చేశారు. మీడియా పాత్ర ప్రజల విశ్వాసాన్ని పెంచడంలో కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. మీడి యాతో ప్రత్యక్ష చర్చ పారదర్శకతకు ప్రతీక,ఈ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు ప్రశ్నలు అడిగి, సంస్థ అధికారులతో చర్చలు జరిపారు. ఈ ఇంటరాక్టివ్ సెషన్ ఎన్టీపీసీ యొక్క ఓపెన్ కమ్యూనికేషన్ విధానాన్ని ప్రతిబింబించింది. ఎజీఎం హెచ్‌ఆర్ అనుభవాల పంచికఈ సందర్భంగా ఏటీఎం (హెచ్ ఆర్) బిజోయ్ కుమార్ సిక్దార్ తన అనుభవాలను, మీడి యా తో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఆయన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. కృతజ్ఞతలతో ముగిసిన కార్యక్రమం, చివరగా కృతజ్ఞతలతో కార్యక్రమం ముగిసింది. మీడియా ప్రతినిధులకు బహుమతులు అందజేసి, భోజన ఏర్పాట్లు చేశారు.

## అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో బిఆర్ఎస్ నాయకుల అరెస్టు




**పెద్దపల్లి రూలర్ మార్చి 24(నినాదం) :** బి.ఆర్.ఎస్వీ,ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం ఉండగా తెల్లవారుజామున బి.ఆర్.ఎస్ పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్ ను,బి.ఆర్.పెద్దపల్లి మండల యూత్ అధ్యక్షులు కొయ్య విక్రమ్ ను, చొప్పరి వంశీలను పోలీసులు అక్రమ అరెస్ట్ చేశారు.ఈ సందర్భంగా ఉప్పు రాజ్ కుమార్ మాట్లాడుతూ,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి రాకముందు విద్యార్థులు, నిరుద్యోగులకు అనేక హామీలు ఇచ్చిందని, అయితే ఇప్పటికీ వాటి అమలులో నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందని విమర్శించారు. ముఖ్యంగా విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించకపోవడం వల్ల వేలాది మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.అలాగే నిరుద్యోగ భృతి, విద్యా భరోసా కార్డు,విద్యార్థినిలకు స్కూటీలు వంటి హామీలు ఇంకా అమలుకాలేదని,ప్రభుత్వం మాట తప్పిందని ఆరోపించారు.6 గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు అమలు అయ్యే వరకు బి.ఆర్.ఎస్ పార్టీ చేస్తున్న పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఇందులో భాగంగా ఉప్పు రాజ్ కుమార్ ప్రభుత్వంపై కొన్ని ప్రశ్నలు వేశారు.విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే చెల్లిస్తామని చెప్పి ఎందుకు ఆలస్యం చేస్తున్నారు నిరుద్యోగ భృతి ఎప్పటినుండి అమలు చేస్తారు యువతను ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు.విద్యా భరోసా కార్డు హామీ ఎక్కడ అమలైంది. విద్యార్థినిలకు స్కూటీలు ఇస్తామని చెప్పిన హామీ ఎందుకు నిలబెట్టుకోలేదు?6 గ్యారంటీలకు చట్టబద్ధత ఎప్పుడు కల్పిస్తారు. అక్రమ అరెస్టుల ద్వారా ప్రజా సమస్యలను ఎప్పటి వరకు అణచివేస్తారు?ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని,అక్రమ అరెస్టులను నిలిపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

## 100 శాతం వార్షిక ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేలా సమిష్టిగా కృషి చేయాలి

### జీఎం శ్రీనివాస్



**మంచిర్యాల, మార్చి 23(నినాదం):** ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేప థ్యంలో 100 శాతం వార్షిక ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేలా సమిష్టిగా కృషి చేయాలని శ్రీరాంపూర్ జీఎం ముని గంటి శ్రీనివాస్ సూచించారు. మంగళ వారం శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని ఆర్కె 5 గని అధికారులతో కలిసి భూ గర్భ గనిలో పని ప్రదేశాలు ఉత్పత్తి తీరు పరిశీలించారు. గనిలోని 5వ సీమ్ డెవలప్మెంట్ డిస్ట్రిక్ట్‌ను స్వయంగా పరిశీలించి రక్షణతో కూడిన నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి సాధన కోసం అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో గని నిర్వహణ, రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యాల సాధన, భద్రతా ప్రమాణాలపై గని అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎత్తు తక్కువ సీమ్ లు అయినప్పటికీ ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే 95 శాతం ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడం అభినందనీయం అన్నారు. మిగిలిన కొద్ది రోజుల్లో నూటికి నూరు శాతం వార్షిక ఉత్పత్తి సాధన దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ ఎన్. శ్రీధర్, గ్రూప్ ఇంజనీర్ భట్టాచార్య, మేనేజర్ సుధీర్ కుమార్ ఝా, రక్షణ అధికారి శివయ్య, ఇంజనీర్ శ్రీ శ్యామ్ కుమా ర్, సర్వేయర్ శ్రీ ఏ. సంపత్ తో పాటు పలువురు మైనింగ్ స్టాఫ్, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# నిర్మల్ క్రీడా పాఠశాల్లో 4వ తరగతి ప్రవేశాలకు ఎంపికలు

### మార్చి 28న జిల్లా స్థాయి పోటీలు

**నిర్మల్ ప్రతినిధి, మార్చి 24 (నినాదం):**తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలల్లో 2026-2027 విద్యా సంవత్సరానికి గాను 4వ తరగతిలో ప్రవేశాల కోసం జిల్లా యువజన క్రీడల శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. జిల్లా యువజన మరియు క్రీడల అధికారి బి. శ్రీకాంత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, ఇప్పటికే మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన బాలబాలికలకు ఈ నెల 28వ తేదీన నిర్మల్‌లోని ఎన్.టి.ఆర్ మినీ స్టేడియంలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ ప్రవేశాలకు అర్హత సాధించాలంటే విద్యార్థులు 01-09-2017 నుండి 31-08-2018 మధ్య జన్మించి ఉండాలి. జిల్లా స్థాయి ఎంపికల్లో భాగంగా ఎత్తు, బరువు, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్ రన్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, షటిల్ రన్ వంటి మొత్తం తొమ్మిది రకాల మోటార్ క్వాలిటీ టెస్టులు నిర్వహిస్తారు. జిల్లా స్థాయి పోటీల్లో కనీసం 10 పాయింట్లు సాధించిన విద్యార్థులు మాత్రమే ఏప్రిల్ 27 నుండి మే 1 వరకు జరిగే రాష్ట్ర స్థాయి ఎంపికలకు అర్హత పొందుతారు. ఎంపికలకు హాజరయ్యే వారు ఆధార్ కార్డు (మూల ప్రతి), ప్రస్తుత పాఠశాల బోనఫైడ్ సర్టిఫికేట్, జనన ధృవీకరణ పత్రం, 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్, కమ్యూనిటీ సర్టిఫికేట్ , 5 పాస్‌పోర్ట్ సైజు ఫోటోలను వెంట తీసుకురావాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ ద్వారా పేరు నమోదు చేసుకొని మండల స్థాయిలో పాల్గొన్న వారు మాత్రమే ఈ జిల్లా స్థాయి పోటీలకు అర్హులని అధికారులు స్పష్టం చేశారు. తుది ఎంపికైన వారికి మే 13, 14 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించి, జూన్ 12, 13 తేదీల్లో పాఠశాలల్లో రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని ప్రెస్ నోట్ ద్వారా తెలిపారు

## గోదావరిఖని శ్రీ కోదండ రామాలయంలో స్కంద షష్ఠి వేడుకలు ఘనంగా నిర్వహణ!!

అర్చకులు రాము అయ్యగారి ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యస్వామి ప్రత్యేక పూజలు

భక్తులతో కిటకిటలాడిన ఆలయం



**గోదావరిఖని, మార్చి 24(నినాదం):** గోదావరిఖని పట్టణంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్ర మైన శ్రీ కోదండ రామాలయ ప్రాంగణంలో వెలసిన శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి స్కంద షష్టి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళ వారం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. చైత్ర మాసం, మంగళవారం, షష్టి తిథి అరుదైన యోగం కలిసివచ్చిన సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి స్వామివా రిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

**అభిషేకాలు, అలంకరణలతో ఆధ్యాత్మిక వాతావరణం**

ఉదయం నుంచే ఆలయ అర్చకులు రాము అయ్యగారి ఆధ్వర్యంలో స్వామివారికి పవిత్ర జలాలు, పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీరు, పంచామృతాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పుష్పాలు, పండ్లు, సువాసన ద్రవ్యాలతో సుబ్రహ్మణ్యస్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. భక్తులు తమ కోరికలు నెరవేరాలని మొక్కులు చెల్లించుకుంటూ కుజదోష నివారణ పూజలు, అభిషేకలు ప్రార్థనలు చేశారు.

**భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం**

స్కంద షష్ఠి సందర్భంగా గోదావరిఖని పట్ట ణం నలుమూలల నుంచే కాకుండా సమీప గ్రామాల నుండి కూడా భక్తులు పెద్ద సం ఖ్యలో తరలివచ్చారు. మహిళలు, యువతకు టుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకు న్నారు. స్కంద షష్ఠి పూజల విశేష ఫలం గురించి అర్చకులు మాట్లాడుతూ "మంగళవారం రోజున షష్ఠి తిథి కలిసి వచ్చిన రోజు సుబ్రహ్మణ్యస్వామికి ఎంతో ఇష్టమైన రోజు ఈ రోజు భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే కుజదోషాలు తొలగి, వివాహ యోగం కలుగుతుందని, సంతాన ప్రాప్తి, కార్యసిద్ధి, ఆరోగ్యం లభిస్తాయని శాస్త్రాల్లో పేర్కొనబడింది" అని అన్నారు.పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

## సాయి మనోడు.. మంచోడు..

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాడు.. 6వవార్డు కౌన్సిలర్ భాకం సాయి కిరణ్



**సుల్తానాబాద్, మార్చి 24(నినాదం):** సాయి మనోడు మంచోడు.. ఇచ్చిన మాట నిల బెట్టు కున్నాడు. సుల్తానాబాద్ మున్సిపల్ కేంద్రం లోని ఆరో వార్డు కౌన్సిలర్ భాకం సాయికిరణ్ తాను ఇచ్చిన మాట నిలబెట్టుకొని సొంత ఖర్చు లతో ఆరో వార్డులోని ప్రాథమిక పాఠశాలలో అం దమైన ఆర్ట్స్, బొమ్మ లు వేయించి పాఠశాలకు కొత్త అందాన్ని తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆరో వార్డు ప్రజలు, విద్యార్థులు, పిల్లల భవిష్యత్తు కోసం పనిచేసిన మనసున్న మహారాజుని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.



## సంఘ భవనానికి స్థలం కేటాయించాలని వినతి



**నిర్మల్ ప్రతినిధి, మార్చి 24(నినాదం):** నిర్మల్ జిల్లా కేంద్రంలో మాదిగ ఉద్యోగుల సమైక్య భవనానికి స్థలం కేటాయించాలని కోరుతూ నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కూచాడి శ్రీహరి రావుకు డీసిసి ప్రధాన కార్యదర్శి గాజుల రవి కుమార్ నేతృత్వంలో మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల సమావేశానికి సంఘ భవనం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నమని పేర్కొన్నారు. ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి స్థలాన్ని కేటాయించేలా చూస్తానని వారికి హామీ ఇచ్చారు. ఇందులో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు లింగన్న, లక్ష్మణ్, కోశాధికారి ముత్యం, భీమయ్య, రాజేశ్వర్, తదితరులున్నారు.

# విలువ లేని చోట ఉండలేను..!

## రాజీనామాకు కట్టుబడి ఉన్నా
## పిసిసితో మాజీ మంత్రి జీవన్ రెడ్డి



**జగిత్యాల ప్రతినిధి, మార్చి 24 (నినాదం) :** రెండు సంవత్సరాలు మానసిక వేదన అనుభవించాను. సొంత పార్టీలో కొట్లాడుకుంటూ ఉండలేనని గౌరవం లేని చోట ఉండడం కంటే తప్పుకోవడమే ఉత్తమని నిర్ణయించుకొని రాజీనామాకు సిద్ధపడ్డానని పిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్ తో జీవన్ రెడ్డి తేల్చి చెప్పారు. మంగళవారం మాజీ మంత్రి జీవన్ రెడ్డి రాజీనామా నేపథ్యంలో పిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్ జగిత్యాల జీవన్ రెడ్డి నివాసంలో అరగంట సేపు సమావేశమయ్యారు. పార్టీలో జీవన్ రెడ్డికి అన్యాయం జరిగిన మాట వాస్తవమేనని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగే విధంగా చేస్తామని సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీని కాపాడుకుంటూ వచ్చానని ఒక పిరాయింపు ఎమ్మెల్యేకు ఇచ్చిన ప్రాధాన్యత రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో తనకు దక్కలేదని జీవన్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. గడిచిన మున్సిపల్ ఎన్నికల్లో ఫిరాయింపు ఎమ్మెల్యేకు బీఫార్మ్‌లిచ్చి తను అవమానపరిచారని ఇంత కన్నా దురదృష్టకరమ్ ఇంకేం ఉంటుందని జీవన్ రెడ్డి పిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్ తో ఆవేదన వ్యక్తం చేశారు. నిబద్ధతగల నాయకునిగా కాంగ్రెస్ పార్టీ లైన్లో పనిచేశానని కార్యకర్తల నిర్ణయం మేరకు రాజీనామా చేయక తప్పదు అన్నారు. రెండు సంవత్సరాల క్రితం అప్పటి కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి దేవదాసు మునిసి ఆధ్వర్యం లో కూడా హామీ ఇచ్చి ఇప్పటివరకు న్యాయం జరగలేదని ఇకపై న్యాయం జరుగుతుందని గ్యారెంటీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు.. అనేక అవమానాల గురిచేసి రాజీనామా ప్రకటించిన తర్వాత మోచేయి బతిమిలాటలు ఎందుకని అన్నారు దీంతో పిసిసి మహేష్ గౌడ్ జీవన్ రెడ్డి ఇంటి నుంచి వెళ్లిపోయారు. మధ్యాహ్నం 3:30 కు ఏఐసీసీ సభ్యులు వంశీచందర్ రెడ్డి జీవన్ రెడ్డిని కలిశారు ఈ సందర్భంగా వంశీచందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో జీవన్ రెడ్డి లాంటి నాయకుడు ఉండటం అరుదు అన్నారు. జీవన్ రెడ్డి అభిమానిగా రాజకీయాల కచ్చితంగా కేవలం కలవడం కోసమే వచ్చానని స్పష్టం చేశారు. జీవన్ రెడ్డి లాంటి నిబద్ధతగల నాయకుల వద్ద చాలా ఉందని ఎమ్మెల్యేగా జీవన్ రెడ్డితో కలిసి పనిచేసిన అదృష్టం నాకు దొరికింది అన్నారు. జీవన్ రెడ్డి తన కుటుంబ సభ్యులను పట్టించుకోలేదని సంపాదన మీద దృష్టి సారించలేదని కేవలం నిరుపేదలు రైతులు బడుగు బలహీన వర్గాల కోసం ఆయన జీవితాన్ని దారప్పుశారని అన్నారు. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని విడకూడదని బలంగా కోరుకునే వ్యక్తిలో నేనొక్కడినని నేను నేరుగా జీవన్ రెడ్డి కి చెప్పలేనని మీడియా ద్వారా జీవన్ రెడ్డి కాంగ్రెస్ లోనే ఉండాలని కోరుకుంటున్నాను అన్నారు. కానీ జీవన్ రెడ్డి కార్యకర్తలు అభిమానుల నిర్ణయం మేరకు రాజీనామా ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు




# వంద శాతం పన్నులు వసూలు అయ్యేలా అధికారులు కృషి చేయాలి

## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కిమ్యా నాయక్

**అమరచింత, మార్చి 24, (నినాదం):** మున్సిపాలిటీల పరిధిలో వంద శాతం పన్నుల వసూళ్లు చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కిమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు.మంగళవారం అదనపు కలెక్టర్ ఆత్మకూరు మున్సిపాలిటీని సందర్శించి పన్నుల వసూళ్ల తీరును పరిశీలించారు.మున్సిపాలిటీల పరిధిలో 100 శాతం పన్నుల వసూళ్లను సాధించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు ఆదేశించారు. ముఖ్యంగా ప్రాపర్టీ ట్యాక్స్, వాటర్ ట్యాక్స్ ట్రేడ్ లైసెన్స్ వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి పన్నులు చెల్లించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. మార్చి నెల ముగిసేలోపు ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్లు 100% పూర్తి చేయాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చీకినే శశిధర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఆత్మకూరు మండలంలోని తిప్పుడంపల్లి గ్రామపంచాయతీని అదనపు కలెక్టర్ సందర్శించారు.డ్రైనేజ్ వ్యవస్థ, సీసీ రోడ్లకు సంబందించి జరుగుతున్న పనులు, నర్సరీని పరిశీలించారు. అలాగే గ్రామంలో



డ్రైనేజ్ సీసీ రోడ్లు శుభ్రంగా, సమర్థంగా నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, పంచాయతీ అధికారులు, మున్సిపల్ సిబ్బంది కూడా పాల్గొన్నారు.

# నీటి పొదుపు మానవాళి మనుగడకు మలుపు

## కలెక్టర్ కె. హరిత

**కాగజ్‌నగర్, మార్చి 24 (నినాదం) :** నీటిని భూమిలోకి ఇంకించి కరువును జయిస్తేనే మానవాళికి మనుగడ సాధ్యం అని జిల్లా కలెక్టర్ హరిత స్పష్టం చేశారు మంగళవారం కాగజ్ నగర్ మండలంలోని జంబుగా గ్రామంలో భూగర్భ జల శాఖ మరియు సమృద్ధి సొసైటీ సంయుక్తంగా నిర్వహించిన ప్రపంచ నీటి దినోత్సవం 2026 వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రైతు వేదిక సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ జల సంరక్షణ ప్రపంచంలోని అనేక దేశాలు సముద్రపు ఉప్పు నీటిని వేల కోట్లు ఖర్చు చేసి శుద్ధి చేసుకుని వాడుకుంటున్నాయని కానీ మనకు ప్రకృతి సిద్ధంగా లభించే స్వచ్ఛమైన భూగర్భ జలాలను నిర్లక్ష్యం చేస్తున్నామని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. క్షీణిస్తున్న భూగర్భ జలాలు ప్రతి ఏటా సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతున్నా నీటిని నిల్వ చేసే ప్రయత్నాలు చేయకపోవడం వల్ల భూగర్భ నీటి మట్టాలు పడిపోతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. దీనివల్ల సాగు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రజావాణిలో వచ్చే దరఖాస్తుల్లో మెజారిటీ కొత్త బోర్లు, చేతి పంపుల కోసమే ఉంటున్నాయని గుర్తుచేశారు. వాగులపై చెక్ డ్యామ్‌లు నీటి కుంటల నిర్మాణం చేపట్టాలి. ప్రతి ఇంటి వద్ద, బోర్ల సమీపంలో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి. వర్షపు



నీటిని భూమిలోకి పంపడం ద్వారానే భవిష్యత్తు తరాలకు జల భద్రత లభిస్తుందని తెలిపారు. గతంలో నీటి కోసం మహిళలు కిలోమీటర్ల కొద్దీ నడిచేవారని నేడు ప్రభుత్వం ప్రతి ఇంటికి మిషన్ భగీరథ ద్వారా శుద్ధ జలాన్ని అందిస్తోందని ఆ నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం జల సంరక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రైతులను కలెక్టర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా భూగర్భ నీటి వనరుల శాఖాధికారి, వ్యవసాయ శాఖ అధికారి వెంకటట్, ఉద్యానవన శాఖ అధికారి నదీమ్, మిషన్ భగీరథ ఈఈ, ఫిషరీస్ ఏడీ సాంబశివరావు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# తట్టెడు మట్టి తీయకుండా పడావు పెట్టిన ఘనత కాంగ్రెస్ దే

## ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా
## పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు
## గుడిపల్లి రిజర్వాయర్‌ను సందర్శించిన
## మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి





**వనపర్తి ప్రతినిధి, మార్చి 24 (నినాదం) :** ఉమ్మడి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టామని, 90 శాతం పూర్తి అయిన ప్రాజెక్టును తట్టెడు మట్టి తీయకుండా పడావు పెట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీ దేనని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పరిధిలోని గుడిపల్లి రిజర్వాయర్ ను ఆయన మంగళవారం రైతులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ఆయకట్టుకు సాగునీటితో జలకళ వచ్చిందని, తెలంగాణ ఉద్యమం తర్వాతనే సాగునీటి ప్రాజెక్టులకు మోక్షం లభించిందని ఆయన అన్నారు. కల్వకుర్తి పరిధిలో పంటలకు మరో నలభై ఐదు రోజులు నీళ్లు ఇవ్వాల్సి ఉంటుందని, శ్రీశైలం నీటిని చుక్క చుక్క సద్వినియోగం చేసుకోవాలని, అన్ని ప్రాంతాలకు సమానంగా నీళ్ళు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కల్వకుర్తి మోటర్ లతో 240 రోజులపాటు నీటిని పంపింగ్ చేయొచ్చని, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ ను అదే లెవెల్ లో చేపట్టినమని, శ్రీశైలంలో బురద వచ్చే వరకు నీటిని తోడే అవకాశం ఉంటుందని అన్నారు. డెడ్ స్టోరేజ్ వరకు నీటిని పంపింగ్ చేయవచ్చని, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ జూరాల వద్ద చేపడితే నీటిని పంపింగ్ చేయలేమని, శ్రీశైలం నుండి నలభై ఐదు రోజుల్లో తొంబై టీ ఎం సి లు నీటిని ఎత్తిపోయచ్చని అన్నారు. నీళ్ళు లేని చోట పాలమూరు సోర్స్ పెట్టమని అంటారని, నీళ్ళు వున్న శ్రీశైలం ను ఆంధ్రాకు ధార దత్తం చేయడానికి అలా మాట్లాడుతారని ఆయన దుయ్యబట్టారు. కల్వకుర్తి పంపింగ్ ఇవాల్టికి కొనసాగుతుందని, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ నుండి కూడా మార్చి ఆఖరువరకు పంపింగ్ చేయొచ్చని ఆయన గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ అసంపూర్తిగా ఉన్న కె.ఎల్. ఐ ప్రాజెక్ట్ పథకానికి రూ.3వేల కోట్లు ఖర్చుపెట్టి ఎలక్ట్రో మెకానికల్ వర్క్స్, టన్నెల్, కాల్వలు, పవర్ లైన్స్, సర్జుపుల్ పంపు హౌజులు,మోటార్స్ పూర్తి చేసి 4లక్షల ఎకరాలకు సాగు నీళ్లు కాల్వల ద్వారా, భూగర్భ జలాల ద్వారా మరో లక్ష ఎకరాలకు మొత్తం 5లక్షల ఎకరాలకు సాగు నీళ్లు అందించారని అన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో మిగిలిన 35లక్షల ఎకరాలకు సాగు నీళ్లు అందించి రైతులను రాజులను చేయాలన్న సంకల్పంతో కెసిఆర్ నీటి లభ్యత ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు దగ్గర పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారని నిరంజన్ రెడ్డి అన్నారు. 27 వేల ఎకరాల భూసేకరణ జరిపి రూ.32 వేలకోట్ల ఖర్చు చేసి రూ.27వేల కోట్ల బిల్లులు చెల్లించి నిర్మాణం చేపట్టడం జరిగిందని అన్నారు. కేవలం రూ.1000 కోట్లు ఖర్చు చేసి 10శాతం పనులు పూర్తి చేయకుండా కాంగ్రెస్ నిర్లక్ష్యం చేస్తుందని ఆయన విమర్శించారు. పాలమూరు బిడ్డగా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పడావు పెట్టడమే కాకుండా రేవంత్ దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. నీటి లభ్యత లేని జూరాల దగ్గర పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం చేయాలని చెప్పడం రైతులను మోసం చేయడం కోసమేనని నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. నిరంజన్ రెడ్డి వెంట బీఆర్ఎస్ నాయకులు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, భీమయ్య, సురేందర్ రెడ్డి, శివరామ్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రఘుపతి రెడ్డి, వనం రాములు, పృథ్వీ రాజ్, బి.బాలరాజు, వేణు యాదవ్, తిరుపతయ్య, మాణిక్యం, ధర్మా నాయక్, మురళీ సాగర్, ప్రేమ్ నాథ్ రెడ్డి, సూర్యవంశం గిరి, ఇమ్రాన్, హేమంత్ ముదిరాజ్, స్వాతి హరిబాబు, బాబు నాయక్ తదితరులు ఉన్నారు.

# మొయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసు

## పోలీసు కస్టడీకి పైలెట్ రోహిత్ రెడ్డి

**రాజేంద్రనగర్ మార్చి 24( నినాదం):** మొయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసు విచారణలో భాగంగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితులుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మలను పోలీసులు శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ కు మంగళవారం తరలించారు. ఈ కేసులో నిందితులను విచారించేందుకు పోలీసులకు అనుమతినివ్వాలని రాజేంద్రనగర్ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, నిన్న కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. నిందితులు ముగ్గురిని మూడు రోజుల పాటు పోలీసు కస్టడీకి అప్పగిస్తూ న్యాయస్థానం అనుమతినిచ్చింది. ఈ నేపథ్యంలో, నేటి నుండి వారిని పోలీసులు లోతుగా విచారించనున్నారు. రంగంలోకి షాద్ నగర్ డీసీపీ నిందితులను శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చిన క్రమంలో, షాద్ నగర్ డీసీపీ శిరీషా స్వయంగా అక్కడికి చేరుకున్నారు. డీసీపీ పర్యవేక్షణలో విచారణ ప్రక్రియ కొనసాగనుంది. ఈ డ్రగ్స్ రాకెట్‌తో



ఎవరికి సంబంధాలు ఉన్నాయి? ఎక్కడి నుండి డ్రగ్స్ సరఫరా అయ్యాయి? అనే కోణంలో పోలీసులు వీరిని ప్రశ్నించనున్నట్లు తెలుస్తోంది.

N NADAM CINEMA




# అట్లీ-అల్లు అర్జున్ కాంబోపై భారీ అంచనాలు

## సోషల్ మీడియాలో లయన్ పోస్టర్‌పై ఆసక్తి

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరియు మాస్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'ఎఎ22'పై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమా సౌత్‌తో పాటు నార్త్ ఇండియాలోనూ భారీ హైప్‌ను క్రియేట్ చేసింది. అయితే ఇప్పటివరకు ఈ చిత్రానికి సంబంధించిన ఎలాంటి అధికారిక ప్రమోషనల్ కంటెంట్ విడుదల చేయకుండా మేకర్స్ గట్టి సీక్రసీని మెయింటైన్ చేస్తున్నారు. ఇటీవల అట్లీ తన సోషల్ మీడియాలో షేర్ చేసిన లయన్ పోస్టర్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆ పోస్టర్‌లో సింహం ముఖం రెండు వేర్వేరు భాగాలుగా కనిపించడం విశేషం. దీనితో సినిమాలో అల్లు అర్జున్ డ్యూయల్ రోల్‌లో కనిపించనున్నారా? లేక ఒక క్లిష్టమైన, మల్టీ-లేయర్డ్ క్యారెక్టర్‌లో నటిస్తున్నారా? అన్న సందేహాలు అభిమానుల్లో మొదలయ్యాయి. అట్లీ పోస్టర్‌కు జతచేసిన 'నీలా ఎవరూ ఉండలేరు, అదే నీ శక్తి' అనే క్యాప్షన్ మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇది హీరో పాత్రలో ఉన్న విభిన్న కోణాలను సూచిస్తోందని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ సుమారు రూ.600 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తోంది. ఈ స్థాయి వ్యయంతో రూపొందుతున్న ఈ సినిమా భారతీయ సినిమా చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలిచే అవకాశముంది.

## శ్రీలీల ట్రాక్ చూసేందుకు
# మహిళల ఆసక్తి
## ఉస్తాద్ భగస్ సింగ్‌పై హరీష్ శంకర్




పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కథానాయకుడిగా దర్శకుడు హరీశ్ శంకర్ తెరకెక్కించిన చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. తాజాగా దీని ప్రచారంలో భాగంగా హరీశ్ శంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సినిమాకు వస్తున్న స్పందనపై ఆయన మాట్లాడుతూ.. సెకండ్ హాఫ్‌లో వచ్చే శ్రీలీల ఎపిసోడ్ మహిళా ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోందని తెలిపారు. 'నిజం చెప్పాలంటే.. రెండో భాగంలో శ్రీలీల ట్రాక్ చూడటం కోసమే మహిళలు భారీగా థియే టర్లకు వస్తున్నారు. పవన్ కల్యాణ్‌ను రెండు గంటల పాటు అభిమానులు వారు కోరుకున్న విధంగా చూసుకోదగ్గ చిత్రమిది. కుటుంబ ప్రేక్షకులందరూ కలిసి ఆస్వాదించేలా ఉంది. నేను ఈ చిత్రం విషయంలో చాలా సంతోషంగా ఉన్నాను' అని అన్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ మూవీలో పవన్‌కు జోడీగా శ్రీలీల, రాశీఖన్నా నటించగా.. పార్తీబన్ విలన్ పాత్రలో కనిపించారు.



# పెద్ది టీజర్ కోసం అభిమానుల ఆసక్తి




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న తాజా చిత్రం 'పెద్ది' పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాలో చరణ్ రఫ్ అండ్ మాస్ పాత్రలో కనిపించబోతున్నాడు. ఇటీవల విడుదలైన ఈ సినిమా రెండో సింగిల్ 'రై రై రా రా' సోషల్ మీడియాలో సంచలనం సృష్టించగా.. ముఖ్యంగా రామ్ చరణ్ ఎనర్జిటిక్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. మరోవైపు ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ప్రస్తుతం గచ్చిబౌలి స్టేడియంలో క్రూషియల్ షెడ్యూల్‌తో బిజీగా ఉంది చిత్ర యూనిట్. నాలుగు రోజుల పాటు ఈ షెడ్యూల్ షూటింగ్ జరగనుందని సమాచారం. ఇక పెద్ది సినిమా నుంచి టీజర్ రిలీజ్‌కు రెడీ అవుతున్నారు మేకర్స్. అఫీషియల్ కన్ఫర్మేషన్ లేకపోయినా, రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా మార్చి 27న పెద్ది టీజర్ విడుదలయ్యే అవకాశం ఉంది. అయితే, చరణ్ బర్త్ డేకి మరో మూడు రోజుల సమయం మాత్రమే ఉంది. కానీ, ఇప్పటి వరకు పెద్ది టీమ్ నుంచి టీజర్ గురించి ఎలాంటి అప్డేట్ లేదు. మెగాభిమానులు మాత్రం ఈసారి తమ అభిమాన హీరో బర్త్ డేని గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకోబోతున్నారు. మార్చి 26 సాయంత్రం నుంచి హైదరాబాద్ శిల్పకళా వేదికలో గ్రాండ్ ఈవెంట్ ఎ÷-లాన్ చేస్తున్నారు. ఈ వేడుకకు రామ్ చరణ్ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని గ్రాండ్ సక్సెస్ చేయడానికి సిద్ధమవుతున్నారు. పెద్ది చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా.. నార్త్ అమెరికాలో మార్చి 26 నుంచి అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కానున్నాయి. ఇక్కడి నుంచి పెద్ది సౌండ్ గట్టిగా ఉంటుందని నమ్ముతున్నారు మెగాభిమానులు.

# ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన మోహన్‌లాల్



మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ తన వ్యక్తిత్వ హక్కుల రక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన అనుమతి లేకుండా తన పేరు, గొంతు, ఫోటోలు, సంతకం లేదా తన నటనకు సంబంధించిన ప్రత్యేకమైన హావభావాలను వాణిజ్య ప్రయోజనాల కోసం ఏ ఒక్కరూ వాడుకోకుండా చూడాలని ఆయన తన పిటిషన్‌లో కోరారు. ముఖ్యం గా ప్రస్తుత కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని ఉపయోగించి తన రూపాన్ని మార్చడం , తన గొంతును అనుకరిస్తూ తప్పుడు ప్రకటనలు చేయడం వంటివి తన గౌరవానికి భంగం కలిగిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డిజిటల్ అనామక వ్యక్తులు తన 'మోహన్ లాల్' అనే బ్రాండ్‌ను అక్రమంగా వాడుకోకుండా వెంటనే స్టే ఇవ్వాలని ఆయన న్యాయస్థా నాన్ని అభ్యర్థించారు. అయితే జస్టిస్ జ్యోతి సింగ్ నేతృత్వంలోని బెంచ్ ఈ పిటిషన్‌ను విచారించనుంది. గతంలో బాలీవుడ్ దిగ్గజాలు అమితాబ్ బచ్చన్, అనిల్ కపూర్, సోనాక్షి సిన్హాతో పాటు టాలీవుడ్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్ కూడా తమ ఇమేజ్ దుర్విని యోగం కాకుండా ఇదే తరహాలో ఢిల్లీ హైకోర్టు నుండి రక్షణ పొందిన విషయం తెలిసిందే. కోర్టు గనుక మోహన్ లాల్‌కు అను కూలంగా తీర్పునిస్తే, ఆయన అనుమతి లేకుండా ఆయన బొమ్మ లతో టీ-షర్టులు అమ్మడం, మీమ్స్‌లో వాణిజ్య ప్రకటనలు జోడిం చడం లేదా ఆయన గొంతుతో ఏఐ వీడియోలు సృష్టించడం వంటి వి చట్టరీత్యా నేరాలుగా పరిగణించబడతాయి. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'దృశ్యం 3' సినిమా కోసం అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.

ÔáPrinted, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL : +91 8333068787